THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY

OU_204014

UNIVERSAL LIBRARY



దుర్గాచరణ నాగ మహాశయుడు

శ్రీ రామకృష్ణాయ నమః.

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్రము

Checked 1969

బాల్యము

ఏ మహాత్ముని జీవనవృత్తాంత మిందు లిఖింపఁబడియున్నదో యాయనను గూర్చి పూజ్యపాదులగు వివేకానందస్వామి యిట్లు నుడువు చున్నారు. “ప్రపంచమునందనేక స్థలములను దర్శించితిని గాని నాగ మహాశయులవంటి మహా పురుషుని ఎచ్చటను గాంచనైతిని.”

వంగరాష్ట్రమునకుఁ దూర్పున నారాయణగంజి యను నోడ రేవుండెను. దాని కొకింత పశ్చిమముగా సుమారు రెండుమైళ్ల దూర మున దియోబాగను చిన్న గ్రామము కలదు. అందు దీనదయాళను శూద్రకులజుఁ డొకఁడు తన సహధర్మిణియు సుగుణాల గనియు నగు త్రిపురసుందరితో నివసించుచుండెను. పూర్వము వీరి వంశజులు తిలారది యను గ్రామమున నుండువారు; గాని రెండు మూఁడు తర ములనుండి దియోబాగునందే స్థిర నివాస మేర్పరచుకొనిరి.

దీనదయాళుని తండ్రి ప్రాణకృష్ణుఁడు. తల్లి రుక్మిణి. దీనదయా ళున కిర్వురు అక్కచెల్లెండ్రు. అందు పెద్దయామె యగు భగవతికి బాల్యావస్థయందే వైధవ్యము సంప్రాప్తింప నామె తన జీవితావశేష మంతయు సోదరుని యింటియందే గడపెను. రెండవయామె యగు భారతినిగూర్చి, యంత ముఖ్యాంశ మేమియుఁ దెలియదు. ఆమె

పుట్టినింటి కన్నడను బోయి యెఱుఁగదు. సోదరికంటె నీమెయే ముందు గతించినది.

దీనదయాళు పూర్వాచార పరాయణుఁడు, కర్మిష్ఠి. దేవబ్రాహ్మణులన్న నమిత గౌరవముఁ జూపుచు నూరియందందరికిని మిత్రుఁడై యుండెను. ఈతనికి కుమార్టులీలో నొక పెంకుటిల్లుదప్ప నొండాస్తి యేదియు లేదు. అందువలనఁ గుటుంబ పోషణార్థమై, కుమార్టులీ వాసులగు "మెస్సర్సు రాజకుమార్ హరిచరణ పాల్ చౌధరీ" వారి కంపెనీలో కొలఁది వేతనమునకుఁ బ్రవేశించెను.

"పాలులు" దీనదయాళు నొక మామూలు సేవకునివలెఁ గాక తమ కుటుంబములోని వానిగ నాదరించుచుండిరి. ధర్మభీరువు, సత్యనిష్ఠుఁడు, నిర్లోభి, యగు నాతని యెడ వారెంతయో విశ్వాసముఁ గలవారై యుండిరి. అప్పుడప్పుడు తామిచ్చుచుపైకములకు ఆతని నెన్నఁడును జమా ఖర్చు లెక్కలను జెప్పుమని వారడుగలేదు. ఒకసారి వేయి రూపాయిలు జమ తేలలేదు. వారా మొత్తమునంతయు ఖర్చుక్రింద చూపుమనిరి. తరువాత నొక సంవత్సరమునకు దాని నిజస్థితి తెలిసి దీనదయాళుని కిందు సంబంధములేనట్లు తెల్లమయ్యెను. అప్పటినుండి యాతని యెడ నింకను నమ్మిక వృద్ధిపొంద వారాతని యార్థిక స్థితికిఁ దోడ్పడు చుండిరి. ఇట్టి దింకొక సంగతి మఱిటఁబొం దుపరచుచో ఈతని నిర్లోభత్వము తేటపడగలదు.

మెస్సర్సు పాలులుప్పునందుఁ గూడ వ్యాపారముఁ జేయుచుండిరి. అందువలన నప్పు డప్పు డుప్పును నారాయణగంజి కెగుమతి జేయుదురు. కలకత్తా నుండి నారాయణగంజికిఁ బోవు మార్గము సుందరవనమను దుర్గమారణ్యములో నుండి పోవును. మార్గ మధ్యమున

దోపిడీ గాండ్ర బాధ మిక్కుటముగ నుండెను. దానఁ జేసి ధైర్య స్థుఁడును విశ్వాసపాత్రుఁడును నగు నొకనిని సరకుతోఁ బంపు చుండిరి.

ఒకసారి దీనదయాళు ఈ పనియందు నియోగింపఁబడెను. ఈతఁడు సుందరవనములో ప్రవేశించెను. కాని నిరపాయమగు స్థల మింకను జేర లేదు. చిమ్మచీఁకట్లు నల్గడలఁ గ్రమ్మెను. అందువలన దీనదయాళికిఁక ముందుకు సాగుట యపాయకరమని యెంచి, సామీప్య మున నొక పెద్ద పాడువడిన గృహమును, కృషీవలుల గుడిసెలను రెం టిని జూచి యచ్చట పడవలకు లంగరు వేయ నాజ్ఞాపించెను.

పడవకళాసు లందరును భోజనముఁ గావించి, నిద్రఁ జెందిరి. కాని, దీనదయాళు మాత్రము చేత నొక కఱ్ఱ బట్టుకొని పొగత్రా గుచు రాత్రి యంతయుఁ గడపెను. తెల్లవారుట వేగుజుక్క సూచిం చెను. ఐదుగంట లాయెను. ప్రభాత మల్లనల్లన సమీపించు చుం డెను. అంతఁ దీనదయాళు పడవఁ దిగి యా పాడుగృహమున కల సటఁ దీర్చుకొనుట కేగెను. రాత్రియంతయు మేల్కొని యుంటచే నేమియుఁ దోచక నొకచో వ్రేళ్ళతో భూమిని గీయుచుండెను. లోపల నేదియో యొక నాణెమున్నట్లు అతని కనుమాన మాయెను. అంత సంభ్రమముతోఁ గొంత మట్టిని దీసి చూడ దన యనుమానము వ్యర్థము కాలేదనుకొనెను. అవి పరీక్షింపఁ నవి బూర్వపు నాణెముల వలెఁ గన్పట్టెను. కాని యింతలో "యోయీ! యాశాబద్ధుఁడవు గాకుము. బ్రాహ్మణ విత్తమును విషతుల్యముగఁ జూడవలయును. ఈ ధనమొక బ్రాహ్మణునిదే యైనచో నరక మనుభవింప వలయు" నని దన యంతరాత్మ యుద్బోధించు చున్నట్లాతనికిఁ దట్టెను. మఱుక్షణ ముననే యా నాణెముల యథా ప్రకారముగ భూమిలో పూడ్చి పడవ

నెక్కి కళాసులకు నిముషమాత్ర కాలమైనను గడుపీయక లంగరు వదలించెను.

ఇట్లు తన జీవితమును నైతికముగను, పరుల కాదర్శముగను గడపుచు సోదరితోడను, భార్యతోడను సుఖముగా కాలము గడుపుచుండఁ గొన్నినాళ్లకుఁ ద్రిపురసుందరి గర్భవతి యయ్యెను. అంత నామె నవమాసములు మోసి B. S. 1253 భాద్రపద శుక్లపాడ్యమి శుక్రవారము నాఁడనగా క్రీ॥ శ॥ 1846 వ సంవత్సరమున ఆగస్టు 21 వ తేదీని శుభలగ్నమగు సింహలగ్నమున పూర్ణచంద్ర నిభుండగు నొక పురుష శిశువుఁ గనెను. పుత్రుని జననమునఁ దలిదండ్రులు సంతోషమునఁ గానుక లర్పించి యిరువది యొకటవ దినమున నా బాలునికి "దుర్గాచరణ నాగ"ని నామకరణముఁ జేసిరి.

బాలుని సంపూర్ణ నామము దుర్గాచరణుడైనను, పెక్కుమంది కీతడు నాగమహాశయ నామముననే సుపరిచితుడగుటంబట్టి ఈ గ్రంథమునకూడ "నాగమహాశయు" డనియే వ్రాయబడియున్నది.

నాగమహాశయుని యనంతరమున దీనదయాళున కిర్వురు కొమరితలు నొక కొమరుడునుఁ గలిగిరి. కాని దుర్గాచరణుని యనంతర జన్మినియగు శరదామిని దక్క దక్కిన యిర్వురును చిన్నతనముననే చనిపోయిరి. త్రిపురసుందరియు గొమరుని గుణకీర్తుల విని యానందించెడు నోము నోచుకొనక చిన్ని కొమరుని పురిటియందే కాలగతినందెను.

జనని మరణించు సరికి దుర్గాచరణుఁడెనిమిది వర్షములును, శరదామిని నాల్గు వర్షములును ప్రాయము గలిగి యుండిరి. దీనదయాళు పునర్వివాహముఁ జేసికొనుట కేమాత్రమును సంకల్పితుఁడు

కాలేదు. అందువలనఁ గుఱ్ఱల సంరక్షణ భారము సోదరియగు భగవతిపైఁబడెను. ఆమెయు మాతృవిహీనులగు నీ సోదరీ సోదరుల నత్యంతముఁ బ్రేమించుచుఁ దల్లి లేని లోటుఁ దీసివైచెను. ఇరువురిలో దుర్గాచరణుఁడన్న నామె కమిత మగు ప్రేమ. ఆకారణము ననే నాగమహాశయుఁ 'లీ నామేనత్త పూర్వజన్మమున నా జననియై యుండవలెనోపు' నను వాడు.

నాగమహాశయుని బాల్యముఁ గూర్చి కొలది మాత్రమే తెలియును. ఆతఁడు మధుర వాచ్యుఁడనియు సుశీలుఁడని వినీతుఁడనియు మాత్ర మైతిహ్యమై యుండెను. ఆరోగ్యవంతమై పుష్టిగల యాతని కాయము చూపరుల కానందముఁ గొల్పుచుండెను. ఆతని వినీల కుంతలము లెంతటి వానినైనను ముగ్ధునిఁ జేయును. చేతులకు రెండు వెండి మురుగులు దక్కఁ దక్కొండు వస్తువేదియు లేక పోయినను ప్రకృతిసిద్ధమగు నాతని సౌందర్యము వస్తువులు లేని లోటుఁ గప్పి పుచ్చెడిది. చుట్టు ప్రక్కల స్త్రీలెవ్వరు జూచిన నొక సారి యెత్తి కొని ముద్దిడక నుండరు.

సాయంసమయములందుఁ దన దృష్టు లాకాశ వీథికిఁ బరపి నక్షత్ర మండలముఁ జూచుచుఁ బ్రక్కనున్న మేనత్తను సంబోధించి "అమ్మా! మన మెందులకా మండలమునకుఁ బోఁగూడదు? నాకిక్కడ నుండుట కెంతమాత్ర మిష్టము లే"దనును. చంద్రుఁడాకాశ మధ్యంగతుఁ డగు కొలఁదియు నుల్లాసముతోఁ జప్పటలు జరచును. చెట్లు గాలి కల్లలాడు నప్పుడవి దన్ను పిలచు చున్నవని భావించి "అమ్మా! నేను వాటితో నాడుకొందు నని" యవి నిజమైన యాటకాండ్రని వాని కదలికలఁ దా ననువదింపుచుండును.

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్రము

మేనత్తయును భగవతి పురాణ గాథలు చెప్పుటలో మిగుల నేర్పరి. అనుదినమును పురాణముల నుండి కథలనెత్తి చెప్పుచుండెడిది. ఒకవేళ భగవతి దేహమందలి రుగ్మత వలనఁగాని పనితొందర వలనఁగాని మరియే కారణముచేతనైనను కథఁ జెప్పుట మానినచో మహాశయుఁడామెను విసివించి యొక చిన్నకథనైన వినకుండఁ బరుండువాఁడు కాఁడు. పరుండు నప్పుడీ కథలే స్ఫురణకు వచ్చుటచే వానినే కలగాంచును. ఒక్కొక్కప్పుడు దేవతా విగ్రహములను గాంచి యులికి పడి లేచును గాని ప్రక్క, దినమెల్లను కష్టపడి అలసి మైమరచియున్న మేనత్తను లేప సాహసింప లేక తెల్లవారు వరకామె ప్రక్కనే కూర్చొని ప్రొద్దుటఁ దాఁగన్న కల తెరంగెరింగించెడి వాఁడు. భగవతి యది విని యాశ్చర్యమందెడిది.

పురాణ ప్రసిద్ధుఁడగు ప్రహ్లాదుని వలె నాగమహాశయులుఁగూడ బాల్యము నుండియు నాటల విరక్తి గల్గి యుండెను. కాని తన చెలికాండ్రను సంతసపరచుటకై యప్పుడప్పు డాడును. అయిన నొక్కమారైన నాట విషయమైగాని హాస్యమునకుఁగాని యనృతంబాడి యెఱుఁగఁడు. మరియుఁ దన స్నేహితు లెవరైన యసత్యముఁ బల్కినచో తత్క్షణమే వారిని తన స్నేహిత బృందమునుండి తొలగించును. అతడు పశ్చాత్తప్తుఁడై ఇక నెన్నడును అనృత మాడనని ప్రతిజ్ఞ చేయువరకును అతనితో స్నేహము చేయువాఁడుకాఁడు. బాల్యమున ఎవ్వరితోడను కలహమాడి ఎఱుఁగఁడు. ఒక్కొకప్పు డాటలలో రెండుపక్షములకుఁ దాను మధ్యవర్తియై న్యాయాన్యాయ విచక్షణఁ జేయును. బాలు రితని ప్రజ్ఞకు హర్షమంది దమ నాయకునిగఁ జూచువారు.

బాల్యము

ఇట్లు నాగమహాశయులు పిన్నలకును పెద్దలకును తలలోని నాలుకయై బాల్యావస్థయొక్క యంత్యసోపాన మధిష్ఠింపఁ జొచ్చెను. వయోవృద్ధుఁడగు కొలఁదియు జ్ఞాన సంపాదనాభిలాష వృద్ధి కాఁజొచ్చెను.

ఆ కాలమున వంగరాష్ట్రమున నిప్పుడున్నన్ని పాఠశాలలు లేవు. నారాయణగంజిలో నొక బడియుండెను. దీనిలో నాగమహాశయులు ప్రవేశ పెట్టఁబడెను. కాని యా బడిలో మూఁడవ తరగతి వరకు మాత్రమేయుండుటచే పైకిఁ జదువుట కవకాశము లేదు. ఇది యాతని కెంతయు విచారకరముగ నుండెను. దుర్గా పూజాకాలమునఁ దండ్రి, యింటికివచ్చినప్పుడు దాను కలకత్తాకుఁ బోయి చదువు కొందు ననెను. కాని కుటుంబము యొక్క యార్థిక స్థితి మిక్కిలి తక్కువగుటచే నాయుద్యమమున కాతఁడు స్వస్తిచెప్పవలసివచ్చెను.

ఆశాభంగమైనను పట్టుదల గలవాఁడగుటచే నాగమహాశయులు సమీపమున నేదేని పాఠశాలను వెదకి యచ్చటఁ బ్రవేశింప వలయునని తలంచెను. దియోభాగునకు పదిమైళ్ళదూరమున నొక పాఠశాల యున్నదని తెలిసి యచ్చటఁ జేరుటకు నిశ్చయించు కొనెను. మేనత్తకిది యిష్టములేదు. మిగిలిన స్నేహితులును వలదని వారించిరి. అయినను వారి మాటల సరకు గొనక మరునాటి యుదయముననే దారి బత్తెములకొక పిడికెడటుకులను దీసికొని ఢక్కాకుఁ బయన మయ్యెను. ఢక్కాలో నొక జాతీయ పాఠశాలను (Normal School) గాంచి మగిడి గృహాభిముఖుఁడయ్యెను. ఇంటికిఁ జేరు సరికి చాల రాత్రి యయ్యెను. అప్పటి కీతని కొరకెన్ని చోటులనో వెదకి భయభ్రాంతయై నిరీక్షించుచున్న భగవతి యాతనిఁ గాంచి సంతోషమునఁ భోజనమిడి యాతని యదృశ్యమునకు హేతువడిగెను. అంత నాతఁడు ప్రొద్దుట

లేచినది మొదలు జాతీయ పాఠశాలం గాంచిన వరకు జరిగిన వృత్తాంత మును సాంగముగం జెప్పి "అమ్మా! రేపటి నుండి ప్రతి దినమును చదువు కొనుటకు ఢక్కాకుం బోవలయును. కనుక నీవు ఉదయమున నెనిమిది గంటలకే వంట సిద్ధము చేయవలయు" ననెను. ఇట్టి నిశ్చయమును శ్రద్ధనుం జూచి యాశ్చర్యపడి "నాయనా! అటులనే చదువుకొని రమ్ము. మార్గమధ్యమున కష్టములు ప్రాప్తింపకుండ భగవంతుండు నిన్ను రక్షించుంగాత!" యని దీవించెను.

మరుసటి ప్రాతఃకాలముననే నాగమహాశయులు ఢక్కాకుం బోయి పాఠశాలయందుం బ్రవేశించెను. ఈ పాఠశాలలో పదునేను మాసము లభ్యసించెను. ఈసంవత్సరము మూండుమాసములలో రెండు దినములు మాత్రమే బడికి హాజరు కాలేదు. ఎండకును వానకు జలికిని సహించి యోర్పుతో, పట్టుదలతో విద్య నభ్యసించెను. కాని యలసట యనునది గాని, విసువనునది గాని యాతని ముఖమున నెన్నండుం దోంపలేదు. యేదినముననైన మార్గమధ్యమున నాకలి గొన్నచో నొక పైస యటుకులం గొని దారి పొడుగునం దినువాండు.

ఇట్లు ఢక్కానుండి గృహమునకు వచ్చునప్పు డొక్కొక్కప్పు డాతనికి భూతములు మొదలగునవి కాన్పించెడివి. దయ్యములు మొద లగు వానిని గూర్చి యాతండిట్లు చెప్పువాండు:—"భూతప్రేతపిశాచా దులు మిథ్యలుకావు. ఎందువలనన ఠాకూరు (శ్రీరామకృష్ణ పరమ హంస) అవన్నియు సత్యములనువారు. నేను ఢక్కాకు నడచి పోవుదినములలో నొకనాండు గృహమునకు మరలివచ్చుచుండ త్రోవలో, బాలునివలె నొకభూతము కాన్పించెను. ఆ భూతము సమీపముననున్న యొక పెద్ద రావిచెట్టున కానుకొని పశ్చిమ ముఖముగా నిలబడియుండెను. అసలు నేను అనుమానముతోను

చెఱువులోను వచ్చుచుంటిని. దానిపై హఠాత్తుగా యిది కాన్పిం చెను. అందువలన కాళ్లు వడక కూర్చొనిపోతిని. కాని ఎంత సేపు చూచినను ఆ భూతము కనఁబడలేదు. చివరకు 'నేను ఎవ్వరికిని అపకారము చేయలేదు. మరి నాకెవ్వరపకృతి యొనర్తురు'? అని ధైర్యము తెచ్చుకొని నిలబడితిని. నెమ్మదిగ ముందునకు సాగితిని. అశ్వ త్థవృక్షము క్రిందికే వచ్చితిని కాని నాకేమియు అగుపడలేదు. ఇంకను దగ్గరకుపోతిని. ఇంతలో నాకు వెనుకనొక భయానకాట్టహాసము తో నొక శబ్దము వినవచ్చెను. కాని వెనుకకు తిరిగి చూడలేదు. డకాకు పోయివచ్చునప్పుడు రెండు మూఁడు సారులాభూతము కాన్పించెను. కాని ఈ వృత్తాంతమెవరికిని చెప్పలేదు. చిట్టచివరకు చూడంజూడ నది కూడ మనుష్య దర్శనమువలెనే యైపోయెను."

ఈతని తదేకదీక్షకును, తెలివికిని కడు జాలినంది యా పాఠశాల లోని యుపాధ్యాయుఁ డొకఁడు, దగ్గరకుఁ బిలచి "నాయనా! నీవనుదినమునుఁ బదిమైళ్లు నడచి వచ్చుచు మరల నింటికి నడచియేపో వుచు నీ దేహారోగ్యమునకు భంగము కలిగించుకొనకుము. మాయింట నుండుము. నీకగు ఖర్చుల నేనే భరింతు" ననెను. కాని ధైర్యస్థుఁడగు నాఁతఁ "డయ్యా! యిచ్చటికి వచ్చి చదువుకొని పోవుటయం దెంత మాత్రమును కష్టము లే"దనెను. ఈ పలుకుల కాశ్చర్య మంది యాతఁ డొక యపూర్వపురుషుఁడై లోకమున కాదర్శప్రాయుఁడై యుండు ననుకొనెను. పాప మా యుపాధ్యాయుడింకను జీవించి యుండిన దన సూచన వ్యర్థము కాలేదని తెలిసికొని యుండెడివాఁడు.

నాగమహాశయులు జాతీయ విద్యాలయములో కొలఁది కాలమే చదివెను. కాని యీ స్వల్పకాలములోనే బంగాళీ భాషను పూర్తిగ నభ్యసించెను. దస్తూరి ముద్దుల మూట గట్టుచుండెను. వ్యాసము

లన్నియు సరళముగను భావయుక్తముగను నుండెడివి. ఆకాలమున వ్రాసిన వ్యాసములన్నియు మతవిషయికములై యుండెను. తరువాత నాతఁడు వైద్యవిద్యాభ్యాసమునకుఁ గలకత్తాకు వచ్చినపుడా వ్యాసములను "బాలురకుపదేశము" ను శీర్షిక క్రింద కరపత్రముల వలె పంచిపెట్టించెను.

కరపత్రములుగ పంచిపెట్టఁబడు వరకు నవి వ్రాయఁబడినట్లెవరికినిఁ దెలియదు. చివరకు ప్రాణమిత్రుఁడైన రమేశచంద్ర దత్తు గూడ నవి ముద్రింపఁబడి యాతనికిఁ బంపఁబడు వరకు నెఱుఁగఁడు.

విద్యాభ్యాసానంతరమునఁ బుస్తకము లన్నియు· నూరిపిల్లలకు పంచిపెట్టెను. ఇప్పటికిని దియోబాగునందు కొలదిప్రతులు లభింప గలవు.

నాగమహాశయుని యొక్క పరమభక్తుడగు హరప్రసన్న ముజుందారును, మహాశయుని భార్యయు నాతనిబాల్య జీవితమునందలి కొన్ని యంశములను గూర్చి యాతడు చెప్పగా వినిరి. వానిని వ్రాసి పత్రికాసంపాదకులకు పంపుచు హరప్రసన్నుడు వ్రాసిన లేఖ నిట బొందుపరచుచున్నాము.

"నాగమహాశయుని బాల్యజీవనముఁగూర్చి గాని యాతని జీవితమందలి మరియే ఘటనను గూర్చిగాని నాకు తెలియదు. వాని నెవ్వరును వ్రాసియుండలేదు. ఆయనతోడి పరిచయము లభించినప్పటి నుండియు, నాకాయన యుపదేశరూపకముగా చెప్పియుండిన కొన్ని యంశములను జ్ఞాపకార్థమై· నేనొక పుస్తకమున వ్రాసి యుంటిని. అందు కొన్నిటిని మీకోరికపై నిట వ్రాయుచున్నాను. అవి మీకుగూడ తెలిసియే యుండును. కాని మీ అనుబోధ

మును త్రోసిపుచ్చుటకు సాధ్యముకాలేదు. ఎందువలనన మీరు ఆయనయొక్క ప్రియసంతానమని ఎఱుగుదును. ధర్మసంబంధమున నాసహాయమువలన, ఎవరికైనను ఉపకారము జరుగుచో, నేను ఏకాగ్రహృదయముతో, అకుంఠితచిత్తముతో అద్దాని నొనర్చుట కంగీకరింతును. దీనివలన నాస్వార్థమునకు భంగము వాటిల్లినను విషయ సంపర్కమును విడువవలసి వచ్చినను, మీకు లేశమాత్రమైన నుపకారము కలుగుచో, అప్పుడు నేను ధన్యుడనైతి ననుకొందును.

“సత్యకథనము విషయమై మహాశయులాయన జీవితమందలి యొక ఘటననిట్లుచెప్పెను:—ఒకపరి నాగమహాశయులు మిత్రులతో నాడుకొనునప్పుడు, తమ ఎదిరిపక్షమును గెల్చుటకు వారాతని నొక యసత్యవిషయమును చెప్పుమని బ్రతిమాలిరి. కాని యాతఁడంగీకరింపలేదు. దానిచే వీరిపక్ష మోడిపోయెను. అంతనాతని బాల్యస్నేహితులు క్రోధపరవశులై యాతని పంటభూములలోనికి గొంపోయి యాతని కోమలాంగమును చితుకగొట్టిరి. మహాశయుఁలప్పుడు పడినబాధ జ్ఞప్తికి వచ్చుచో ఇప్పటికిని నాకశ్రువులురాలును. ఇట్లకారణముగ నాతని మిత్రులు శిక్షించి “ఈమారునీ సత్యకథనమువలన మాకోటమిగలుగుచో దీనికంటె నెక్కుడు శాస్తిచేయుదు” మనిరి. మహాశయులు రక్తాప్లుతకాయముతో గృహమును చేరుకొనెను. ఆతఁతండ్రియు మేనత్తయు దానిఁగూర్చి యడిగిరి. కాని యిదిచెప్పుచో పొరుగువారితో కలహములు సంప్రాప్తించునని యావంతయు ఎరుకపరుపలేదు.

“13, 14 సంవత్సరముల వయస్సున ఆయన ఢక్కాలోని వైద్యకళాశాలలో ప్రవేశించెను. కాని శ్రద్ధేయ సురేశచంద్రదత్తు ఇట్లు చెప్పుచున్నాడు:—“ఈ మాట సత్యముకాదు. నాగమహాశయులు కలకత్తాలో ఒకటిన్నర సంవత్సరములు క్యాంబెల్ వైద్యవిద్యాలయ

మున చదివెను. తరువాత హోమియోపతిని అభ్యసించెను. డక్కా నార్మల్ స్కూలునకును పోవుచుండెను. కలకత్తాలో నాతో నాతనికి పరిచయము కలిగినప్పటికి అతడు హెయిలీవ్యాకరణమును చదువుచుండెను. అందు పెక్కు భాగముల నాతడు కంఠస్థమొనర్చెను. కాని యన్ని పదములను సరిగ నుచ్చరింపలేక పోవువాఁడు. అందువలన నాతనితో 'మీ బంగాళా దేశమునఁ బండితులు జన్మించియున్నారు. కాని ఈదేశవాసులవలె నాంగ్లమును మాట్లాడలే'రంటిని. అతఁడు నావద్ద కొంచెమాంగ్లము నభ్యసించెను."

ప్రాతఃకాలముననే భగవతివంటసిద్ధముచేసెడిది. మహాశయులు భుజించి డక్కాకు నడచిపోవును. మరలనడచియే గృహమునకు వచ్చును. ఒకనాడట్లు డక్కానుండి వచ్చుచు ఫతుల్లా యనుగ్రామమును సమీపించుసరికి భయంకరమగు గాలియు వానయు వచ్చెను. గాఢాంధకార మలముకొనెను. ప్రళయమున కిది సూచనయా యనునట్లుండెను. ఫతుల్లాలోని దుకాణములన్నియు మూయబడెను. ఎవరిని బిలచినను తలుపుతెరచునట్లులేదు. ఆతని కోమలహృదయము తనకొరకు ఇతరులను విసివించుట యెంతమాత్రమును ఓర్వకుండెను. అందువలన నా గాలికిని వానకును తలయొగ్గి ముందునకు పోసాగెను. అప్పుడు వైశాఖమాసము. భయంకర మేఘగర్జనములును, ప్రచండ మారుతమును, వృష్టియు నాతని భయభ్రాంతుని జేసెను. కాని యట్లే మెఱపుల వెలుంగున త్రోవజూచుకొనుచు పోవుచుండెను.

ఆతనిమార్గము నారాయణగంజి కనతిదూరముననున్న శ్రీ లక్ష్మీ నారాయణస్వామి యాలయ సామీప్యమునుండి పోవును ఆ మార్గమధ్యమున నొక తటాకము కలదు. నాగమహాశయు లట్లా రాత్రి పోవుచు బోవుచు, కాలుజారి యందు పడెను. ఎంతప్రయ

త్నించినను లేవలేక పోయెను. తుదకటనున్న రెల్లుగడ్డిని పట్టుకొన జూచెను. కాని యదియు చేజిక్క లేదు. అప్పుడాతని మనమున కొక్క మేనత్తయే జ్ఞప్తికి వచ్చుచుండెను. ఈ వరకామె తన కొరకు వెదకి వెదకి ఎంత వ్యాకులపడుచుండెనోయని యనుకొనుచు రామనామము జపించుచు తుదిసారి ప్రయత్నించి ఎట్టకేలకెంతో కష్టముమీద నా తటాకమునుండి పైకివచ్చెను. ఈతడటనుండి గృహమునకు బోవునప్పటికి భగవతి చింతాక్రాంతయై దీపమును బట్టుకొని యింటి వెలుపలకువచ్చి మేనల్లుని పేరుతో పిలచుచుండెను. మహాశయులు లోనికేగిరి. ఈ విషయమందలి లేశమాత్రమైనను మేనత్తతో చెప్పక "నేడు మార్గమున మిగుల తడిసిపోతిని. అంతకంటె వేరేమియు లే"దనెను.

వైద్యవిద్యాభ్యాసము.

నాగమహాశయునిప్పుడు యుక్తవయస్కుడయ్యెను. ఈతని సంసార బంధము వృద్ధిచేయఁ దలంచి మేనత్తయగు భగవతి తొందర పెట్టసాగెను. అందువలన దీనదయాళు విక్రమపురమందలి రాయి జదియా నివాసియగు శ్రీ జగన్నాధ దాసుయొక్క పదునొకండేండ్ల బాలిక యగు శ్రీమతి ప్రసన్నకుమారితో సంబంధము నిశ్చయించెను.

నాగమహాశయునకును ఆతని సోదరియగు శరదామినికిని ఒకే దినమున వివాహములాయెను. మహాశయునకు సంధ్యాసమయమునను శరదామినికి రాత్రియందును ముహూర్తములు కుదిరెను.

వివాహమైన రైదు మాసములకు దుర్గాచరణుడు తండ్రియొద్ద కలకత్తాలో నుండుటకుఁ బోయి యచ్చటనున్న క్యాంబెల్

(Campbell) వైద్యవిద్యాలయమునఁ జేరెను. ఈ విద్యాలయమున నొకటిన్నర సంవత్సరములు చదివెను. తరువాత కారణాంతరములవలన నావిద్యనుండి విరమింప వలసి వచ్చెను. అట్లెందులకు విరమింప వలసి వచ్చెనో అది, ఈతని జీవితమందలి కొన్ని విషయములవలె దురూహ్యము. పాపమీతనికి విద్యాతృష్ణ తీరదాయెను.

తన ప్రయత్నముల కెన్ని యంతరాయములు కల్గినను కృషి మాత్రము మానకుండెను. కలకత్తాలో డాక్టరు విహారీలాల్ బహాదురీ అను నాతడు హోమియోపతి వైద్యమందు ప్రసిద్ధికెక్కెనని విని యాతనివద్దఁ జేరెను. డాక్టరీతని వినయ విధేయతలకును, విద్యయందలి శ్రద్ధకును గడుంగడు హర్షమంది జాగ్రతతో విద్య గరపుచుండెను. వైద్యానుభవము కలుగుటకై తనతో రోగులను పరీక్షించుటకు తీసికొని పోవుచుండెను. మహాశయు లాతడు చెప్పిన దంతయు నతి శ్రద్ధతో గ్రహించుచుండెను. ఇట్లు రెండు సంవత్సరములు గడచెను.

విద్యానంతరమునఁ గూడ వైద్యశిక్షణమునకై కలకత్తాలో నుండ వలసి వచ్చెను. దానిచే నాతని భార్య పుట్టినింటి యందే యుండెను. అందువలన వీరి మైత్రి కేమాత్ర మవకాశము కలుగలేదు. తరువాత నెప్పుడైనను పరస్పర దర్శన మైనను యామె దరికేగుటకు (సిగ్గు) భయపడుచుండెడివాఁడు. ఆతఁడు తన యూరి కేగినప్పుడు భార్య యచ్చటున్నచో నామె సాన్నిధ్యమునఁ దన కేమైన మనో వికారము గల్గునేమో యని యొక వృక్షమునెక్కి రాత్రియంతయు నందే గడపును.

దీనదయాళునొద్ద యోగమాయ యను పరిచారిక యుండెను. ఆతఁడామెను పుత్రికకంటె నెక్కుడుగ చూచువాఁడు. నాగమహాశయు

లామెను "అక్కా" యని పిలుచును. యోగమాయ అప్పుడప్పుడు దీనదయాళుతో డియోబాగు వచ్చెడిది. అప్పుడు మహాశయులు భార్య యెడ చూపునిట్టి ప్రవర్తనమును ఆమెచూచి సురేశునితో చెప్పెడిది.

ఇట్టి యాతని విచిత్ర చర్యలఁజూచి భగవతి కేమియుఁ దోచకుండెను. అయినను మనసును సమాధానపరచుకొని, తన మేనల్లుఁడును కొంతకాలమునకు నడవడిమారి మార్గమునకు వచ్చు ననుకొనెను. కాని "తానొకటి తలచిన దైవమొకటి తలచు" ననునట్లు బాలిక గ్రహణి రోగపీడితయై కాలధర్మము నొందెను.

ఇది నాగమహాశయులకు కొంత మనోవికలత్వముఁ గలిగించెను గాని సర్వేశ్వరుఁ డిట్లు తన్ను బంధవిముక్తునిఁ జేసెననుకొని సంతసించెను. అయినను తండ్రిమాత్రము కుమారునకు పునర్వివాహము చేయ సంకల్పించి తన యల్లునిఁ దగు సంబంధముఁ గుదుర్చుమని నియమించెను.

భార్యావియోగముఁ జెందిన కొన్నినాళ్ళకు నాగమహాశయులు మరల హోమియోపతి వైద్యవిద్య నభ్యసింప నారంభించెను. అంతకంతకాతనికి వైద్యమందనుభవము హెచ్చియొకమందుల పెట్టెను కొని బీదలకుచితముగా వైద్యము చేయనారంభించెను. ఈతని నిపుణతఁజూచి యప్పుడప్పుడు బహాదురీ కూడ ఈతని సలహా గోరుచుండెను. మహాశయులు రోగిలక్షణములఁ దిలకించి రోగవిశేషము నిశ్చయించి మందుల నిర్ణయించుటయం దసమానుఁ డయ్యెను.

క్రమక్రమముగ నీతని పేరు నల్దిక్కుల వ్యాపింపసాగెను. తా నొక విద్యార్థిమాత్రుఁడై యున్నప్పుడే బీదల కంగరక్షకుఁడై

యుండెను. ఇప్పుడు లక్షలకొలఁది జనులాతని గృహమునుఁ జుట్టుముట్టు చుండిరి. ధనసంపాదనాభిలాష యే యుండినచో నట్టియదనున విరివిగ నార్జించి యుండవచ్చును గాని బీదల కుపచరించుటయే యాతని ముఖ్యోద్దేశ్యంబగుట నందుల కియ్యకొనలేదు.

దరిద్రులకును ఆర్తులకునుఁ బరిచర్య సేయుటయం దతనికత్యంతోత్సాహము. పరోపకారార్థమై యెంతటి నీచ కార్యమొనర్ప వలసి వచ్చినను వెనుదీయఁడు. ఇది గ్రహించి యాతని తండ్రి స్నేహితులొక కొందరు అతనిచే అప్పుడప్పుడు బజారు సరుకులను దెప్పించుకొనువారు. విపన్నులకు పరిచర్యచేయుటకు మహాశయు లెప్పుడును సంసిద్ధుఁడై యుండును. హాట్ఖోలాలో ప్రేమచంద్ మున్షీయను ధనికుఁడొకఁడుండెను. అతనికొక దూరపు బాంధవ్యముగల దాయాది యొకడుండెను. ఆతఁడతనియింట అన్నమువండుట మొదలగు నన్ని పనులను చేయుచుండెను. ఆదాయాది యనుదినమును స్నానమునకుఁ బూర్వము మహాశయుల గృహమునకేగి యట నాతఁడొసగు పొగచుట్టలను కాల్చి యాతని నడిగి శిరస్సునకు నూనె రాచికొని యటుపిమ్మట గంగానదికిఁ బోయి స్నానమాచరించి గృహమునకు మరలును. ఇది యాతనిదినచర్య యైపోయెను. ఇట్లు దినములు గతించుచుండ దైవవశమున నొకనాఁడా బంధువు మరణించెను. ప్రేమచందు పరమలోభి. పొరుగువారితో కలసియున్నచో ధనవ్యయమగునన్న భయముచే ఎవ్వరిని దగ్గరకు చేరనిచ్చువాఁడుఁకాఁడు. ఇప్పుడాపద వచ్చినది. ఎవ్వరును అతని గుమ్మముత్రొక్కి చూచుటలేదు. ధనికుఁడు ప్రతియింటికిని బోయి సహాయము చేయుఁడని వేఁడుకొనెను. కాని ఎవ్వరును రాలేదు. అన్యోపాయములేక తుదకాతఁడు నాగమహాశయుల నాశ్రయించెను. అప్పుడు

వైద్యవిద్యాభ్యాసము

పితాపుత్రు లిర్వురును శవదహన మొనర్చి యాతని నా విపత్తునుండి రక్షించిరి.

డాక్టరు విహారీలాలువద్ద విద్య పూర్తిగావించి స్వతంత్రముగ వైద్యముఁ జేయ నారంభించు దినములలో నాగమహాశయులకు హాట్కోలా నివాసియు సుప్రసిద్ధ దత్తా కులజుఁడు నగు సురేశునితో స్నేహము గలసెను. సురేశుఁడు మహాశయులను "మామా" యని పిలుచువాఁడు. సురేశుఁడు శ్రీరామకృష్ణ కృపాలాభమును పొందుటకు పూర్వము బ్రాహ్మమతావలంబియై విగ్రహారాధన యందును అనేక దేవతల నారాధించుట యందును విశ్వాసము లేక "ఏకమేవాద్వితీయ" మను యుపనిషత్ప్రమాణమున నిరాకారపరబ్రహ్మమును మాత్రమే యుపాసించుచుండెను. నాగమహాశయులు పూర్వాచార పరాయణుఁడై దేవతలయందు భక్తి గలిగి యుండెను. ఇర్వురియం దింత భావభేద మున్నను నాగమహాశయుల సుగుణ సంపదకు మెచ్చికొని సురేశుఁ డతనియందు గాఢస్నేహము గలిగియుండెను. కాని యప్పుడప్పుడు మతవిషయికములగు వాగ్వాదములు జరుగుచుండెడివి. ఆచర్చలలో మహాశయులు "విగ్రహారాధకులచే నర్చింపఁబడు దేవతలును, నీవను నిర్గుణ బ్రహ్మము నొక్కటే. వీరిలో నెవరిఁ గొల్చినను ముక్తి గల్గుట తథ్యము. కాని బ్రహ్మసాక్షాత్కార మనునది మిగులఁ గష్టతరమైనది. ఎంతయో సాధనపై ఎన్నియో జన్మములకు బ్రహ్మజ్ఞానము కలుగును. మరియుఁ గోటిలో నొక్కనికైన నగునో కాదో యని సందియము. అందువలననే దేవతలయందు నమ్మిక యుంచుట ముఖ్యము. సురేశా! నీవు వేదములు పురాణములు మతగ్రంథములు ఇవి యన్నియుఁ బూటకము లనియెదవా? బ్రహ్మమును తెలిసికొనుట సర్వధర్మసాధనల యంత్యావస్థ. అయినను బ్రహ్మసాక్షాత్కారమను నది వీని మూలముననే కలుగు

చుండు"నని యీరీతిగ వాదించును. సురేశుఁడీ మంత్రముల యందును తంత్రములయందును దనకు నమ్మకము లేదనియు వానిని నమ్మ జాలననియు మహాశయుని వాదమును ఖండించును.

సురేశుఁడు నాగమహాశయుని సిద్ధాంతమునంతయుఁ బూర్వ పక్షమొనర్చినను, ఆతని బ్రాహ్మణ భక్తియు విగ్రహసాన్నిధ్యమునఁ జేయు సాష్టాంగదండప్రణామములును తప్పక నాతని కచిరకాల ములో బ్రహ్మసాక్షాత్కార మొనరింపఁ గలవని యనుకొనువాఁడు.

సురేశుఁడు ప్రతిదినమున సాయంకాలమున మహాశయుల గృహ మునకుఁ బోవువాఁడు. ప్రతిదినమును వాదప్రతివాదములు జరుగు చుండెడివి. కాని యొకరి విశ్వాసము నొకరణచివేయఁ జాలకుండిరి. ఇట్టి భేద స్వభావులకును ద్వంద్వాభిప్రాయులకును మైత్రి యెట్లు సం ఘటిల్లెనో కాని మొదటిదినమునఁ గలసికొనినది మొదలు యావజ్జీవమును ప్రాణమిత్రులై యుండిరి

సురేశుఁడు నాగమహాశయుల నప్పుడప్పుడు కేశవచంద్రసేనులు స్థాపించిన నవవిధాన బ్రహ్మసమాజమునకుఁ దోడ్కొనిపోవువాఁడు. కేశవుల వక్తృత్వమునకు మహాశయులు ముగ్ధుఁడయ్యెడివాఁడు. కాని సమా జము యొక్క నడవడిక యాతనికి నచ్చకుండెడిది. బ్రహ్మసమాజ ప్రణీ తములగు "చైతన్యచరిత్రము" "రూపసనాతన్" "మహమ్మదీయ సాధు శ్రేష్ఠుల జీవితములు" మొదలగు గ్రంథముల ననేకములను మిగుల శ్రద్ధతో పఠించెను. నవవిధానసమాజ కీర్తనమగు "ఆమాయ్ దేమా పాగల్ కొరే" (నన్నునీ ప్రేమచే ఉన్మత్తుని జేయుము) అనుదాని నున్మత్తభావముతో పాడును.

ఇట్లు మిత్రులిర్వురు తమతమ మతములయందు ఆసక్తితో ప్రవర్తించుచు నొకరికొకరు ప్రాణాధికులై యుండిరి. స్నేహానుభ

వైద్యవిద్యాభ్యాసము

వృద్ధియైన కొలఁదియు మహాశయుల నిష్కళంకమగు జీవితము సురేశుని హృదయమున నాటుకొనుచుండెను.

మహాశయులు బాల్యమునుండియు భగవద్భక్తిపరులై యంత్యమువరకుఁ దన కులాచారధర్మముల ననుష్ఠించుచు, జీవిత యాత్రఁ జేసెను. చిన్నతనమునఁ (పెర్షియన్ భాష కనువాదము) "హాతింతాయి" యను గ్రంథముఁ జదివెను, గాని భగవంతుని యందతని భక్తి లేశమైనను తగ్గలేదు. మరియు నాతనిమిత్రులు కొందరు నాస్తిక గ్రంథములు చదివి వాదించునప్పుడు తానా వాదమున పరాజితుడైనను, దృఢమనస్కుడై "నిత్యుఁడును, సర్వవ్యాపకుఁడునైన, యీశ్వరుని గూర్చి వాదములు సల్పుట వలని ప్రయోజనమేమి? సూర్యునివలె నా ప్రభువు స్వయం ప్రకాశుడు. నాకు భగవంతుని గూర్చి యావంతయు సందియములే" దని తన నిశ్చితాభిప్రాయమును దెల్పును.

ఇట్లు మహాశయులు చర్చలఁజేయుచు కాలములో చాలభాగము భక్తిపరుఁడై భగవత్తత్త్వచర్చలయందును ప్రార్థనల యందును గడుపుచుండెను. దినమున నొక్క నిముషకాలమైనను వ్యర్థముగ గడుపకుండెను. సంస్కృతభాష రాకపోవుటచే బంగాళీ తర్జుమాలను చదువుచుఁ బండితుల సంపర్కమున భాగ్యము లభించినప్పుడు శాస్త్రములకు సరియగు నర్థమును బోధింపుమని వారిని వేడుకొనును. ఈ గ్రంథపఠనము వైద్యాభిరుచినిఁదగ్గింప సాగెను. వైద్యోపయుక్తమగు కాలమును గూడ గ్రంథపఠనమునకే వినియోగించుచుండెను. కాని జనకుని యాతురతకుఁ జాలిపడి యొక్కమారుగ డాక్టరు బహాదురీ లాలుతోడి సంబంధమును వదలించుకొనలేక పోయెను.

మహాశయులు సదాచారపరులు. కర్మిష్ఠి. ప్రతి యేకాదశి యందు నుపవాసముండును. అను దినము నుదయాత్పూర్వమే

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్రము

మేల్కొని పవిత్రగంగా నదీతోయములఁ దానమాడును. రాత్రు లందు చేరువనున్న కాశీమిత్రుని స్మశానవాటికకుఁ బోయి యర్ధ రాత్రము వరకు నాలోచనా నిమగ్నుడై యుండును. ఆ నిశ్శ బ్దములందు చితులపై బేర్చఁబడిన శవము లాహుతి గాఁగుచుండ గంగానదీ తరంగములు క్రిందికిఁ బ్రవహించుచుఁ జేయు మర్మరధ్వనుల, దాపుననున్న విశాల వటవృక్షపత్రముల ధ్వనికి లయగలుపుచు జనన మరణాద్యవస్థలఁ దలపింపఁ జేయుచుండును. దాని వర్ణింపనే భావము సరిపడదు, గాని యదియనివార్యమై మానవ హృదయము నాకర్షించును. నాగమహాశయులీ ప్రకృతి చిత్రములను దిలకించుచు ధ్యాననిమగ్నుఁడై గంటలకొలది స్థాణువువలె చలన రహితుఁడై యొక్కొక్కప్పుడు "సత్యో! మిథ్య! మిథ్య! సర్వమును మిథ్యయే. ఈశ్వరు డొక్కడే శాశ్వతుఁడు. ఆయనను దెలిసికొననిదే దప్పి జీవితము సహింపరాదు. భారము...... నే నెట్లాయనను గన్గొనుట? నాకెవరు దారి చూపింతు"రని విల పించును.

ఆతెడా రుద్రభూమికిఁ బోవు దినములలో నప్పుడప్పు డచ్చటికి ఫకీరులు, సన్యాసులు మొదలగు సాధువు లేతెంచుటఁ గాంచి యాశా పూరితహృదయముతో వారిం జేరి, "అయ్యా! నాకీశ్వర దర్శనము నకుఁ ద్రోవఁజూపు"డని వేడుకొనును. కాని యొక్కరి నుండియు సరి యగు సమాధానము బడయఁజాలక వారిలో పెక్కురష్ట సిద్ధులకే గాని, భగవత్తత్వమును తెలిసికొనుటకు యత్నించుట లేదని తెలిసి కొనెను.

ఒకసారి తాంత్రికసాధువు నొకని గలసికొని వామాచార (Vamachara) సాధనముఁగూర్చి ప్రశ్నింప నాతడేవియో యనుభవ రహితములును భయంకరములగు, సాధనముల వర్ణింపసాగెను. అంత

మహాశయులు "నీకనుభవము చాలదు. తంత్రములనిన నేమోకూడ తెలియనట్లు గన్పించు చున్నావ"నెను.

ఇట్టి వారి పరిచయము వలన నాతనికి నమ్మక కుదురుటకు బాగు లనుమానములు పెంపొందుచుండెను.

కొంతకాలమిట్లు నిరాశాపరుఁడైయుండ నొకనాడు రుద్రభూమి యందుపదేశమందిన యొక వృద్ధబ్రాహ్మణుఁడు సాధన జేయు చుండెను. ఈతని జాతిమతభేదరాహిత్యమును అంతర దృష్టియు గాంచి మహాశయులాతని శరణు జెందెను. అంత నాతడు తాంత్రిక సాధనలకుగల ప్రాముఖ్యతను షట్చక్రార్థమును తేట తెల్లముగు నట్లు తెల్పెను. మహాశయు లదియంతయుఁ జక్కగ విని తన కాళీతిని సాధన చేయవలెనని యున్నదనెను. అంత నా భూసురుడు "జగన్మాత నీ కోర్కెలఁ దప్పక నెఱవేర్చుగాత" యని దీవించి ధైర్యము చెప్పి పంపెను.

మహాశయులు భూసురుడు తన కుపదేశించిన తెఱంగుననే యా స్మశానవాటికయందు జపమొనర్చుచు నర్ధరాత్రమువరకు నన్యమెఱుగక ధ్యానప్రపంచమునఁ బడిపోవువాడు. ఒక దిన మట్లుండ దివ్యతేజం బొందు సాక్షాత్కార మయ్యెను. అప్పటి నుండియు, నియతి దప్పక నచ్చటనే సాధన కొనసాగించు కొనుచుండెను.

ఈ విధముగ దినములు గడచుచుండ నొకనాడు దీనదయాళున కిది తెలియవచ్చెను. అతడు మిగులభయపడి తత్క్షణమే యొక సంబంధమునుఁ గుదుర్చుమని యల్లునికి జాబు నంపెను. తన కొడుకు కుర్రవాడగుటచేత, నేవిధమగు బంధన కారణము లేకపోవుటచేత నే యట్లు సన్యాసులతో దిరుగు చున్నాడని యాతడనుకొనెను, గాని యా భగ

పత్నీమాహాత్మ్యము నెవరైన యొకపరి చవి జూచినచో' వారు మరల దానిని విడువ నేరరని యాత డెరుగడయ్యెను. అందువలన పునర్వివాహ మొనర్చినచో దన కొమరుని చేష్టలన్నియు క్రమపడు ననుకొనెను.

అల్లుడు త్వరలోనే దియోబోగునందుండు రామదయాళుని కొమరితయగు శ్రీమతి శరత్కుమారితో సంబంధముం గుదిర్చి మామగారి కెఱుకజేసెను. సంబంధము కుదుర్చుట సులభమే కాని నాగమహాశయుల నొప్పించుటయే కష్టపని. దీనదయాళు తన శక్తి నంతయు ధారవోసెను గాని యాతడేమాత్ర మిష్టపడడయ్యెను. ఇది ఇద్దరకును కలహకారణమయ్యెను. తత్ఫలితముగా దండ్రి కొన్ని రోజులు పస్తుండువాడు. కుమారుడుగూడ నారోజు లుపవసించెను.

కొన్ని దినము లిట్లు గతింపగ దీనదయాళు ఒకనాడు కొమరుని చూచి "దుర్గాచరణా! నేను నీకొఱకు రామదయాళునికి మాటనిచ్చి యనృతమాడవలసివచ్చెను. నన్ననృత దోషము నుండి రక్షింపగ జూతువా, వివాహమున కియ్యకొను"మనెను. అంత మహాశయులు "తండ్రీ! ఒకసారి నాకు వివాహ మొనర్చితివి. ఆబాలిక గతించెను. మరల నింకొక బాలికను మృత్యుముఖమునం బెట్ట నెంచితివా" యనెను. ఇదివిని దీనదయాళు కోపమున "అదృష్టము భగవంతునిచే నిర్ణీతమగును. మంచిచెడ్డలను విచారించుటకు మన మనర్హులము. నీతండ్రి నగు నామాట ననాదరమునం దిరస్కరింతువా, నీ వేకార్యమందే ప్రయత్నమునను సఫలతం బొందనేరవు. భగవదన్వేషణమునం గూడ నభివృద్ధిం గాంచకుందు వటుల శపింతు" ననెను.

నాగమహాశయుని కిప్పుడు ముందు నూయి వెనుక గోయి. ఒకదిక్కునం జనకుని శాపము. వేరొకవైపున సత్యాన్వేషణమునకుం

ప్రతిబంధము. ఇక నోట నేదియుఁ జెప్పనేరక యవనత ముఖుఁడై "సంసారము సర్వదుఃఖములకు మూలకారణము. కాని నాతండ్రి నన్నాపథమున నే త్రోసివేయుచున్నాఁడు ఓదయామయా! యీశ్వరా! ఇప్పుడు నేఁ జేయునదేమి? నన్నీసమయమున రక్షింపవా" యని విలపించుచు నెట్టకేలకు కొంతధైర్యముఁ దెచ్చుకొని ఖిన్నుఁడై తండ్రితో నిట్లనెను. "వివాహమువలన కష్టములును, విచారములును ఎన్నియో కలుగుచున్నవని వినుచున్నాము. కండ్లార చూచుచున్నాము. అందుచేతన నాయందు దయయుంచి నీ నిశ్చితాభిప్రాయమును మరల్చుకొనుము. నన్ను మరల నా సంసార దవాగ్నిం బడద్రోయకుమని నీపదములపై బడి వేడుకొనుచున్నాను. నీవు జీవించియుండువరకును నేను మనఃపూర్వకముగ సేవచేసికొనిన కోడలికంటె వేయిమడంగు లెక్కుడుగ సేవచేయగలను. తండ్రీ క్షమించి రక్షింపుము."

ఈ కొమరుని దీనాలాపములును దీన దృష్టులు నా వృద్ధుని మనమున నాటుకొనెను. ఎవరి సుఖమును గోరి తా నా వివాహము చేయ నిశ్చయించెనో ఆ తన కొమరుడే దానికి విముఖుఁడై యున్నప్పుడు ఆ వివాహమువలన నతని కేమి సుఖము గలుగఁగలదని యనుకొని వివాహ ప్రయత్నమును మానుట కొప్పుకొనెను. కాని దుర్గాచరణుఁడు వివాహమాడనిచో వంశమాతనితో నంతరించి మరణించిన వారి శ్రాద్ధకర్మలు నిలిచిపోవునను విచారము మనస్సునకు తట్టెను. కాని దానికి నివృత్తి ఏమి? వాదప్రతివాదముల వలనను మందలింపుల వలనను లాభము గాన్పింపదాయెను. అందువలన నిక దుఃఖమాపుకొనఁజాలక నేడువసాగెను. ఆసమయమున నాగమహాశయు లింటలేరు. గృహమునకు రాగనే తండ్రి యుండుగదిఁ బ్రవేశించి కన్నీరు కాల్వలు గట్ట నేడ్చు

చున్న జనకుని జూచి సహింపలేక పోయెను. "అయ్యో నాకు నాది యని యీ ప్రపంచమునఁ జెప్పుకొనుట కొకతండ్రి దక్క నికెవ్వరు లేరుగదా? అట్టి తండ్రి విచారమునకుఁ గారణభూతుఁడనైతినా? ఏమైనను సరియే. ఎన్ని విపత్తులు సంభవించినను సరియే. తండ్రిమాటను జవదాటను. నావివాహమువలనఁ దండ్రికి యూరట గల్గునో యట్లేచేయుదు" నని నిశ్చయించి యాక్షణమే జనకునిఁ జేరి, "నాయనా! విచారింపకుము. నేను వివాహమాడెద" ననెను.

ఈ తుదిపలుకు లాతని ముఖమునుండి వెలువడెనో లేదో దీనదయాళు ఆనందమున నాట్యమాడసాగెను. ఆపలుకు లాతని కమృతసేచనమయ్యెను. సంతోషపారవశ్యమున మాటాడలేక యూరక తన బాష్పపూరితనేత్రములతో నాతని దేరిపార జూచుచుండెను. అంత మహాశయులు లగ్నము నిశ్చయించి శుభలేఖలను పంపుచెను.

కొంతవడికి దీనదయాళు తెప్పిరిలి సంతోషమునఁ "కుమారా! నీవు నా ధర్మమును గౌరవమును గాపాడితివి. నీ వివాహానంతరము నీయిచ్ఛ వచ్చినతెఱంగున నుండుము. నేనే విషయమున నిక నడ్డుతగులను. 'నా మనః స్ఫూర్తిగ నీ కోర్కెల నీశ్వరుఁడు చెల్లించు గాతయని దీవించుచున్నా' ననెను. తరువాత దీనదయాళు మెసర్సుపాలులకీ శుభవార్త నెరింగించుటకుఁ బోయెను. వారును మిగుల సంతసించి యీ వివాహమునకగు వ్యయములలోఁ గొంత దాము భరింతుమనిరి.

అందరును సంతోషమున మునిగి తేలుచుండిరి. కాని ముఖ్యుఁడైన వరుఁడుమాత్ర మతి దుఃఖితుఁడై యుండెను. ఆతఁడు వివాహమున కంగీకారముఁ జూపి వెంటనే యిలు విడచిపోయెను. ఆదినమంతయు నున్మాదునివలె వీథులవెంబడిఁ దిరిగి రాత్రియంతయు గంగానదీ సైకత

స్థలముల విలపించుచుఁ గూర్చుండెను అచ్చట, నానిశీథమున, నాయేకాంతస్థలమున నాతని విచారమునఁ బాల్గొను వారెవ్వరు! తనకష్టము నెవరితో వెళ్ళఁబుచ్చుకొనును? దీనదయాళుఁడు పెండ్లిపనులయందు మునిఁగి యుండినందున నాతనికిది యేదియుఁ దెలియలేదు.

ఇంతలో ప్రయాణదినము సమీపించెను. దీనదయాళు సామానుల సరిచూచుచుండెను. మామూలురీతిగ నాగమహాశయులు రాత్రి సమయమున గంగానదదరికేగి మరల గృహాభిముఖుండగుటకుఁ బూర్వము గంగాభవానికిసాష్టాంగవందన మాచరించి "తల్లీ! నీవు పాపనాశిని వన విందును. నేను గృహస్థాశ్రమధర్మ స్వీకారముఁ జేసి ప్రాపంచకవిషయ పంకిలుఁడ నగుచో దానిఁ గడిగివేయుము. జననీ! కష్టములందును, సుఖములందును నీ చరణకమలములయందు నాకాశ్రయ మిమ్మ"ని ప్రార్థించెను.

ప్రార్థనానంతరమున గృహమున కరుదెంచెను. తరువాత తండ్రియుఁ దానును జన్మస్థానమునకుఁ బయనమైరి.

పునర్వివాహము - వైద్యవిద్యాభ్యాసము

"సంతతి కొఱకు వివాహ మాడుటవలన మానవుఁ డపవిత్రుఁడు కాఁజాలఁడు. కాని యట్టి వివాహములకుఁ బూర్వము ఋషిసత్తములును యోగి పుంగవులును నిక్క సన్న్యాసులనఁ గ్రాలు. వారలు చాలకాలము బ్రహ్మచర్యవ్రత మవలంబించి వంశాభివృద్ధికొఱకు వివాహమాడెడు వారు. తరువాత వ్యాసులు, శుకులు, సనకులు సనత్కుమారులవంటి పుత్రులఁబడసి వానప్రస్థము జరుప నడవుల కేగువారు. కాని యీ కలియుగమున నది యసాధ్యము. ఈకాలమున నట్టిభక్తియుఁ దపః ప్రభావమును లేవు. అందువలనఁ గ్రూరులును యవినీతిపరులు

నుద్భవించుచున్నారు. నేనేమి చేయఁగలను? నా పితృాజ్ఞ యిట్లున్నది. అది విషప్రాయమైనను అవలంబించుట నావిధి" యని మహాశయులు పునర్వివాహమును గూర్చి యనువాఁడు.

పితాపుత్రు లిర్వురును వివాహమునకై దారు దినములకుఁ బూర్వమే జన్మస్థానముఁ జేరిరి. శుభదిన మాసన్నమాయెను. దీనదయాళు పుత్రప్రేమ యుప్పిరిగొన వరుని యూరేగింపుతో వధూగృహమునకుఁ దీసికొనిపోయెను. మంత్ర తంత్రములు యథావిధిగ జరుపఁబడెను. మహాశయులొక మృణ్మయ విగ్రహమువలెఁ జేయవలసిన పనులొనర్చుచుండెను. వివాహితుని విధి నాతనికి స్ఫురించినతోడనే యొడలు ఝల్లు మనుచుండెను. కాని విధి ప్రేరితముఁ దప్పింపనెవరి తరము?—వివాహమతి వైభవమున జరిగెను.

వివాహానంతరమునఁ దండ్రి కొడుకులు కలకత్తాకు మరలిరి. మహాశయులు మరల స్వతంత్ర జీవనమును వైద్యవృత్తి నారంభించి మునుపటివలె ధనార్జనమును జేయుచుండెను. ఇట్లు అధ్యయనమునను, రోగుల పరిచర్యతోడను, మిత్రులతోడ మత విషయిక వాగ్వాదముల తోడను, భగవత్ప్రసంగములతోడను, నాగమహాశయుని జీవితమున మెల్ల మెల్లగ ఏడు సంవత్సరములు గడచిపోయెను. ఇంతలో పరిశుభ్రాకాశము మేఘావృతమాయెను.

ఒకనాఁడు మహాశయులకు మేనత్తయగు భగవతి వ్యాధిగ్రస్తయై యున్నట్లు జాబు వచ్చెను. తత్క్షణమే యతఁడు జన్మస్థానమునకుఁ బయనమయ్యెను. పాపమామె వృద్ధురాలగుటచే దేహపటుత్వము వీడి గ్రహణిరోగమున బాధపడుచుండెను. భగవతి మేనల్లునిఁ జూడగనే సంతోషమున "నాయనా! యవసాన దశయందు నిన్నుఁ జూచుటయు నీ సమక్షముననే కడతేరుటయు నా భాగ్య"మనెను.

పునర్వివాహము - వైద్యవిద్యాభ్యాసము

మహాశయు లామె వ్యాధినివారణమునకై యెంతయో ప్రయత్నించెను. కాని యన్నియు నిష్ఫలము లయ్యెను. మరణకాల మాసన్న మాయెను. భగవతి, ఇంటి నందరును భుజించినట్లు తెలిసికొని చావడిలోఁ గూర్చొని యొక పావుగంటవరకు భగవన్నామ సంకీర్తనముఁ జేయును, మహాశయులఁ జేరబిలచి "తండ్రీ నీమన మెప్పుడును, భగవంతునియందే లగ్నమై యుండుఁగాత" యని దీవించి, రామమంత్రోపదేశిని యగుటచే రామమంత్రము జపించుచు "రా" యను శబ్దముతోడనే యంత్యోచ్ఛ్వాసమును విడచెను. మహాశయులకది స్పష్టముగ వినవచ్చెను.

అతఁడు మృత్యువును ప్రత్యక్షముగా చూచుట కిదియె ప్రథమ సంపర్కము. మొదటి భార్యతో నాతనికి సంబంధము లేకపోవుట నామెను గోల్పోవుటవలని కష్టమాతని కంతగను తెలియలేదు. తల్లి దా బాలుఁడుగ నుండఁగనే మరణించెను. కాని యామె స్థానము నాక్రమించిన మేనత్తయందే మాతృప్రేమ నతఁడు పడసియుండెను. ఆమె యపారమగు ప్రేమ నాతని కెన్నఁడును తన మాతృవిహీనతను స్మరింపనీయలేదు. ఇప్పుడా ప్రేమస్వరూపిణి యగు మేనత్తయే విడిపోయెను. దుఃఖము నిర్భరమైపోయెను. ఆ గృహమున నివసించుటకైన నాతఁడు సాహసింపఁ జాలకుండెను. ప్రేమపాశము తన్నీడ్చుకొనిపోవుచుండ తరచామెను దహించిన చోటికిఁబోయి నిశి రెల్ల నచ్చటనే గడపువాఁడు. స్నానమునకును భోజనమునకు నెంతయో బలవంతముపై లేచుచుండెను. ఒక్కొకమా రున్మత్తునివలె నింటి ముంగిల సాగిల పడువాఁడు.

ఈ చర్యలన్నియుఁ గలకించి శరదామిని యాతఁడున్మత్తుఁడగు నేమో యని భయముంది తండ్రికి వర్తమానమంపెను. దీనపు యాళు

తత్క్షణమే కలకత్తానుండి వచ్చి భగవతి కుత్తరక్రియలు జరిగిన తరువాత కొమరుని దిసికొనిపోయెను.

కాలమెంతటి కష్టములనైన మరపింపఁజేయును గదా! నాగమహాశయులకును దుఃఖ ముపశమించుచుండెను. కాని దాని స్థానమున నింకొకటి యాక్రమించి మిగుల వేధించుచుండెను. మనుజుఁడెందుకు జన్మించును? మరల నాతఁడెందులకు మరణించును? మరణానంతర మేమగును? ఇప్పుడు నాకండ్లముందు గతించిన నా మేనత్త యేమైనది? ఏ లోకమునకుఁ బోయినది? నా దేహ మెచ్చటఁ గనుగందునో యని యెల్లవేళల నిరీక్షించుచు, నేదేని కొలది యుపాయము సంభవించినను, వ్యాధిగ్రస్తుఁడనైనను ఆ కష్టమెల్ల తనకు వచ్చినట్లుగఁ దాను విలపించెడిదే! అట్టి నా మేనత్త యిప్పుడు నేను హృదయము ద్రవించునట్లేడ్చినను గాంచదేమి? మరణమున నీ సంబంధము లన్నియు వీడిపోవును గాఁబోలు! అట్టి సమయమున నెందులకీ "నా" "నీ" యను నహంభావము? అయ్యో! దుఃఖభూయిష్ఠమై బంధనకారణమగు నీ ప్రపంచమున కెందులకు వచ్చినారము? వచ్చిన తరువాతఁ నిక జేయవలసిన విధియేమి? క్లేశమందుచున్న యీ యాత్మను మృత్యుముఖము నుండి రక్షించు టెట్లు? అను నిట్టి ప్రశ్నలె యాతని కలచివేయుచుండెను.

నాగమహాశయులు చికిత్సచేసి డబ్బు గడింప నారంభించెను. కాని ఇతని విధము వేరు. ఎవ్వరిని ఇమ్మని యడుగడు. ఏవరేది యొసగనను సంతుష్టచిత్తుడై స్వీకరించును. క్రమముగ నాతనికీర్తి వ్యాపింప దొడగెను.

వైద్యవృత్తిచేయుచు గడించుచుండినను, బాహ్యాడంబరమాతని వద్ద కాన్పింపదు. రోగులను చూడ బోవుటకు గుఱ్ఱపుబండియైనను

లేదు. దూర దూరములనుండి యాతని పిలచువారు. అయినను అచ్చటికి నడచియే పోవును. ఎవరైనను బండి తీసికొనివచ్చుటకు సంసిద్ధులైనను సమ్మతింపడు. సామాన్యముగా నందరును ధరించు పంచె, చొక్కా, ఉత్తరీయము, కాలిజోడు మొదలగువానినే ధరించును. వృత్తికి తగు దుస్తులను ధరించుచో కొమరుడింకను అభివృద్ధి చెందునని దీనదయాళు తనకు నచ్చిన వానిని కొనితెచ్చెను. కాని మహాశయులు "నాకట్టి దుస్తులతో నెట్టి ప్రయోజనమును లేదు. ఈ రూప్యములను పెట్టి ఎవరైన బీదల కుపకరించుచో సత్కార్య మాచరించినవారమగుదు" మనెను. దీనదయాళు దీర్ఘనిశ్వాసమువిడిచి "నీపై ఎంతయో ఆశ పెట్టుకొనియుంటిని. ఇప్పటి నీచర్య జూచి మోసపోతినని తెలిసికొంటిని. నీవు సన్యాసివగుటకు సంసిద్ధుడవై యున్నా"వనెను. ఇదియే కాదు, మహాశయుల నడతయంతయు ప్రపంచధోరణికి వ్యతిరేకమై యుండెను. పొరుగున నెవరైన రోగగ్రస్తులైనను, తిండిలేక మాడుచున్నను వారికి తగు సేవజేసి వారి బాధలు నివృత్తిజేయువరకును ఆహారపానీయములు ముట్టడు అసమర్థులగువారినుండి పైకము పుచ్చుకొనడు. చివరకు ఔషధమూల్యమైనను గొనక, పైబడి వారి పథ్యపానములకగు వ్యయమునుగూడ తానే భరించును. నిరాశ్రయులై దారిద్ర్యోపల రోగపీడితులై పడియుండువారిని గృహమునకు దోడ్తెచ్చి చికిత్సచేయును. ఒకొక్కప్పుడు తానే మాడి భిక్షుకులకు తన నోటిముందరి యన్నమిడును.

ధర్మవైద్య మట్లుండుటచే పెక్కురు రోగులతనినే చుట్టుముట్టుచుండిరి. పూర్తిగ ప్రాపంచిక విషయ విముఖుడగుటచే, దీనరక్షణమే పరమావధి యని వారి కాహారమును దుస్తుల నొసగి రోగుల కుపచరించును. రోగులు దూరముగా నున్నప్పుడు తనకుఁ దానే నడచిపోయి

యుపచరించును. తాను నిద్రాహారములను మానియైనను సరియే రోగుల సుఖమే తన సుఖమని వారు బాధపడుచుండఁ దాను గూడ విచారించుచు, తండ్రి బిడ్డలను బోలె వారల నాదరించును.

ఒకనాడొక రోగి గృహమునకుబోయి పరీక్షింప నాతని శోచనీయమగు స్థితియందుండెను. అచ్చట నాలుగు గంటల కాలముండి ఔషధమిచ్చుచు శుశ్రూష చేయుచుండెను. గృహము శిథిలమై ప్రచండమగు శీతవాయువుల నాపఁజాలకుండెను. రోగికిఁ గప్పుకొన బట్టయైనను లేదు. జ్వరము తీవ్రముగ నుండెను. నాగమహాశయుఁ డిది జూచి మిక్కిలి విచారించుచు రోగి ప్రక్కఁ గూర్చుండి ప్రియోక్తులాడుచుఁ దనపైనున్న శాలువ నాతనికిఁ గప్పి 'భయపడకుము. రేపు ప్రొద్దున్నే వచ్చి చూతు' నని చెప్పి రోగి ఎంత పిలచినను వినిపించుకొనక వెడలిపోయెను. మరునాఁ డుదయమునఁబోయి చూడగ రోగి కొంత స్వస్థతఁ బడసి యాతనియెడ నెంతయో కృతజ్ఞత చూపెను. అంత మహాశయులు నాయనా "ఇట్టి స్థితిలో నీ చలిని కాపాడుటకంటె నా శాలువ వలని ప్రయోజన మేమని నీ కొసగితి"నవెను. ఈ సంగతి తండ్రికి తెలిసెను. ఇద్దరకును వినోదము సంభవించెను. దానికి ఫలితముగ నిద్దరును ఆనాటికి నిరాహారులై యుండిరి. మరునాఁడు దీనదయాళువొక శాలువను కొనియిచ్చెను. పూర్తిగ రోగనివృత్తుఁడైన తరువాత రోగి ప్రతిదినమును మహాశయుల యింటికిబోయి నమస్కరించుచు, ఎందరికో రోగుల నీతనివద్దకు గొనివచ్చుచుండెను.

ఇంకొకసారి యొక రోగిని బరీక్షించుటకై పోవ నాతఁడు కటికి నేలపై బరుండియుండెను. మహాశయుల కది కష్టముగఁ దోచి తన గృహమునుండి వేరొక పరుపుఁదెచ్చి రోగిని దానిపై బరుండబెట్టి వైద్యము చేయ నారంభించెను.

పునర్వివాహము-వైద్యవిద్యాభ్యాసము

ఇట్టి పనులన్నియు దీనదయాళునకు మిక్కిలి కష్టతరముగనుండి కొమరుని మండలించుచుండును. కాని దానివలన నిర్వ్యరకుఁ గలహములు సంప్రాప్తించుట దక్క లాభమేమియు నుండదయ్యెను.

నాగమహాశయుల సుగుణ సంపదకును వైద్య నిపుణతకును మెచ్చి మెస్సర్సుపాలులు అతని దమ గృహవైద్యునిగ నియమించిరి. అందువలననే నాగమహాశయులను వారలిప్పటికిని "డాక్టర"నియే పేర్కొందురు. "అతడు వైద్యుడుగనున్న కాలమున మా గృహమున నెవ్వరు నకాలమరణ మందితే" దని బాబు హరలాలుపాలు తన సన్మానమును తెలిపియున్నాడు.

ఒకప్పుడీతను గృహవైద్యుడుగ నున్నప్పుడు "పాలు" వంశను రాలి కొకత్రెకుఁ గలరావ్యాధి సంభవించెను. మహాశయులు వైద్యము చేయుచుండెను గాని, యాతనికి జీవితాశ గన్పట్టక నధైర్యపడి డాక్టరు విహారీలాలును రప్పింపదలచెను. డా|| విహారీలాలు వచ్చి మహాశయుని చికిత్సాక్రమమును విచారించి యాత డిచ్చుచుండిన ఔషధమే సరియైనదని యాతడే కొలది దినములలో కుదుర్పగలడనియుఁ జెప్పి యెంత పట్టుపట్టినను వినక వైద్యము చేయకయే వెడలిపోయెను. ఈతఁడు చెప్పినట్లే కొన్ని దినములకు రోగి స్వస్థతఁ జెందెను.

రోగి జీవించి యారోగ్యమును గన్న తరువాత "పాలులు" సంతోషపూర్వకముగ నొక వెండిపెట్టెలో రూప్యములను నింపి బహుమాన మొసంగిరి. కాని వారు తన యభివృద్ధికిఁ గారణభూతులగుటచే ఆ బహుమానము నాతడు నిరాకరించెను. అది తనచికిత్సకు తగిన బహుకృతికాదని యాతడు నిరాకరించెనేమోయని సంశయించి వారు మరొక యేబదిరూపాయీలను దెచ్చి స్వీకరింపుమనిరి. అంత మహాశయులు అతిదీనతతో "అయ్యా, ఇంతటి బహుమానమును స్వీకరింపఁజాలను.

మీకొఱకు ఖర్చుపెట్టినది యిర్వది రూప్యములకంటె నెక్కుడుకాదు. క్షమింపుము. నే నీ బహుమానమున కృతజ్ఞుడను," అని యెంతయో కష్టముమీద నా యిర్వది రూప్యములను మాత్రమే స్వీకరించెను 'పాలు'లా మిగిలిన సొమ్మును దుర్గాపూజ నిమిత్తమై వినియోగించిరి.

ఈవిషయము తండ్రికి దెలియవచ్చెను. అతడు తన కోపముం బట్టజాలకపోయెను. తానంతటి వృద్ధాప్యమునం గూడ ఏకాలది వేతనమునకై పాటుపడుచుండం దనకొడుకు బుద్ధిహీనుడై తనకు రావలసిన సొమ్మునుగూడ నిరాకరించుచుండెనని మిగుల విచారించెను. కొమరు డింటికి రాగానే, పండ్లు పటపటం గొరుకుచు "మూర్ఖుడా! 'పాలులు' తమ కృతజ్ఞతాపూర్వకముగ నిచ్చిన బహుమానమును నిరాకరింతువా? ఇక నీవైద్యవృత్తి యభివృద్ధి గాంచునా? ఇట్లు ధనమును నిరాకరించుచు సన్యాసివలె నుండిన నీకుటుంబము నెట్లు పోషించుకొందు"వని కఠినముగ మందలించెను. కాని మహాశయులు మాత్రమించుకైనను చలింపక, 'తండ్రీ! ధర్మపథమునం జరింపుమని నీవే గదా బోధింతువు. మరల నిట్టి యన్యాయకృత్యమును జేయుమని యెట్లనగల్గుచున్నావు? మందులకయిన వ్యయ మాఱు రూప్యములు. ఇక నేడుదినములకును సేవ జేసినందులకు దినమునకు రెండు రూకల చొప్పున జూచినను పదునాల్గు. మొత్త మిరువదియాయెను. అట్టితరి యన్యాయముగ నంతకెక్కుడు మొత్తము నెట్లు స్వీకరింతు'ననెను.

దీనదయాళీ యుత్తరవు విని తన కొమరుడు అదృష్టహీనుడనియు నీప్రపంచమున నుండుట కనర్హుడనియు ననుకొనుచు, వెడలిపోయెను. తండ్రిచర్యలం గాంచి మహాశయులు విచారమున "ఆహా! ఇట్టిదిగదా ఈ ప్రపంచము! ఆశాంధకార పరివృతమై జీవుని ఎంతటి మాయాజాల

మునఁ జిక్కువడఁజేయుచున్నది! "ధనమూల మిదం జగత్త"ని ఏదో యొకవడువున ధనమార్జింపవలయునట! దానఁ గాని పేరుప్రతిష్ఠలు లేవట! ఛీ, నాకిట్టి తుచ్ఛప్రపంచముతో నెట్టిసంబంధమును లేకుండు గాక! అన్యాయార్జిత విత్తముతో సుఖించుటకంటె ధర్మాచరణము గావించి నిలువుపేదయై బిచ్చమెత్తి జీవించు టెంతయు మేల"ని తలపోసెను.

ఇదియేకాదు. ప్రాపంచిక విముఖములగు నీతని చర్యలెన్నియో దీనదయాళువను నిరాశ కల్గించుచుండెను. అనుదినమును ఋణములకొఱ కెందఱో నాగమహాశయుని గృహముకడ కాచుకొనియుందురు. ఏది యడిగినను లేదనక నేదియో యొసంగి వారలఁబంపుచుండును. కాని మరల వారా యప్పులఁ దీర్చుట యబద్ధము. అందువలన నీ దినమున కెనిమిది తొమ్మిదిరూప్యములను నిలువచేసికొనఁగల్గిన సంపాద్యముండియు నిట్టి వ్యయములవలన నాతనికి కొన్నిరోజులు దినుటకు పట్టెడు మెతుకులుకూడ కరవగుచుండెను. మరియు ధనమును చేర్చిపెట్టుట యనునది యాతఁడెఱుఁగఁడు. ధనమును నిలువజేయు విషయమును గూర్చి "మన నిజమైన యవసరములను భగవంతుఁడే సమకూర్చుచుండును. మనమాతురతపడి చేయునది యేమియులేదు. భగవంతుని సంపూర్ణముగ శరణుజొచ్చినచో మన కిహపరసౌఖ్యములు లభించును. మనముగా చేయఁబోవునే కార్యమును తుదకు విఫలము గాగలదు. ఇది నా యనుభవము"ని చెప్పుచుండును. ఏదేని కొలది మిగిలినయెడల తండ్రికిచ్చి తన కెన్నఁడేని అత్యంతవసరముగ గావలయుచో తండ్రి నడుగును.

కపటప్రవర్తన మన్న నాగమహాశయులు సహించువారు కారు. ఒకనాఁడొకవైష్ణవసన్యాసి యొకజవ్వనితో భిక్షార్థియై వచ్చెను. అప్పుడు మహాశయులు దేవతార్చన మొనర్చుచుండెను. తన గృహ-

ద్వారమునుండి "రాధా రాధా"యను శబ్దోచ్చారణము రాగా ఈవలికి వచ్చి దొంగవేషము వేసికొనియున్న దంపతులఁ జూచి యాగ్రహముతో "ఇట్లు బూటకముగా 'రాధా రాధా' యని యన్నంతమాత్రమున నీకేమియు దొరకదు. మనఃస్ఫూర్తిఁ నన్నగలిగితివేని ఏదేని ఇచ్చెద" ననెను. తోడనే వారు మారుపలుకక వెడలిపోయిరి.

వైష్ణవీ వైష్ణవులవలెనే యింకొక దినమున భైరవీభైరవవేషముతో నిర్వురాతనిగృహమునకు వచ్చిరి. త్రిశూలధారియగు నా భైరవ వేషధారి మహాశయులను గంజాయికొరకు పైక మొసంగుమని యడిగెను. నాగమహాశయు లందులకు "నీవు నీ యిష్టము వచ్చినట్లు చేయవచ్చును. కాని ఏవిధి చొప్పున నీవిట్లొక హిందూస్త్రీని భైరవ వేషమున రాజమార్గమున త్రిప్పుచున్నావు" అనెను. దానితో ఉగ్రభైరవు డింకను ఉగ్రతర రూపము దాల్చి "పైక మొసగకున్నచో పోనిమ్ము. ఇట్లు దూషింతువేఁ?" యనుచు భైరవితోఁగూడి వెడలిపోయెను.

మనుజుడు సద్గురోపదేశము లేనిచో నట్టి దుస్థితిఁ కేతెంచుట సహజము. తా నధఃపతితుడగుటే గాక యితరులను గూడ చెరచును. ఎఱుగక జేసిన యఘ మొకపక్షమున క్షమింపనగును. గాని తెలిసియుఁ బొట్టకొఱకు వేషమాత్రులై ప్రపంచ విరోధులగువారిని సహింప దుస్సహమని యనుకొనుచు మహాశయులు లోనికిఁబోయెను.

ఒకపరి యపరిచితుడగు నొక భద్రపురుషుడు నాగమహాశయులను తన ఇంటికి పిలువనంప నాతడచ్చోటికిఁబోయెను. ఆ వ్యక్తి పరమ సౌందర్యవతియగు నొక పూర్వసువాసినిని ఆతని ఎదుటికి గొనివచ్చి యామెకు గర్భమును పోగొట్టుమని ప్రార్థించెను. ఈ ప్రార్థనను విని నాగమహాశయులు స్తంభితుడైపోయెను. కొంతవడి కాతనితో ఇట్లనెను.

పునర్వివాహము - వైద్యవిద్యాభ్యాసము

"ప్రథమమున ఈ సుందరిని కుటుంబమునకు దీరని కళంకమాపాదించి గొనివచ్చుట యొక్క పాపము. దానిపై ఇప్పుడు భ్రూణహత్యజేయుటకు బూని మహాపాపమున కొడిగట్టుచుంటి"వని యింకను ఎంతయో బోధించెను. కాని ఫలము లేకపోయెను. తరువాత నాపురుషుడు విరివిగ ధనమొసంగదవని యాశపెట్టెను. అంత నాగమహాశయులు మారు మాటాడక వెడలిపోయెను. "అయ్యో! ఈ మహాపాపమును నివారించుటకే యుపాయమును లేదా?" యని చాల విచారించెను నాగమహాశయు లిదివరలో బ్రహ్మసమాజ ఉపాచార్యులగు శ్రీ శివనాథుని యుపన్యాసముల వినియుండెను. అందువలన "శివనాథుడు ధార్మికుడు. ఎక్కువ పలుకుబడిగలవాడు. ఆతనితో ఈ యుదంతమును చెప్పినచో ఏదేని ప్రతి విధానము జేయగల"డని శివనాథుని వద్దకు బోయెను. ఆతడంతయు విని యొకరిద్దరు బ్రహ్మసమాజికులను పేర్కొని వారితో నాలోచించి కోర్టుద్వారా పనిచేయుమని చెప్పెను. కాని వారి ఆలోచన నిష్ఫలమయ్యెను. అంత నాగమహాశయులు తానే యూఖరు పర్యాయము ప్రయత్నించి చూడవలయునను కొనెను. మరునాడా పురుషుని గృహమున కేగునప్పటికి ఆతడు కాశీపురికి బోయెనని తెలిసెను. "ఆహా! ఈ పాపకృత్యమునకు ప్రతీకారమొనర్పలేక నే పోతిని గదా" యని నాగమహాశయు లనేక దినములు విచారించెను.

ఆర్థికస్థితి బాగున్నను దీనదయాళు వంటకై ఎవరిని నియోగింపక తానే వంట చేయుచుండును. పుత్రుడు తండ్రి వండుట కిష్టపడక తానే చేయజూచును. దానిచే సమయము చిక్కినప్పుడు తానే వండును. ఇది దీనదయాళునకు బాధకరమై పుత్రున కవకాశ మీయకుండును. నాగమహాశయులును అతి జాగ్రతతో తరుణముకొరకు వేచియుండును. ఈ వంతులతో కలహములు వొడముచుండెడివి. అప్పు

డాగృహమునకు వచ్చినవారెవరైనయున్న మధ్యస్థులై యాదినమున కా వివాదమును పరిష్కరించువారు. కాని మరునాడు యథాపూర్వ ముగనే జరిగెడిది. ఇర్వురును ప్రాతఃకాలముననే ఎవరికి వారు "ఈ దినమున నేను వండుదు"నని నిశ్చయించుకొని ఎవరికి తరుణము లభించి నప్పుడు వారే వంటసిద్ధముచేయుచుండిరి. ఇందెవరి యభీష్టము నిష్ఫల మయ్యెడిదో యాతఁడా దినమంతయు క్రోధముతో నుండును.

ఇట్లు నిత్యమును వివాదములు సంప్రాప్తించుట జూచి మహా శయులు తన భార్యను (శరత్కుమారిని) కలకత్తాకు గొనివచ్చుటకు నిశ్చయించెను. అందులకై సురేసుని గృహ సామీప్యముననే యొక గృహమును బాడుగకు దీసికొనెను.

మంత్రోపదేశము - దక్షిణేశ్వర యాత్ర

క్రీస్తుశకము 1880 వ సంవత్సరమున నాగమహాశయుని భార్య కాపురమునకు వచ్చెను. ఇచ్ఛాపూర్వకముగ భర్తకుపచారము చేయుట కిదియే యామెకుఁ బ్రథమ తరుణము. వివాహసమయమున భర్తను చూచియుండెను గాని యప్పటి కామె ప్రపంచమెఱుఁగని బాలిక. ఇప్పుడా జవ్వని భర్తకును మామకు నేలోపములేకుండ సేవజేయు చుండెను. దీనదయాళు డీమె సుగుణసంపత్తికిని వినయవిధేయతలకు నంతి తగిన కోడలు దొరికెగదా యని మిగుల సంతసించుచుండెను. కాని యాయబల భర్తమనము నేమాత్ర మాకర్షించుకొనఁ జాలకపోయెను. ఎందువలనన నాతఁడు తన కాలము చాలవఱకు వైద్యమందే నియుక్త మగుచుండ మిగిలిన కొలది కాలమును భగవద్ధ్యానమునకు గ్రంథ పఠనమునకుఁ గడపుచుండెను. అందువలన పాప మాబాలిక యస్థిర చిత్తయై యుండెను.

మంత్రోపదేశము - దక్షిణేశ్వరయాత్ర

భాగవతములోని భావాటవీ వర్ణనము, జడభరతోపాఖ్యానము మహాశయుని మనస్సున కెక్కిన విషయములు. భరతుని గాధ జదువునప్పుడట్టి ముక్తపురుషుడే సంసారబంధము దప్పించుకొనలేక తా తెంచిన లేడిపైవి వ్యామోహము కారణముగ మరల జన్మమెత్తవలసినప్పుడు తన బోంట్ల విషయమెంత కష్టతరమో తెలిసికొనెను. ఒకొక్కప్పుడి దుస్సాధ్యంబగు మాయను దలచుకొని "అయ్యో! దీనిని సాధించుటెట్లు? బంధవిముక్తుఁడ నగుటెట్లు? వివాహితుడను, ధనమార్జించుచుంటిని. బంధములు దినదినము పెరుగుచున్నవి. వానినుండి బయల్పడుటెట్లు? వైద్యవృత్తి నవలంబించునప్పుడు దీనసంరక్షణఁ జేయవచ్చును గదా యని యనుకొంటిని. రాబడివంతయు మిగుల్పక యర్థుల కిచ్చుచుంటిని. చేతనగు వరకు రోగులను దుఃఖుల నుపచరించుచుంటిని. కాని ప్రపంచము నెంతమాత్రము దుఃఖమునుండి విముక్తము చేయగల్గితిని? ఈ దుఃఖభూయిష్ఠమగు ప్రపంచమున నెందులకుఁ జన్మింపవలయును? అయ్యో! మరల కామినీకాంచనముల నాసక్తుఁడనే గావలయునా? వీరితోడనే జీవిత మంతరింపవలయునా? కాదు. ఈశ్వరాన్వేషణముఁ జేయవలయును. లేకపోయిన నీ జీవిత మెట్లు సార్థకము కాగలదు? ఆ సర్వాంతర్యామిని దెలిసికొను మార్గమేది? నాకెవరు త్రోవఁజూపుదు"రని పలుమారు చింతించుచు, గద్గదకుఁడై యీశ్వరుని ప్రార్థించును.

ఈ సమయమున నాగమహాశయుని ప్రాణమిత్రుఁడైన సురేశుఁడును కొందరు బ్రహ్మసమాజకులును ప్రతిదినమును సాయంకాలమున గంగానదీ తీరమున గలసికొని ధ్యానప్రార్థనా సంకీర్తనముల నడపువారు. మహాశయుఁడుగూడ వారితోఁ జేరెను. సంకీర్తనఁజేయుచు నాగమహాశయు లానందమున నాట్యమాడును. ఒకొక్కప్పుడు సంతోష

పారవశ్యమున నృత్యముఁజేయుచుఁ బడిపోవును. ఒక దినమున నట్లు నాట్యముజేయుచు నాతఁడు గంగానదిలో పడిపోయెను. సురేశుడు మరికొందరు మిత్రుల సాయమున నాతని రక్షించెను. కాని యాదిన మంతయు మహాశయులయందు యున్మత్తభావములు కన్పించుచునే యుండెను. నాగమహాశయులు కొంత యుద్రేకస్వభావము కలవాడయ్యు తన యుద్రేకముల నణచుకొనుట యందతి సమర్థుఁడు. ఉద్రేకము నణచు కొలందియు నది రెంతురెట్లు బలవంతమగునని యాతని యభిప్రాయము. ఉన్మత్తస్థితియం దున్నప్పుడు ఈతనియందు ఈశ్వరానురాగ లక్షణములు స్పష్టముగ కన్పట్టుచుండెనని సురేశుఁడు చెప్పియున్నాడు.

నీకెంత గాఢతరమగు భక్తియున్నను, ప్రేమయున్నను, సద్గురూపదేశము నంది సాధన నభ్యసించి పరమేశ్వరుని ధ్యానింపకున్నచో భగవత్సాక్షాత్కారము దుర్లభమని యొక సాధువు చెప్పెను. ఇది విని త్వరలో నుపదేశ మందవలయునని నాగమహాశయు డాతురతఁ జెందసాగెను. అప్పుడప్పుడు సన్యాసులు గంగాతీరమునకు వచ్చుచుండుట గాంచి వారిలో నెవరైన దయగొని తన కుపదేశము చేయగలరను నాశతో రాత్రియగువరకు నచ్చట వేచియుండును. ఎన్నియో దినములిట్లు గడచెను. ఒకసారి గంగాస్నాన మాచరించునప్పుడొక నావ తనవైపునకు వచ్చుచుండుటఁ జూచెను. చూచుచుండఁగనే నావ రేవునకుఁ జేరెను. అందుండి (యాశ్చర్యజనకముగ) తలవని తలంపుగ తన కుల గురువగు కైలాసచంద్ర భట్టాచార్యులు దిగెను.

మహాశయులు త్వరితముగ స్నానము పూర్తిచేసి కుశలప్రశ్న మొనర్చి, గృహమునకు దోడ్కొని పోయెను. గురు సందర్శనమున దీన దయా కుప్పొంగెను. గురువునకు తగు సత్కార మొనర్చి యాయన

రాకకు కారణ మడిగెను. అందుల కాయన "త్రిలోకజనని యాజ్ఞాను సారముగ మహాశయుల కుపదేశముఁజేయుటకు వచ్చితి" ననెను. ఆతని ప్రార్థనల నాదయామయి విన్నది కాబోలును! ఈ వార్తవిని దీన దయాళు సంతసించెను. మరునాడు శుభదిన మగుటచే నాదినమున మహాశయులు భార్యాసహితుడై శక్తి మంత్రోపదేశముఁ బొందెను.

ఉపదేశానంతరమున మహాశయు లతిశ్రద్ధాభక్తులతో సాధన చేయఁదొడగెను. ఎన్నియో రాత్రులు ధ్యాననిమగ్నుఁడై గడపెను. ప్రతి యమావసనాడు నుపవాస ముండి ధ్యాననిమగ్నచిత్తుడై యుండును. ఒక్కొక్కప్పుడా ధ్యానమున చైతన్య విహీనుఁడై పడిపోవును. ఒకదిన మున నిట్లు స్మృతి రహితుఁడై పడియుండ గంగాతరంగ మొకటి లోనికీడ్చుకొనిపోయెను. మరల స్మృతివచ్చిన తరువాత నీదుకొని కుటికి రావలసివచ్చెను.

ఇట్లు తన కాలమంతయు జపధ్యానాదుల గడపుచుండ క్రమ క్రమముగ వైద్యవృత్తి క్షీణింప జొచ్చెను. దాని ఫలితముగ రాబడి తగ్గెను. దీనదయాళు జిజ్ఞాసపడెను. మేనత్త చనిపోయినప్పుడు గల్గిన వైరాగ్యము సురేంద్రుని స్నేహమువలనఁ జాలవరకు మాసిపోయె నను కొనెను, గాని మరల యథాపూర్వమగుట జూచి దీనదయాళు చాల చింతపడెను. తన కోడలి యవస్థయే ముఖ్యముగా దీనదయాళుని జిజ్ఞా సకు కారణమయ్యెను. భోజనవస్త్రములకు లోపము లేకపోవుట నిక్కువమే. భార్య మనస్సునకు శాంతిని జేకూర్చునది భర్త యను రాగ మొక్కటియే. ప్రపంచమున నెట్టి స్త్రీయు తన భర్త ననురాగ బద్ధునిఁ జేయఁజాలదని యామె యెఱుఁగును.

ఒకసారి మహాశయులు తన భార్యను జూచి "దేహసంబంధము చాలకాలము వరకు నిలువదు. ఈశ్వరుని తన సంపూర్ణ మనస్సుతో

నెవడు ప్రేమింప నేర్చునో యాతఁడే ధన్యుఁడు. ఒకపరి యైహికములను లొంగి తనువునకుఁ జనువిచ్చితిమా నావ్యామోహమునుండి విడివడుట కెన్నియో జన్మముల నెత్తవలసి వచ్చును. అందువలన మాంసభూయిష్ఠమగు నీ యస్థిపంజరముపైన అనురాగ ముంపకుము. జగన్మాత చరణ కమలమే మనకు తారకము. ఆమెనే సర్వదా స్మరించుచుండుము. దాన నీజీవితము సార్థకము కాఁగల"దని యుపదేశము చేసెను. నాగమహాశయుఁడు తాపసి. ఆయన సహధర్మిణి తపస్విని యయ్యెను.

ఇట్లు దినము లతిక్రమింపఁగా దీనదయాళుని దేహ మనారోగ్య స్థితికి వచ్చెను. నాగమహాశయులు తనతండ్రి "మెస్సర్సు పాలుల" కొలువు నింక విరమించుకొని మిగిలినకాల మీశ్వరాన్వేషణమున గడపవలయునని యనుకొనెను. కొమరుడు చాల ప్రార్థింపఁగా దీన దయాళు సెలవు తీసికొని జన్మస్థానమునకుఁ బోవుట కియ్యకొనెను. కోడలు గూడ మామగారికి పరిచర్యఁ జేయుటకై యతనితో బోయెను.

సురేశుఁడు యథాప్రకారముగ నాగమహాశయులతో మత విషయక చర్చలఁ జేయుచుండెను. కాని మాటలవలన లాభములేదని నాగమహాశయులు తెలుసుకొనెను. అందువలన నొక దినమున సురేశునితో "వాద ప్రతివాదముల వలనఁ గాలమంతయు వ్యర్థమై పోవుచున్నది. ప్రత్యక్షముగ నేనో యొకటి కన్గొనకున్నచో జీవితము సార్థకత బడయజాల"దనెను.

ఈ కాలముననే సురేశు డొకనాడు కేశవబాబు స్థాపించిన నవవిధాన సమాజమునకుఁ బోయియుండగా నచ్చట, సర్వసంగ ప

మంత్రోపదేశము - దక్షిణేశ్వరయాత్ర

త్యాగియై, సదా భగవద్ధ్యానపరుఁడై తరచు భావసమాధులఁ జెందు చుండిన యొక సాధువు దక్షిణేశ్వరమున నివసించుచుండెనని వినెను. సురేశుడు, మహాశయునితోఁ గూడ నా యోగిపుంగవుని సందర్శింప పోవలె ననుకొనెను. కాని కారణాంతరమువలన నాసంగతిని అప్పుడు మహాశయుని కెఱుక పరుపకయే యుండి రెండు నెలలయిన తరువాత చెప్పెను. నాగమహాశయులు చాల యాతురతతో తత్క్షణమే యాతని దర్శింప బోవలె ననెను. నాడిక నెంతో ప్రొద్దులేకుంటచే మరునాఁడుదయముననే ప్రయాణము చేయుటకు సమకట్టెను.

మరుసటి ప్రాతఃకాలమున భోజనములఁ గావించి బయలుదేరిరి. దక్షిణేశ్వరము కలకత్తా కుత్తరమున నుండెను. అందుచే వారా వైపున కున్ముఖులైరి అప్పుడు ఎండలు మెండుగ నుండెను. వేడిమికి కొంచెమైనను లెక్కసేయక నేదియో శక్తి తమ్మీడ్చుకొని పోవుచున్నట్లు పోవుచుండిరి. చాల దవ్వేగిన తరువాత నొక పథికుని దక్షిణేశ్వర మెచ్చట యని ప్రశ్నించిరి. అతఁడా యూరు దాటి చాలా దూరము వచ్చినారనెను. పాపము వారలు మరల వెనుకకు మరలిరి. రాణీ రాస్మణి యొక్క కోవెల గృహమును చేరుసరికి మధ్యాహ్నము రెండు గంట లాయెను.

ఆ కోవెల చుట్టును చల్లటినీడను బఱపుచు సుగంధమును వెదచల్లుచు నొక పూదోట యుండెను. ఆమిత్రులకు దక్షిణేశ్వర దేవాలయము దేవగణము యొక్క లీలాభూమివలెనే గన్పట్టెను. చల్లని నీటితో నిండి యాలయప్రాంగణమున నున్న తటాకమును, ఎత్తైన శిఖరములు గల నాకోవెలలను, చిగురుటాకుల దొడగిన వృక్షసమూహములను చూచుచు ఆ మిత్రులు చాల నానందించిరి. మహాశయులకా వృక్షముల యాకుల ఒరపిడియం దొక సుకుమారవాణి తమ్ముఁ "సంసార సాగరమున మునిగి

పోవుచున్న యో జీవులారా! మిమ్ముల దరిజేర్పగల నావ యచ్చట నున్నది." యని యాహ్వానముఁ జేయుచున్నటులుండెను.

ఇక నీ ప్రకృతి చిత్రములఁ దిలకించుట మాని నెమ్మదిగ వారు శ్రీరామకృష్ణులు నివసించుచుండిన గదిని జేరిరి. ద్వారమున నొకగడ్డపు మానిసి యుండెను. "అయ్యా! దక్షిణేశ్వరసాధు నెచ్చట నుండును." అని ఆతనిని వారడిగిరి. "అతని నివాస మిచ్చటనే కాని ప్రస్తుత మాతడు చంద్రనగరమునకుఁ బోయియున్నాడు. మీరింకొక దినమున వచ్చుట మంచిద"ని యాతఁడు ప్రత్యుత్తర మొసఁగెను.

ఇర్వురును హతాశులై, ఖిన్నవదనములతో నన్యోపాయము లేక వెనుకకు మరల నుండు సమయమున మహాశయులు తమ్మెవ్వరో లోనికి వచ్చుటకు సంజ్ఞ చేయుచున్నటుల జూచెను. దక్షిణేశ్వర యోగి యతడేనా యేమి? అవును. ఏమహాత్ముని దర్శింప వారా యాతపమును లెక్కసేయక యరుదెంచిరో యామహాత్ముఁ డాతఁడే కావచ్చును. ఆగడ్డపుమానిసి మాటలు సరకుగొనక వారు లోనికి ప్రవేశించిరి.

ఆ గడ్డపుమానిసి ప్రతాపచంద్ర హజ్రా. ఆతని కొరులెవ్వరును శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చుట గిట్టదు. అయినను భగవంతుని ప్రేమ ప్రవహించుచుండ నా ప్రవాహమున కడ్డుగ నెవరు నిల్వగలరు? ఆ ప్రేమయే లేనిచో, భగవంతుడు ప్రక్కన నిలుచొనియున్నను తెలిసికొనుట యశక్యము. ఇది శ్రీరామకృష్ణుల జీవితమందలి యొక వృత్తమును జ్ఞప్తికిఁ దెచ్చును.

ఒకనాడు శ్రీరామకృష్ణులు తన మేనల్లుడగు హృదయముఖోపాధ్యాయునితో కాళీ ఘట్టమునకుఁ బోయెను. అచ్చటి దేవాలయమున కుత్తరపుతట్టు కచ్చూరపు (కచుచెట్లు) పొదలుండెను. అప్పు

శ్రీ రామకృష్ణ సందర్శనము

జగన్మాత కొందరు చెలికత్తెలతో జవ్వనియై యాడుకొనుచుండుటను శ్రీరామకృష్ణులు చూచెను. ఆమె ఎఱ్ఱంచు చీరను ధరించి యుండెను. గొల్లభామలను పట్టుచు నాడుచుండెను. అంత నాత "డమ్మా! యమ్మా!" యని కేకలిడుచు చైతన్య విహీనుఁడయ్యెను. మరల స్మృతి వచ్చిన తరువాత శ్రీరామకృష్ణులు దేవాలయములోని కేగి చూడ నా కాళికావిగ్రహమున కచ్చట తానుజూచిన వస్త్రమే కట్టబడియుండెను. హృదయుడీ సంగతిని విని "మామా, నాకప్పుడే ఎందులకుఁ జెప్పవైతివి? నేనుపోయి యామె నప్పుడే పట్టుకొనియుందునుగదా!" యనెను గురుదేవు డిందులకు నవ్వి "నాయనా! అదియెన్నటికిని పొసగదు. ఆమె ఇచ్ఛలేక యామెను పట్టుకొనుటకు నీకేటి శక్తి? సర్వవ్యాపినియైనను ఆమెకృపకు పాత్రులుగాక యెవ్వరు నామెను గన్గొనఁ జాలర"నెను

శ్రీ రామకృష్ణ సందర్శనము

సురేశ నాగమహాశయు లిర్వురును లోనికిఁ బ్రవేశించిరి. శ్రీరామకృష్ణులొక మంచముపై కాళ్లు చాచుకొని కూర్చొనియుండెను. ఉత్తరాభిముఖుడై చిఱునవ్వు నవ్వుచుండెను. సురేశుడు చేతులు జోడించి నమస్కరించి చాపపై గూర్చుండెను. మహాశయులు హిందూ మతాచారరీతి సాష్టాంగమెఱగి యాయన పాదధూళిని స్వీకరింపఁబోయెను. కాని శ్రీరామకృష్ణులు పాదముల వెనుకకు లాగుకొనెను. ఇది మహాశయులకు దుర్భరమైన దుఃఖకారణ మయ్యెను. నిజమైన భక్తుడెవ్వడు నట్టి హక్కును బోగొట్టుకొన జాలఁడు. తానట్టి పవిత్రస్పర్శ కనర్హుడనని నాగమహాశయులు సమాధాన పరచుకొని ఆగదియందు దూరముగ నొక్కమూల గూర్చుండెను.

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్రము

శ్రీరామకృష్ణులు వారి పూర్వోత్తరములగూర్చి కొన్ని ప్రశ్నల నడిగెను. కొంతకాలము వారితో మాటలాడి సంభాషణానంతరమున "కుమ్మరి పురుగు మంటిలో నున్నను పంకిలముగాక స్వేచ్ఛగ నున్నట్లు మీరలును గృహస్థులై యుండదగును. సంసారపంక మేమాత్ర మంట కుండునట్లు మాత్రము జాగ్రత వహించియుండు"డనెను.

నాగమహాశయునికి గృహస్థ ధర్మనిర్వహణ సమస్యయే ఇంతవఱకు బాధించుచుండినందున ఈ యుపదేశమాతని మనమున గాఢముగ నాటుకొనెను. చాల నాశ్చర్యముతో నాతఁడు శ్రీ గురుదేవుని తదేకదృష్టితో జూడసాగెను. "ఏల యిట్లు జూచుచున్నావని" శ్రీరామకృష్ణు లడిగిరి. మహాశయులు "అయ్యా! మీ దర్శనమునకు జాల నాతురత పడితిని. నేటికా భాగ్యము లభించినందున తనివిదీర జూచుచున్నా" ననెను.

కొంతవడికి శ్రీరామకృష్ణు లా మిత్రద్వయమును పంచవటికిఁ బోయి ధ్యానమొనర్పుమని పంపెను. అట్లే సురేశమహాశయులిర్వురొక యరగంట వరకు ధ్యానోపవిష్టులై మగిడియేతెంచిరి. తరువాత శ్రీరామకృష్ణు లామిత్రులు తన వెంటరా, నచ్చటి దేవాలయముల నన్నిటిని జూపుటకు బయలుదేరెను.

శ్రీరామకృష్ణుని గది నంటి పండ్రెండు శివాలయము లుండెను. ఒక్కొక్క దానియందును ప్రవేశించి శ్రీరామకృష్ణులు స్వామికి ప్రదక్షిణము సల్పి సాగిలపడి నమస్కరించెను. మహాశయులును ఆతని ననుసరించెను. కాని సురేశుడు బ్రాహ్మమతావలంబి యగుటచే నా విగ్రహములయందు నమ్మకలేక వారి చర్యలను నడవడినిఁ జూచు చుండెను. తరువాత శివాలయముల కొకింత దూరముననున్న విష్ణ్వాల

శ్రీ రామకృష్ణ సందర్శనము

యములఁ బ్రవేశించిరి. అచ్చటగూడ పూర్వోక్తముగనే మెలఁగిరి. అటనుండి జగన్మాత దేవాలయమునకుఁ బోయిరి. జగన్మాత దేవాలయమును ప్రవేశింపగనే శ్రీరామకృష్ణు డొక క్రొత్తవానివలె నైపోయెను. భావప్రపూర్ణుఁడై వడకసాగెను. తన్ను దామరచి నట్లగపడుచుండెను. తుంటరిబాలుడు జనని చీరచెఱఁగు బట్టుకొని యామె చుట్టునుఁ దిరుగునట్లు జగజ్జననిచుట్టు ననేకమారులు ప్రదక్షిణములు సల్పెను. శివశక్తుల పాదములను తనశిరముతో స్పృశించి తనగది వైపు మరలెను. జగన్మాతయందలి ఈతని గాఢమగు నమ్మకమును, బాలుని వంటి యస్వతంత్రతయు మహాశయుల మంత్రముగ్ధునిఁజేసి వైచెను. భావోద్రిక్తుఁడై యూరక నాతనిపవిత్రభావములఁ దిలకించుచుండెను. సాయంతన మైదు గంటలకు మిత్రులిర్వురును ప్రయాణోన్ముఖులై శ్రీరామకృష్ణుల సెలవుకోరిరి. శ్రీరామకృష్ణులు "తరచుగ రాకపోకలుండుచో సంబంధము చాల సన్నిహితమగు"ననెను.

మార్గమధ్యమున మహాశయులు శ్రీరామకృష్ణుని వ్యక్తివిశేషమును గూర్చియే తలపోయుచు నాలోచనా నిమగ్నుఁడయ్యెను. "అతఁడు యోగియా, సిద్ధపురుషుఁడా, లేక కేవల మా భగవన్మత్తుఁడా?" ఈ సందేహ మాతని నావరించెను. ఆ శుభదినము నాటి యనుభవము లాతని హృదయమున నాటుకొని యాతని మనమున భగవద్దర్శనాకాంక్ష అగ్నివలె రగులసాగెను. ఆభావ మాతని యున్మత్తునిఁ జేసెను. నిద్రాహారములకు దూరమై యన్య సంస్పర్శమును రోయుచు నొక్క సురేంద్రునితో మాత్రము శ్రీరామకృష్ణ చరిత్రముఁ జర్చించుచు నేకాకియై యుండెను.

మరుసటి వారమున మిత్రు లిర్వురును మరల శ్రీరామకృష్ణుల వద్దకుఁ బోయిరి. ఆయన మహాశయుల యున్మత్తావస్థను చూచినంతనే

భావపరవశుడై "మీరిచ్చటికి వచ్చుట మంచిపనియే యైనది. మీ యందరికొఱకును వేచియుందు" ననెను. మహాశయులం జేరదీసి ప్రేమపూరితవచనముల "నాయనా! నీవు భయపడ నవసరము లేదు. నీ వత్యున్నత పదవికి వచ్చియున్నావు" అనెను. ఆ దినమునఁగూడ వారలను పంచవటికి భగవద్ధ్యానమునకై పంపెను.

వారు పంచవటికిఁ బోయిన కొంతసేపటికి శ్రీరామకృష్ణు లచ్చటికేగి మహాశయులను తనకు పొగాకు చిలుమును తయారుచేయు మనెను. మహాశయులా పనిపై బోయినతరవాత సురేశుని జూచి "మహాశయులు ప్రజ్వలితాగ్ని సుమా" యనెను. ఇంతలో మహాశయులు చిలుమును గొనితెచ్చెను. తరువాత నుత్తరీయము, కూజా, కూజాయందు జలము మొదలగువానిని ఒక్కొక్కదానినిగా చెప్పి తెప్పించుకొనెను. నాగమహాశయులు తనకట్టి మహాపురుషుని సేవ లభించెఁగదా యను సంతోషమును వెనుకటి పర్యాయమాయన తనకు పాదధూళి నీయ నిరాకరించెనను విషాదమును పెనగొన నమ్రతతో నా కార్యముల నన్నిఁటిని నెఱవేర్చెను.

నాగమహాశయు లింకొకసారి యొంటరిగ శ్రీరామకృష్ణులఁ జూడనేగెను. పూర్వమువలెనే యాయన భావసమాధిఁ బొందెను. తరువాత నేదియో గొణుగుచు లేచి నిలబడెను. ఆతని యీస్థితిఁ జూచి నాగమహాశయుడు భయభ్రాంతుఁ డయ్యెను. అంత శ్రీరామకృష్ణు "డయ్యా! మీరు వైద్యులు గదా! కొంచెము నాపాదముల పరీక్షింపుడు" అనెను. శ్రీరామకృష్ణులు తన సాధారణరీతిని మాటలాడుచుండుటఁజూచి మహాశయులు ధైర్యము దెచ్చుకొని చరణములఁ బరీక్షించి దోషమేమియు లేదనెను. శ్రీరామకృష్ణులు "మరల జాగ్రత్తగ పరీక్ష సేయు"డనెను. నాగమహాశయులు శ్రీరామకృష్ణుని యభిప్రాయ

మును తెలిసికొని గురువు శిష్యుల యభిమతములను దీర్చుట ఇట్లే గదా యని సంతోషపడెను. గురువుయొక్క కొంచెపు టుదార ప్రవర్తనము సచ్ఛిష్యుని అతిగాఢమగు ప్రేమపాశములచే గట్టివేయును. ఇక నాగ మహాశయునివంటి శిష్యునిగూర్చి వేరుగఁ జెప్పవలయునా? ఆతని మనఃక్లేశ ముపశమిల్లెను. ఆ పరమపవిత్ర చరణ ద్వంద్వ స్పర్శమున తాను ధన్యుడనైతినని భావించెను. చక్షుర్ద్వయమ్మునుండి సంతోష బాష్పధారలు స్రవించుచుండ నా పదముల శిరముపైనను హృదయము మీద నిడికొనెను.

గురు శిష్య సంబంధము బాగుగ దెలిసికొనిన వారలే ధన్యాత ములు. వారలకు భగవత్సాక్షాత్కారము కలుగఁగలదు. ఈసరికి మహాశయులు శ్రీరామకృష్ణుని భగవదవతారమని తెలిసికొనెను. ఈ రహస్యమును నీవెట్లు తెలిసికొనగలిగితివని యడుగ "నేను శ్రీరామ కృష్ణునివద్దకు పోయిన కొన్నినాళ్లకాయన కృపాలేశమువలన నా మహామహుడు శ్రీమన్నారాయణుడే యనియు దక్షిణేశ్వరమున నాయన లీల రహస్యముగ జరుగుచున్నదనియు తెలిసికొంటి"ననెను. మరియు "నా దేవదేవుని యవ్యాజకరుణాకటాక్షముననే దప్ప వేయి సంవత్సరములు తలక్రిందుగ తపస్సుచేసినను ఆయనను తెలిసికొన జాల" రనెను.

ఇంకొక దినమున నాగమహాశయులు శ్రీరామకృష్ణునిఁజూడ దక్షిణేశ్వరమునకుఁ బోయెను. అప్పుడాయన భోజనముచేసి విశ్రాంతి తీసికొనుచుండెను. అది మే నెల యగుటచే మిగుల నుక్కపోతగ నుండెను. అందువలన మహాశయుని తనకు విసరుచుండుమని చెప్పి శ్రీరామకృష్ణుడు నిద్రపోయెను. మహాశయులు చాలసేపు విసరుచుండి నందున చేతులు నొప్పియెత్తినను గుర్వాజ్ఞ లేనిదే నిలుపజాలక విసరు

చునేయుండెను. అంతకంతకు చేతులు బరువెక్కి ఇక వీవనను పట్టుకొనజాలనంతటిస్థితికి వచ్చునప్పటికి శ్రీరామకృష్ణు లాతని కరమును బట్టుకొని వీవనను తీసికొనెను. ఈవిషయమునుగూర్చి చెప్పుచు మహాశయులు "ఆయన నిద్ర యసాధారణము. ఆయన ఎల్లప్పుడును (నిద్ర పోవుచుగూడ) మేల్కొనియేయుండును. ఈస్థితి భగవంతునికి దక్క నితరుల కెవరికిని తుదకు సిద్ధులకుగూడ సాధ్యము కా" దనెను.

ఒకపరి శ్రీరామకృష్ణుడు నాగమహాశయుని తన్నుగూర్చి యాతని యభిప్రాయ మేమని యడిగెను. నాగమహాశయుడు "దేవా! నీ కృపాకటాక్షములచే నీవు భగవంతుడవే యని తెలిసికొంటిని" అనెను. ఇది విని శ్రీరామకృష్ణుడు సమాధి నిమగ్నుడై యాతని వక్షమును తన కుడిపాదముతో స్పృశించెను. ఈచర్య నాగమహాశయుని యందొక మార్పును గలుగచేసెను భూమ్యంతరిక్షములనిండి చరాచర ప్రపంచము నతియు వ్యాపించిన యొకమహాజ్యోతి యాయనకు గనిపించెను. తరువాత తరువాత శ్రీరామకృష్ణునిగూర్చి తనయభిప్రాయమును దెల్పుచు "ఆయనను దేనికొఱకును ప్రార్థింపనక్కరలేదు ఆయన కల్పతరువు. మనయభిప్రాయములను చెప్పకయే ఎఱిగి వానిని సఫలీకృతముచేయును. శ్రీరామకృష్ణులు భూమి నవతరించినది మొదలు సకలమును కొట్టుకొనిపోవు నొక మహావెల్లువ వచ్చియున్నది. ఆతడు భగవంతుని సంపూర్ణావతారము. ఇంతదనుక సర్వమత సామరస్యము నింత విపులముగ నిరూపించిన యవతార మింకొకటి వచ్చియుండలే" దనువారు.

మహాశయులకు వివేకానందస్వామితోడి ప్రథమ పరిచయము దక్షిణేశ్వరమునఁ గలిగెను. అప్పటి కాతఁడు నరేంద్రుఁ డను నామమున పిలువఁబడుచుండెను. ఒకనాఁడు మహాశయులు శ్రీరామకృష్ణులయెదుట

గూర్చొనియుండగా నరేంద్రుఁడు "శివోహం" "శివోహ" మ్మని యుచ్చరించుచు గదిని బ్రవేశించెను. అంత శ్రీరామకృష్ణులు మహాశయుల వ్రేలితోఁజూపుచు "నరేంద్రా! యీతఁడు అహంకార రహితుఁడు. ఇది యాతని సహజ స్వభావముగాని నటనకాద"నెను. "మీరట్లు చెప్పినచో నది వేరొకవిధముగ నుండఁజాల"దని నరేంద్రుఁడనెను. ఆశిష్యద్వయ మంత నిట్లు సంభాషించు కొనసాగిరి:—

నాగ:—సకలమును జగన్మాత ఇచ్ఛామాత్రము చేతనే జరుగుచుండును. ఆమె ప్రపంచాతీతమగుశక్తి. ప్రతికార్యము నామెయే జరపుచుండును. కాని మనుజులు తాము చేయుచున్నా మనుకొందురు.

నరేం:—నీవు చెప్పు ఈ "ఆమెను" నే నొప్పుకొనజాలను. ఆత్మను నేనే. నాలోననే సకల చరాచర ప్రపంచముఁగలదు. నాలోననే యది పుట్టి పెరిగి లయించుచుండును.

నాగ:—నీకొక తెల్లని వెంట్రుకను నల్లగఁ జేయుటకైనను శక్తిలేదు. ఇక ప్రపంచము మాట యేమి? ఈశ్వరేచ్ఛలేనిదే గడ్డిపోచ యైనను కదలదు.

నరేం:—నా సంకల్పము లేనిదే సూర్యచంద్రాదులు తిరుగ జాలరు. సృష్టిచక్రమును నడుపుచుండునది నాసంకల్పమే.

ఈ సంభాషణ నంతయు నాలకించుచుండిన శ్రీరామకృష్ణులు మహాశయులఁ జూచి "నరేంద్రుఁడట్లనఁగలఁడు. అతఁ డొరనుండి తీసిన ఖడ్గము. అతఁడు అట్లు చెప్పుట అహంభావమువలన కాదు" అనెను. శ్రీరామకృష్ణుని మాటలు విని మహాశయులు నరేంద్రుని పాదములకు నమస్కరించి యూరకుండెను. అప్పటినుండి, నరేంద్రుఁడు శ్రీరామ

కృష్ణుని లీలకొఱకై యవతరించిన శివుఁడేయని భావించెను. ఒకపరి యొకానొకఁడు మహాశయులను "నీవెప్పుడైనను ముక్తపురుషునిఁ జూచి యుంటివా?" యని ప్రశ్నింపఁగా యాతఁడు వెంటనే "అనేకులకు మోక్షమును ప్రసాదించిన శ్రీ రామకృష్ణునిఁ జూచితిని. శివుని యవతారమగు వివేకానందస్వామిని జూచితిని" అనెను. వాస్తవముగ నీతని విశ్వాసము పర్వతములను, చలింపఁజేయఁజాలియుండెను. శ్రీ రామకృష్ణుని ముఖమునుండి వెలువడు ప్రతివాక్యమును ఆయనకు వేదవాక్యము. పరిహాసమున నాడినమాటలుగూడ నాతనికి ప్రమాణములే. "నేను అల్పజ్ఞుఁడను. ఆయననెట్లు తెలిసికొనఁగలుగుదును" అనువాఁడు.

ఒకమారు శ్రీ రామకృష్ణులు శిష్యులతో "వైద్యులకును న్యాయవాదులకును నడిబేరగాండ్రకును పారమార్థిక సత్యముల తెలిసికొనుట కష్టము" అనెను. ముఖ్యముగా వైద్యులను గూర్చి "మందుచుక్కలపై నిలకడగొన్న మనస్సు బ్రహ్మాండమైన యీప్రకృతి నెట్లు తెలిసికొనఁగలదు"ని చెప్పుచుండ మహాశయులు వినుట తటస్థించెను. ఈకాలముననే నాగమహాశయుని ధ్యానసమయములందు రోగుల స్వరూపములు జ్ఞప్తికివచ్చి ధ్యానము చెడిపోవుచుండెను. అందువలన నీ హితవాక్యము తన్నుద్దేశించియే చెప్పబడెనని యాతఁడు తలంచెను. పారమార్థిక పథమున నంతరాయమగు నావృత్తిని తత్క్షణమే విడనాడవలయునని నిశ్చయించుకొనెను. ఇంటి కరిగి యాదినమే తనమందుల పెట్టెను వైద్యగ్రంథములను గంగానది యందు బడవైచి స్నానమాచరించి గృహమునకు వెడలెను.

దీనదయాళున కీవార్త తెలిసెను. తోడనే యాతఁడు కలకత్తాకు వచ్చి తనకొమరుని తనస్థానమందు వినియోగింపుఁడని "మెస్సర్సు పాలు

ల"ను కోరెను. అట్లే వారు నియమించిరి. దీనదయాళు కలకత్తాను విడిపోయెను.

నాగమహాశయుని పని చాల స్వల్పము. అప్పుడప్పుడు మాత్రము బాగుబజారునకును కిద్దర్‌పూరు కాలువలకును బోవలసి యుండును. ఈపనియందు ప్రవేశించిన తరువాత నాతనికి దక్షిణేశ్వరమునకుఁబోవుటకు కావలసినంత తీరిక యుండెడిది. ఆయన ధ్యానకాల ముహూర్త నిప్పుడెక్కువయయ్యెను. ఆతనిగృహమందు పరిశుభ్రమైన యొక స్థలమున నొకపాత్రయందు పవిత్రగంగాజలము నుంచి గంటల తరబడి ధ్యాననిమగ్నుఁడై యుండును.

పనిమీఁద బాగుబజారునకు బోయినప్పుడు తోటలో నొక ఏకాంతప్రదేశమున భగవద్ధ్యానము సల్పుచుండును. ఒకనాఁడిట్లు ధ్యానోపవిష్టుఁడై యుండ నాతనికొకయద్భుతసాక్షాత్కారమయ్యెను. గృహమునకు మరలివచ్చినతరువాత సురేశునితో తా నెప్పుడును ధ్యానమున నట్టి యానందముఁ బొందలేదని చెప్పెను.

శ్రీరామకృష్ణుని సాంగత్యబలమున నాతనికి విరక్తిభావము పెంపొందసాగెను. తత్క్షణమే ప్రపంచసుఖములను విడనాడి సన్న్యాసమును స్వీకరింపవలెనని యెంచి శ్రీరామకృష్ణుని యనుమతి నడుగుటకై యాతఁడొకనాఁడు దక్షిణేశ్వరము వెళ్లెను. శ్రీరామకృష్ణుఁడు అప్పుడే సమాధినిమగ్నుఁడై యిట్లు చెప్పుచుండెను. "గృహస్థజీవితమున గల లోపమేమి? మనస్సును ఎల్లప్పుడును భగవంతునియందే లగ్నము చేసియుంచుము. గృహమేధిజీవితము కోటలోనుండి యుద్ధముచేయుట వంటిది." ఏదివ్యశక్తి తనయందీ తీవ్రసన్న్యాసభావమును రగుల్పజేసెనో యదియే ఇప్పుడు జనకచక్రవర్తివలె గృహస్థధర్మమున నుండుమని

దారిజూపుచుండెను. శ్రీరామకృష్ణుఁడు తరువాత నిట్లు చెప్పెను. "నీ జీవితము గృహస్థుల కందఱకు నాదర్శప్రాయముగ నుండగలదు." ఇది గుర్వాజ్ఞ గావున నాతఁడు శిరసావహించెను.

నాగమహాశయులీ యాజ్ఞను శిరసావహించినను మనస్సునందలి యల్లకల్లోలమింకను నడఁగలేదు. మనస్సును నిశ్చయపరచుకొనజాలక రేయింబవళ్ళు భగవంతుని ప్రార్థించుచు "హా జగన్నాథా, పరమేశ్వరా"యని నిట్టూర్పుల పుచ్చుచుండెను. మంటలో పడి పొరలును. ముండ్ల పొదలపైబడి దేహమంతయు గాయపరచుకొనును. ఆహారముపై యిచ్ఛ పూర్తిగ నశించెను. సురేసుడు బలవంతముగ తినిపించినచో తప్ప నాతఁడు భుజించి యెఱుఁగడు. తనముం దేమి జరుగుచుండెనో కూడ నాతనికి తెలియదు. ఆతఁ డెప్పటికిఁబోవునో కూడ నెవ్వరు నెరుఁగరు. ఒక్కొక్కప్పుడు పోయినదే పోకడఁగఁబోయి తెల్లవారుఝామున రెండుగంటలకువచ్చును. ఇట్లు తన కాలమంతయు మతిభ్రష్టుని వలెఁ గడపుచు తనకు నియమించిన స్వల్పకార్యములను గూడ నిర్వర్తింపఁజాలకుండెను. అందువలన నీతనితో కొలది పరిచయమున్నట్టియు, యోగ్యుఁడునైన రంజితు హాజ్రాయను నింకొక యుద్యోగి యీతని కార్యములను నిర్వర్తించుచుండెను.

ఈ సమయముననే నాగమహాశయు లొక కొంతకాలము తన జన్మస్థానమునం దుండుట తటస్థించెను. ఈతని విపరీతస్థితిని జూచి భార్య భయభ్రాంత యయ్యెను. తన భర్తకు సంసారేచ్ఛ పూర్తిగ నశించినదని తెలిసికొనెను. నాగమహాశయుఁడు గూడ తాను శ్రీరామకృష్ణుని పాదములను శరణు జొచ్చిన పిదప కుటుంబమునకై ప్రాపంచికాసక్తుఁడగుట దుర్లభమని చెప్పెను.

మంత్రోపదేశము - దక్షిణేశ్వర యాత్ర

నిక్కముగ శ్రీ రామకృష్ణుని జూచినది మొదలు నాగమహాశయుని మనస్సు ప్రపంచమునకు సంపూర్ణముగ విముఖమయ్యెను. అప్పటి యాతని మనఃస్థితిని విశదపఱచుటకొక సంఘటనము నిట తెల్పెదము. నాగమహాశయుని సోదరి తోటయందొక అనప పాదును నాటియుండెను. పొరుగింటివాఁడు ఆపాదున కొకింత దూరమున తనయావును కట్టియుంచెను. త్రాడు చాల పొట్టి యగుటచే నాయావు ఆపాదును తినవలెనని ఎంత ప్రయత్నించినను అందలేదు. మహాశయులు దాని విఫలప్రయత్నములను జూచుచుండి ఆయల్పజంతువుపైని జాలిచేతనో లేక నాపవిత్ర గోమాతపైని భక్తిచేతనో ఏకారణముననో యాత్రాటిని విప్పి "యమ్మా! తిను"మనెను. ఆగోవు తృప్తి తీరఁ దినుచుండెను. దీనినంతయు దూరమునుండి దీనదయాళు చూచుచుండెను. మనసు పట్టఁజాలక యాతఁడు కుమారునితో నిట్లనెను.

దీన:—నీవేమో కుటుంబమునకు నిస్సహాయుఁడవు. కుటుంబమునకు మేలుచేయకపోవుటయేగాక మీఁదుమిక్కిలి ఇట్టి నష్టమునుకూడ కలుగఁజేయుటకు నీకెట్టిధైర్యము! నీవు వైద్యవృత్తిని మానుకొంటివి ఇక ఆకలిపిశాచము నెట్లు తరుమగలవు?

నాగ:—ఆవిషయమై నీ వాయాసపడవలదు. సర్వవ్యాపకుఁడగు నా దేవదేవుడే మన యోగక్షేమములను వహింపఁగలఁడు.

దీన:—అవును! యీమాత్ర మెవరికిని తెలియకపోలేదు. నీకు కట్టుకొనుటకు గుడ్డయైన లేక కప్పలనుతినుచు దేశదిమ్మరిగ తిరుగవలసిన కాలము వచ్చినది.

మరల మాటాడక మహాశయులు కౌపీనమును తీసివైచి యొక చచ్చిన కప్పను తీసుకొనివచ్చి తినుచు తండ్రితో నిట్లనెను. "ఇప్పుడు

నీ యాజ్ఞలను రెండింటిని శిరసావహించితిని. దయయుంచి యికెన్నడును కుటుంబ పోషణమునుగూర్చి తలపెట్టకుము. భగవన్నామమును స్మరించుచు కాలమును గడపుము నేను తలవంచి ప్రార్థించుచున్నాను. ఈ ముదుసలి వయస్సునందు ఐహిక విషయములను ఎంతమాత్రమును తలపెట్టవలదు తండ్రీ" యనెను. దీనదయాళు కొమరునికి పిచ్చియెత్తినదని నిశ్చయపడెను. అందువలనఁ గోడలిని పిలిచి యిక నాతని యిచ్ఛకు వ్యతిరేకముగ నెన్నడును ప్రవర్తింపవలదని చెప్పెను.

మహాశయులు తన తండ్రియింట నున్నంత కాలము ఆయనను సంసారముమాట తలపెట్టనీయక యెల్లప్పుడును మతవిషయికములును భక్తిపూరితములునగు గ్రంథములను చదివి తండ్రికి వినిపించువాఁడు. మరియు తండ్రితో వ్యర్థసంభాషణల సల్పువారిని తిట్టి వారితో, నిక ముందెన్నడట్టి వృథాకాలయాపనము చేయవలదనియు లేకపోయినచో తన గృహమునకు రావలదనియు ఖండితముగ జెప్పువాఁడు.

మహాశయులు కలకత్తాకు మరలివచ్చిన తరువాత సురేశుఁడు దీనదయాళుని స్థితి యెట్లున్నదని యడిగెను. అంత మహాశయులు నిట్టూర్పుపుచ్చుచు "మనుజుఁడు ప్రాపంచిక విషవృక్షఫల మొకమారు చవిచూచినఁ జాలును. ఆతనిగతి యధోగతియే యగును. మహామాయ యనుగ్రహములేనిదే అతఁడు తరింపఁజాలఁడు" అనెను. తన తండ్రి దుఃస్థితిఁ దలఁచుకొని యేడ్చుచు, "జయశ్రీరామకృష్ణా జయశ్రీరామకృష్ణా జయశ్రీరామకృష్ణ ప్రభూ! నాతండ్రిని కటాక్షింపవా" యనెను. దుఃఖ ముపశమించిన తరువాత సురేశునితో తన తండ్రి యంత వృద్ధుఁడై కదలుట కశక్తుఁడైయుండియు ప్రాపంచికవిషయ లంపటుఁడై సదా యందే మునిగియుండును. మరియు పొరుగువాఁడెవఁడైన వచ్చుచో వ్యర్థసంభాషణకై యువ్విళ్లూరుచుండునని చెప్పెను.

మంత్రోపదేశము - దక్షిణేశ్వర యాత్ర

అటుతరువాత నొకసారి శ్రీరామకృష్ణుని దర్శింపఁబోయి యాయనతో "అయ్యా! నేనేల యింకను ఆభగవంతుకిని సంపూర్ణముగ నాత్మసమర్పణము చేసికొనలేకయున్నాను. ఇంకను పురుషప్రయత్నము పోకుండుటకు కారణమేమి?" అనెను. అందులకు శ్రీరామకృష్ణుఁడు తన్ను నిర్దేశించుచు "దీనియెడల నీకు భక్తికుదిరినచో అంతయు చక్కఁబడును" అని చెప్పెను.

నాగమహాశయుని గాఢమగు సన్యాసభావమును కనుఁగొని మరల శ్రీరామకృష్ణుఁడు "నీవు గృహస్థుఁడవై యే యుండుము. నీ కుటుంబ పోషణ మెట్లో జరిగిపోవుచుండును" అనెను.

నాగ:—గృహస్థుఁడనై యుండుట కెట్లు వీలగును? ఇతరుల కష్టములను జూచుచు చలింపకుండుట సాధ్యమా?

శ్రీరామ:—నేను చెప్పుచున్నాను వినుము. ఇంటిని వీడి పోకుము. సంసారము నిన్నంటఁజాలదు. నీజీవితమును జూచి యందరు నాశ్చర్యపడఁగలరు.

నాగ:—గృహస్థుఁడనై నేను నాదినముల నెట్లు గడుపవలెను?

శ్రీరామ:—నీవేమియుఁ జేయనక్కఱలేదు. ఎల్లప్పుడును సజ్జనగోష్ఠి యందుండుము.

నాగ:—మందబుద్ధినైన నేను సజ్జన దుర్జనుల నెట్లు గుర్తింపఁ జాలుదును?

శ్రీరామ:—నీవు వారికొరకై వెదకుచు పోవ నవసరములేదు. ఇంటియందే యుండుము. నీకొరకై వారే వత్తురు.

ఇట్లు దినములు గడవగా నాగమహాశయులు తాను కుటుంబపోషణకై పాటుపడవలయునేని తనకు శాంతియెంతమాత్రమును చేకూరఁ

జాలదని తెలిసికొనెను. ఆ కారణమున తన పనినంతయు రంజితు హ్రాజా కప్పగించి తనకాలమును భగవద్ధ్యానమునఁ గడుప నిశ్చయించుకొనెను. ఒకనాఁడు సందర్భవశమున నీ సంగతి "మెస్సర్సు పాలుల"కుకూడ ఎరుకపరచెను. అంత వారు "అట్లయిన నీకుటుంబము నెట్లు పోషించుకొనఁగలుగుదు"వని యడిగిరి. "రంజిత హ్రాజా దయదలచి ఇచ్చిన స్వల్పముతోడనే పోషణ జరుపుకొందు" నని ప్రత్యుత్తరమిచ్చెను.

"మెస్సర్సు పాలులు" నాగమహాశయులిక కుటుంబమునకెట్టి సాయమును చేయఁజాలఁడని గ్రహించిరి. ఇంతకాలము తమపై నాధారపడియుండిన యీ కుటుంబమును పోషించు భారము తమదని రంజితుని పిలిచి యాతని సగపాలు రాబడి మహాశయుల కిచ్చునట్లు ఏర్పాటుచేసిరి. రంజితు సంతోషపూర్వకముగ నొప్పుకొనెను. కాని యాతఁడు మహాశయుని మనోభావమును బాగుగ నెరిగినవాఁడు కావున కుటుంబ భోజన ఖర్చులకు మాత్ర మాతనివద్ద నిచ్చి మిగిలిన పైకము నాతఁడు దీనదయాళువికిఁ బంపుచుండెను.

శ్రీ రామకృష్ణు లీ సంగతినివిని చాలసంతసించి "బాగుబాగు" అనెను.

ఇప్పు డన్ని బంధముల నుండియు విముక్తుఁడై మహాశయులు తన కాలమంతయు ధ్యానాదులందే గడపుచు. తరచు శ్రీ రామకృష్ణుని దర్శించుచుండెను. సాధారణముగా నాతఁడు ఆదివారమునాఁడును ఇతర సెలవు రోజులయందును దక్షిణేశ్వరమునకు వెళ్లువాఁడుకాఁడు. ఏలయన యట్టిరోజులయందు గొప్పగొప్ప స్థితిమంతులును విద్వాంసులును శ్రీరామకృష్ణుని దర్శింప వత్తురు. వారితో మాటలాడుటకు తా నసర్హుఁడనని యాతని నిశ్చయము కాని యిప్పుడా నియమమును వదలి తరచు పోవుచుండుటచే కొందరితో పరిచయము కలిగెను.

మంత్రోపదేశము - దక్షిణేశ్వర యాత్ర

ఒకరాత్రి * గిరీశుఁడిద్దరు మిత్రులతో దక్షిణేశ్వరమునకు వచ్చెను. అతఁడు శ్రీరామకృష్ణుని గదిలోనికి ప్రవేశించి యచ్చట చేతులు జోడించుకొని చాల వినతభావముతో యొక మూల యొదిగి కూర్చొనియుండిన యొకవ్యక్తిని జూచెను. దేహము కృశించి వికారముగ నుండినను నేత్రములు శాంతియుతములై ప్రజ్వలించు చుండెను. గిరీశుఁ డాతఁడెవ్వరాయని నివ్వెరపడి చూచెను. అంత శ్రీరామకృష్ణుఁడు గిరీశున కాతని పరిచయపరచెను. ఆశుభ సమయమునుండియే గిరీశ మహాశయు లిర్వురును ప్రాణమిత్రులై యుండిరి.

నాగమహాశయులు సాయంతనముల దరచు గంగానదీతీరమున గడపువాఁడు. ఒకనాఁడట్లు నదీతీరమున నడయాడుచుండ నొకవ్యక్తియగు యువకుని గాంచెను. యువకుని జూడఁగనే మహాశయు లాతఁడు శ్రీరామకృష్ణుని భక్తుఁడై యుండవలయు ననుకొనెను. యువకుని ప్రశ్నింప నాతనియూహ సత్యమయ్యెను. అతఁడు తురీయానంద స్వామి (అప్పుడు హరిమహరాజ్). నాగమహాశయు లాతని కఠోర బ్రహ్మచర్యమునుగూర్చి చెప్పుచు "ఇట్టివాఁడు గనుకనే శ్రీగురుదేవుని కృపకుఁ బాత్రుఁడయ్యె"ననువాఁడు.

ఇప్పటినుండి మహాశయులు చొక్కాను జోళ్లను ధరించుట మానివైచెను. ఒక యుత్తరీయమును మాత్రము కప్పుకొనును. భోజనము విషయమునమాత్ర మాతఁ డెట్టి నియమములను పెట్టుకొనలేదు. ఏలయన శ్రీగురుదేవుఁడు "నీకేమి భగవంతుఁ డొసఁగునో, దానిపై జీవించియుండుము. నీకు వేరు నియమము లేమియు వలదు" అనిచెప్పి

* గిరీశచంద్రఘోషు ప్రసిద్ధబంగాలీ నటకుఁడు. శ్రీరామకృష్ణుని ప్రియభక్తుఁడు.

యుండెను. సాధారణముగ నాతఁడు దినాంతమున కొలదిమాత్రము భుజించును. అయినను జిహ్వాచాపల్యము నాపుట కుప్పను తీపిని ముట్టుట మానివైచెను.

నాగమహాశయుఁడు తనగృహములో కొంతభాగము కీర్తివాసుఁడను నాతనికి బాడుగ కిచ్చెను. ఆతఁడు బియ్యపు వర్తకముఁ జేయుచుఁ గుటుంబముతో నందుండువాఁడు. ఆ హేతువున అప్పుడప్పు డిల్లంతయు తవుడుతో నిండియుండును. మహాశయు లొకసారి తానిక నాతవుడునే భుజించి యుండవలయు ననుకొనెను. "ఈదేహము నిల్పుట కదియే చాలును. రుచికరములగు పదార్థము లెందులకు" అని నిశ్చయించుకొని యాతవుడును నీటిలోఁ గలిపి రెండుదినములు దానినే భుజించియుండెను. ఇది కీర్తివాసునకుఁ దెలియనయ్యెను. తోడనే యాతఁడా తవుడునంతయు నమ్మివైచి యంతకు తరవాత యొన్నఁడు నింటియందు పోగుపడకుండునట్లు చూచుచుండెను.

కీర్తివాసునకు, నాగమహాశయుని పావనజీవితము ఆతని యందమితగౌరవమును కలిగించెను. అందుచే నతిథిసత్కారమున కేమైన లోటువచ్చిన నాతనికి సాయపడువాఁడు. మహాశయుల గృహము రాజబాటకు ప్రక్కనే యుండుటచే నెందరో బిచ్చగాండ్రాతని ఇంటికి వచ్చుచుందురు. వారిలో నెవ్వరినికూడ రిక్తహస్తునిగ పంపుట లేదు. ఒకదినమున నొక వృద్ధవైష్ణవుఁడు భిక్షార్థియై వచ్చెను. మహాశయుల వద్ద నొకరికి సరిపడు అన్నముతప్ప నేమియు లేదు. కీర్తివాసుఁ డింటి వద్దలేఁడు. అంత నాతఁడతి నమ్రతతో నాతనిదరికేగి "యయ్యా నావద్ద కొలది బియ్యముమాత్ర మున్నవి. స్వీకరింతురా" యని యడిగెను. ఆవృద్ధుఁడాతని నమ్రత కాశ్చర్యపడుచు సంతసమున నాబియ్యముఁ గొంపోయెను.

మంత్రోపదేశము - దక్షిణేశ్వర యాత్ర

నాగమహాశయుడెన్నడును ఫలహారము చేసి యెరుగడు. భగవంతునికి నైవేద్యము చేయని భక్ష్యముల నాతఁడు తీసికొనఁడు. తాను రుచికరములగు పదార్థములనెన్నడును ముట్టక పోయినను అతిథుల నట్టి పదార్థములచేతనే తృప్తిపరచును.

మహాశయులు ప్రాపంచిక విషయములగూర్చి మాటలాడరు. ఒరులెవరైన నట్టి సంభాషణ యందున్నయెడల నాతఁడు అతి చాకచక్యముగ "జయశ్రీరామకృష్ణ" యనుచు "ఈవ్యర్థసంభాషణ వలన నేమిలాభము. దయయుంచి భగవన్నామము నుచ్చరించుచు కాలమును గడపుఁడు. జగన్మాతకు నమస్కరింపుఁడు" అనును. ఏదైనకారణమున తనకొరులపై కోపముగాని యసూయగాని జనించినయెడల తనప్రక్కనేయున్న దానితో తనదేహమును మర్దించుకొనును. పరుల దుర్గుణముల నాతఁడు గణింపడు. ఒకమారు మాటల సందర్భమున నొకని దుర్గుణములఁ జేర్కొనెను. మరుక్షణముననే ప్రక్కనున్న యొక రాతితో తలను మోదుకొన నారంభించెను. రక్తము బాగుగా కారి యా గాయము నెలరోజుల వరకు మానలేదు. కాని యాతఁడు సంతసమున "తగిన శాస్తియైనది, మంచిపనియైనది. ఈ దుష్టునకుఁ దగిన బహుమానము లభించిన" దనెను.

తన మనోవికారముల నణచుటకై యాతఁడు తరచు దీర్ఘోపవాసములుండును. ఒక్కొకసారి యైదారు దినముల వరకు జలమును కూడ ముట్టక ఉపవాసముండును.

అట్టి యొకానొకసందర్భమున సురేశుఁడాతనియింటికి పోయి యుండెను. ఆసమయమున నేమియభిప్రాయము గలిగెనో గాని సురేశుని జూడగనే వండుచున్న కుండను శకలములగావించి యేడ్చుచు

"సురేశా! నాకింకను క్రూరత్వము నశించినది కా"దనెను. ఆదినమున భోజనముసేయక ఒక దమ్మిడి యాటుకులను దిని యుండెను.

నాగమహాశయునకు తలనొప్పి దీర్ఘవ్యాధి యగుటచే స్నానము విడువవలసివచ్చెను. కడపటి ఇరువది సంవత్సరములు అతను స్నానము చేయనేలేదు. అందుచే ఆతని శరీరము యెండి కరకుగా నుండెను. దానిపై ఘోరమగు తపస్సు. ఇవి యన్నియుఁగూడి యాతని శరీరము యొక్క ప్రతిభాగమును ఆతని నమ్రతను జాటుచుండెను. వేయేల నమ్రతయే యిట్టి రూపముఁ గైకొన్నయట్లుండును. "నాగమహాశయులు అహంభావము యొక్క శిరమును చితుకఁగొట్టి చితుకఁగొట్టి దానిని పగులఁగొట్టె" నని గిరీశ బాబనువాడు. మహాశయులు వీధివెంబడిఁ బోవునప్పుడు కూడ ఇతరులను అతిక్రమించి ముందుకుపోవువాఁడు కాఁడు. సాధారణ బాటసారులకు కూడ త్రోవయిచ్చి తొలఁగును. పరుల సీమనైన త్రొక్క సాహసింపఁడు. ఇతరులు కూర్చొనియున్న ప్రక్కపై నాతఁడు కూర్చొనఁడు. ఎందువలన యన నాతఁడు సర్వ వస్తుసముదాయమునను భగవంతునిఁ జూచును. తాను భగవత్సేవకుఁడు. అట్టిచోఁ దానెట్లు ఈశ్వరుఁడు సేయు సపర్యల నంగీకరింపఁగలఁడు? కాని ఈసేవకుఁడు ఆసర్వవ్యాపి యగు పరమేశ్వరుడే రూపమున వచ్చినను పరిచర్యసేయుటకు తయారుగ నుండును. ఒరులు తయారు చేసి యిచ్చిన పొగాకు చిలుముల నాతఁడు త్రాగఁడు; కాని తానందరకుఁ దయారుసేయును. స్నేహితుఁడింటికి వచ్చినప్పుడు అతనికి చిలుములు తయారుచేసి యిచ్చును. అమిత్రుఁడు వెళ్లునపుడు గూడ నాపి యొకరెండు చిలుములను కాల్చుమని కోరును. "నే నల్పుఁడను. హీనులకంటె హీనుఁడను. నే నెట్టిగొప్ప కార్యమును జేయఁజాలినవాఁడను గాను. మీకందరకిట్లు చిలుములను తయారుచేసియైన మీ కృపకుపాత్రుఁడనై నా జన్మమును సార్థకముఁ గావించుకొందు"ననును.

మంత్రోపదేశము - దక్షిణేశ్వర యాత్ర

నాగమహాశయులు, *రాగమార్గసాధకుఁడైనను, వైధీభక్తి యన నిష్టపడువాఁడు. తాను కష్టతరములగు సాధనలఁ జేయుటయే గాక నితరులనుకూడ అటుల నడచుకొనుమనును. ఈవిషయమై సురేశునితో నొకనాఁడు వాదము జరిగెను. సురేశుఁడు క్వెట్టాకు పోవలసివచ్చెను. క్వెట్టాప్రయాణమునకు ముందు మహాశయులు సురేశుని గురూపదేశ మందు మరి ప్రార్థించెను. కాని సురేశునికి మంత్రములందు నమ్మకము లేకపోవుటచే నాతనితో వాదించి ఎట్టకేలకు నాతని ప్రార్థనపై శ్రీ రామకృష్ణు లెట్లుచెప్పిన అట్లు చేతుననెను. మరునాడిర్వురు మిత్రులును దక్షిణేశ్వరమున కేగిరి. కూర్చొని కొంచెము స్థిమితపడిన తరువాత నాగమహాశయులు సంగతి దెల్పెను. “ అవును నీవనినది నిజము. ఉప దేశానంతరము ధ్యానాదుల నుపక్రమించుట మంచిది. సురేశా! నీవెం దుల కంగీకరింపకూడ ” దని శ్రీరామకృష్ణు లనెను. సురేశుఁ “ డయ్యా! నాకు మంత్రములందు నమ్మికలేద ” నెను. అంత శ్రీరామ కృష్ణులు నాగమహాశయుల వైపుదిరిగి “ ఇప్పుడవసరము లేదు. కొంత కాలమున కదియే సిద్ధించు ” ననెను.

సురేశుఁడు క్వెట్టాకుఁ బోయిన కొంతకాలమునకు గురూపదేశ మందభిలాష జనించెను. కలకత్తాకువచ్చి శ్రీరామకృష్ణులవద్ద ఉపదే శమును పొంద నిశ్చయించుకొనెను. కాని యాతఁ డచ్చటికి వచ్చు సరికి దక్షిణేశ్వర జ్యోతి చలించుచుండెను. తాను నాగమహాశయుని వాక్యముల సరకుగొననందులకు విచారించెను— శ్రీరామకృష్ణులు దివంగతులైరి. సురేశు డెంతయో విచారించి తన యదృష్టమును నిందిం

---

* రాగభక్తియందు భక్తుఁడు ఎల్లప్పుడు తనఇష్టదైవముయొక్క సాన్నిధ్యముననే యుండును. కావుననే వైధీభక్తియందలి పూజా విధానములను వీరు చేయరు.

చుకొనెను. ప్రతిరాత్రియు గంగాతీరముపై తన ఈతీరనికష్టమునకు దుఃఖించుచు గడెపుచుండెను. ఒకసారి శపథముపట్టి యా యొడ్డుననే పరుండెను. ప్రాతఃకాలమున నదయాత్పూర్వమే యాశ్చర్యజనకముగ శ్రీరామకృష్ణులు గంగానదీగర్భమునుండి తనవైపునకు వచ్చుచుండుట గాంచెను. ఆవ్యక్తి సమీపించి యాతనిచెవిలో నొకమంత్రము నుపదేశించెను. నతఁడాతనిపాదములకు మ్రొక్కి పాదధూళి స్వీకరింపగోరెను. కాని యాయద్భుతవ్యక్తి యంతలో అదృశ్యమాయెను.

మహాశయులు శ్రీరామకృష్ణుని ప్రథమమున చూచి ఇప్పటికి నాలుగు సంవత్సరములయ్యెను. శ్రీరామకృష్ణుడు తన యవతారమును చాలించు కాలము సమీపించుచుండెను. దక్షిణేశ్వరలక్ష్మి యస్తంగతమయ్యెను. దినాంతమున సూర్యుడు తన బంగరుకాంతి నింకను వెదజల్లుచుండినను రానున్నయంధకారమప్పుడే భక్తజనచిత్తములను నింపివేసెను. శ్రీరామకృష్ణుడు కలకత్తాకుత్తరమున నున్న "కాశీపురము" లో కాత్యాయనీరాణి యల్లుడను, గోపాలబాబు తోటయింటియందు వ్యాధిగ్రస్తుడైయుండెను. జగన్మాత తనప్రియపుత్రుని దనలో నైక్యము గావించుకొని మానవదృష్టిపథమునకు దూరము సేయబోవుచుండెనని మహాశయులు తెలిసికొనిరి. ఈసమయమున గురుసందర్శనమునకై యాతఁడు తరచు పోలేక యుండెను. "ఆయన బాధను నేరుగ చూచుటనుగూర్చి నేనేమని చెప్పగలను. ఆబాధను తలపోయుటకే నాహృదయము శకలమైపోవుచుండెను. ఆయన తనకు దానే యాబాధ తెచ్చిపెట్టుకొనియుండ నేనద్దానిని నివారింపలేక యుంటి ఆయన కడకు పోకూడదని నిశ్చయించుకొంటిని. ఎప్పుడో తప్ప తరచు అచ్చటికి పోలేకపోతిని" యని నాగమహాశయులు చెప్పినారు. శ్రీరామకృష్ణుని దేహ మగ్నివలె మండుచుండెను. ఒకనాడు మహా

శయులు ప్రక్కనుండుట జూచి "మహాశయా! ఇటురమ్ము. ఇటురమ్ము. నా ప్రక్కను గూర్చొనుము. నీ శీతలశరీరస్పర్శము వలన నా బాధ యుపశమించు" నని చాలసేపటివర కాతని యొడిలో గూర్చుండెను.

సురేశుడు కొట్టానుండి మరలి శ్రీరామకృష్ణులఁ జూడ వచ్చినప్పుడు "ఆవైద్యుడేడీ? అతడు మందునిచ్చునని యెఱుగుదును. అతని నొకసారి పిలిపింపుము" మనెను. అంత సురేశుడీ సంగతి నాగమహాశయుని కెఱుకపరచెను. మహాశయుడు లజ్జాబద్ధులై 'కాశీపురితోట' కు బోయెను. శ్రీరామకృష్ణు లీతనిఁ జూచి "వచ్చితివా? మంచిది. భిషగ్వరులు, ఆయుర్వేదభూషణులు, రోగమును కుదుర్పలేక వదలుకొనిరి. నీవేమైన మంత్రమువేసి ఈరోగమును మాన్పగలవా? నీవు కుదుర్పగలవేమో చూడు" మనెను. మహాశయులు తలవంచి కొంచెమాలోచించి, తన దృఢసంకల్పశక్తిచే నారోగమును తనలోనికి దీసికొన నిశ్చయించుకొనెను. అంత నుద్రేకముతో "ఆ! తెలిసికొంటిని. నీకృపామహిమచే సర్వమును తెలిసికొంటిని. ఈక్షణముననే ఈవ్యాధి కుదరగల" దని కేకవేయుచు శ్రీరామకృష్ణుని సమీపించుచు వచ్చెను. గురువు శిష్యుని మనోనిశ్చయము నెఱుఁగును. అతని యభిప్రాయమును తెలిసికొని శ్రీరామకృష్ణుఁడాతని నావలకి నెట్టివేసి "అది నీకు సాధ్యము. నీవు కుదుర్పగల"వనెను. గురువొక దురవగాహ సమస్య. శిష్యుడును అట్టి సమస్యయే.

శ్రీరామకృష్ణులు దేహమును చాలించుటకు అయిదారుదినములకు ముందు మహాశయులు ఆయనను చూడబోయెను. గదిలో నడుగు పెట్టుసమయమున శ్రీరామకృష్ణులు శిష్యులతో నిట్లనుచుండెను. "ఉసిరికకాయ ఎక్కడనైన దొరకునా? నాకన్నిటియందును అరుచి

యెక్కువయైనది. ఒకయుసిరికకాయ దినినచో యాయరుచి తగ్గనను కొనెదను." అచ్చటనున్న శిష్యులలో నొకరు "అయ్యా! యిది యుసిరిక కాయల కాలము కాదు" అనెను. నాగమహాశయులు "'ఉసిరిక' యనుమాట గురుముఖమునుండి వెలువడిన దనిన అది ఎప్పటనైన దొరకక తీరవలెను. ఎందువలన యన ఆయన ఏవస్తువు కోరునో యది తప్పక ఆతని కడకు వచ్చితీరును", అని యాలోచించెను. ఒకసారి శ్రీరామకృష్ణులద్భుతానందునితో నారింజపండు తినవలయునని యున్నదనెను. ఆసంగతి ఏమియు తెలియకపోయినను ఆదినముననే నాగమహాశయులు నారింజపండ్లను తీసుకొని వచ్చెను. అప్పుడాయన ఎంతయో ప్రీతిపూర్వకముగ నొకపండును తీసికొనెను. ఈ సంగతి జ్ఞాపకము తెచ్చుకొని మహాశయు లెవరితోడను చెప్పకయే ఉసిరిక కాయలను వెదకుచుపోయెను. రెండుదినములు గతించెను. కాని మహాశయులు మరలి రాలేదు. ఈరెండు దినములును ఉసిరికకాయలకై తోటవెంబడి తోటగా దిరుగుచుండెను. మూడవదినమున నుసిరిక కాయలతో శ్రీరామకృష్ణుల యెదుట నాతడు ప్రత్యక్షమయ్యెను. గురుదేవుని యానందమునకు మేరలేదు. బాలునివలె సంతోషపారవశ్యతఁ జెంది "ఆహా ఇట్టి కాయలీ యకాలమున నెట్లు సేగల్గితి "వని రామకృష్ణానందుని పిలిచి మహాశయులకు వంట సిద్ధము చేయుమనెను. మహాశయులు గురుదేవుని ప్రక్కగూర్చొని విసరుచుండెను. వంట సిద్ధమయ్యెను. గాని మహాశయులు భోజనమునకు లేవడాయెను. శ్రీ రామకృష్ణుని మాటపై లేచెను భోజనము ముందు గూర్చుండెను గాని భోజనమును ముట్టడు—"నేడేకాదశి—ఉపవాసదినము—అయినను శ్రీరామకృష్ణులు తనహస్తముతో ప్రసాదమిడిన స్వీకరింతును" అని మనసున ననుకొనెను. కాని వెల్లడిచేయలేదు. నాగమహాశయు లెంత

మంత్రోపదేశము - దక్షిణేశ్వరయాత్ర

నేపటికి భోజనము ముట్టకపోవుటచే శ్రీరామకృష్ణుల కీవిషయము నెఱింగించిరి. ఆయన ఆపదార్థములను తనవద్దకు గొనిరమ్మనిరి. రామకృష్ణానందు డట్లే వాని నాతని ముందిడెను. శ్రీరామకృష్ణు లందొక కొంతి నాలుకతో తీసికొని "ఇప్పు డాతని కిండు, స్వీకరించు" మనెను. రామకృష్ణానందుడా పదార్థముల నట్లే యాతనికిడెన. అంత మహాశయులు "ప్రసాదము మహాప్రసాదమని" యాపదార్థముల ముందు సాష్టాంగపడి యాకుతో సహితముగ భుజించెను. ఎన్నడైన నాతనికి ప్రసాద మిడుచో నందు లేశమైన విసర్జింపడు. మహాశయులయం దాదినమున దివ్యభావము కానుపించె నని రామకృష్ణానందు డనెను. ఇది జరిగిన తరువాత నాతని కెన్నడు నాకులలో ప్రసాద మిడువారు కారు. ఒకతరి ఎన్నడైన నాకులో వడ్డించినను, భోజనము ముగియు వరకు వేచియుండి యాకును లాగుకొనుటకు సిద్ధముగ నుండువారు. ఏదైన పండ్లిచ్చునప్పు డందలి గింజలను టెంక మున్నగునవి తీసి యిచ్చువారు.

౧౮౮౬ వ సం॥ ఆగష్టు ౧౬ తేదీని శ్రీరామకృష్ణులు మహాసమాధినొందిరి. ఈ సంగతి తెలిసి నాగమహాశయులు స్మశానవాటికకుఁ బోయి యాదినమంతయు నిరాహారుడై యుండెను. గురుదేవుని మహాసమాధియనంతరము శిష్యు లందరును వివేకానందస్వామిని చుట్టుముట్టిరి. వారి కాతడు మార్గదర్శకుఁడై మిత్రునివలె నుండెను. ఆతనికి నాగమహాశయు లాహారమును విసర్జించి, ముసుగిడుకొని తనయింట నొకమూల పరుండియున్నాడని తెలిసెను. అంత అఖండానంద తుర్యానంద స్వాములతో గూడ నాతఁడు మహాశయుల గృహమున కేగెను. ఎంతయో బ్రతిమాలిన తరువాత మహాశయులు మంచమునుండి లేచెను. వివేకానందు డంత "నీఇంటి కాతిథ్యమునకు వచ్చితి"

మనెను. మరుక్షణముననే మహాశయులు సరకులకొఱకు బజారునకు పోయెను. ఇంతలో ఈ మువ్వురతిథులును స్నానమాచరించి యొక మంచముపై గూర్చొని శ్రీరామకృష్ణులగూర్చి ప్రసంగించుకొనుచుండిరి. వంటకము సిద్ధమైన తరువాత ముగ్గురికిని వడ్డించెను. వివేకానందుని కోరికపై వేరొక యాకులోకూడ వడ్డించెను. పిమ్మట మువ్వురతిథులును మహాశయుల భుజింపుమని కోరిరి. కాని యాత డందుల కంగీకరింపలేదు. అంత వివేకానందుఁడు "మీరు తినుడు. అనంతర మాతఁడు భుజించు" ననెను. భోజనానంతరమున మరల ప్రార్థించిరి. అందులకు మహాశయు "అయ్యో! భగవంతుని యనుగ్రహము సంపాదింపజాలని ఈదేహమున కెట్లాహార మిడగల" ననెను. "అయ్యా! మీరు భుజింపనిచో మిమ్ము విడువజాల"మని వివేకానందు డనెను. ఎట్టకేల కెంతయో బలవంతముపై మహాశయులచే భుజింపించిరి.

శ్రీరామకృష్ణు లవతారమును చాలించినతరువాత నాయన శిష్యుఁడును, బాగ్‌బజారు వాసుడు నగు శ్రీయుత బలరామబోసు నాగమహాశయులను పూరిమం దుండమని కోరెను. "మెస్సెస్స పాలులు" నవద్వీపమునం దుండు మని బలవంతపెట్టిరి. ఇతరులును తిర్థ్థలను భరించు మనిరి. కాని మహాశయులు "నన్ను గురుదేవు లింటి వద్దనే యుండు నట్లాజ్ఞాపించిరి. ఆయన యాజ్ఞను జవదాటుటకు నా కెట్టి హక్కును లే"దని వారి కోరికలను నిరాకరించి గుర్వాజ్ఞా ప్రకారము తన యూరియందు తనఇంటివద్దనే యుండిపోయెను.

భాగ్యకులవాసులగు "కుండూ" కుటుంబమువారు ఆతనిని నెలకు యేబదిరూప్యముల వేతనముపై తమగృహవైద్యునిగ నుండుమనిరి. కాని మహాశయు లొప్పుకొనలేదు.

జన్మస్థాన నివాసము

నాగమహాశయుడు యిప్పుడు వృద్ధుఁడగు తండ్రికిఁ బరిచర్య సేయుచు నింటియందే యుండిపోయెను. దీనదయాళు వార్ధకతచే బలహీనుడై యుండెను. మహాశయుఁ డాతని పరిచర్య యందప్రమత్తుఁడై యాతని ఇష్టప్రకారము నడచుకొనుచు ప్రేమతో పుత్రవిధి నెఱవేర్చుచుండెను.

ఒకసారి దీనదయాళు విచారముతో "అందరును జగన్మాతను సేవించుచున్నారు. మన యార్థిక పరిస్థితి బాగుండుచో మనముగూడ నట్లు చేయవచ్చును. కాని మనమట్టి యదృష్టమును నోచుకొనలేదు. దుర్గాచరణుఁడు ధనము నార్జించుటను వదలివేసెను," అనెను. మహాశయు లిది విని యావత్సరమాది ప్రతిసంవత్సరమును దుర్గాపూజ, కాళీపూజ, జగద్ధాత్రిపూజ, మొదలగువానిని యొనర్చి తండ్రికొఱతను తీర్చి సంతోషపెట్టుచుండెను. తండ్రియెదుట నెప్పుడును భాగవతము మొదలగు పురాణములను పఠించుచు ప్రాపంచిక విషయములను దలపెట్టనీయక చూచుచుండెను. పుత్రుని ప్రయత్నములవలన తండ్రి మనస్సు మార్పుచెందెను. మహాశయులు ప్రతిసంవత్సరమును, శారదోత్సవమునకు వలయు సంబారములకై కలకత్తాకుఁ బోవును. అట్టి యొకానొక తరుణమున సురేశునితో "నా తండ్రి పూర్తిగ మార్పుజెందెను. ప్రాపంచిక విషయములపై తలంపులుఁ బోనీయక సర్వదా భగవన్నామమునే జపించుచున్నాడ"ని చెప్పెను.

తూర్పుబంగాళము తాంత్రికసాధనలకుఁ బ్రసిద్ధికెక్కినది. అచ్చట భక్తికంటె యద్భుతకార్యప్రదర్శనములకే విలువ యెక్కువ. వివేకానందస్వామి యొకసారి "తూర్పు బంగాళమున, వైష్ణవ, తాం

త్రిక సాధనల కెక్కుడు ప్రాముఖ్యతకలదు. వామాచార సాధనలకు ప్రసిద్ధికెక్కిన ఇట్టి వేరొక రాజధానిని నే నెరుగ”ననెను. శ్రీరామకృష్ణులొకసారి నాగమహాశయుని “మీరాజధానియందు గొప్పసాధువులుగలరా” యని ప్రశ్నింప నాతఁడు లేరని ప్రత్యుత్తర మిడెను. అతనికి గంగాతీరమున నే దక్క వేరొకచోట నిజమైన భక్తులు జన్మింపరని నమ్మిక. గొప్పవిద్వాంసులును, తార్కికులును ఉండిన ఉండవచ్చును.

మహాశయులు తన ఇంటియందు నివాసమేర్పరచుకొనుటకు బూర్వము, తూర్పుబంగాళములో గీర్తియుతులైన నతోబార్ విజయకృష్ణ గోస్వామి పూర్ణభక్తితత్త్వము నుపదేశించుచుండెను. విజయుడు శ్రీరామకృష్ణుని శిష్యుడని మహాశయులెఱుఁగుదురు. తన జన్మస్థానమునకు వచ్చిన తరువాత నతఁడొకసారి పనిమీద డెక్కాకుఁ బోవలసి వచ్చెను. ఆ తరుణమున విజయుని దర్శనమయ్యెను. విజయుడు మహాశయుల నెరుగడు. కాని తనదివ్యదృష్టిచే తనదరికి వచ్చియున్న యా యున్మత్తుఁడొక మహాపురుషుడై యుండవలెనని తెలిసికొనెను. సంభాషణవశమున మహాశయుడు శ్రీ రామకృష్ణుని శిష్యుడని తెలిసినంత విజయుని సంతసమునకు మేర లేకుండెను. అతనిని సమీపబంధువుని వలె నాలింగన మొనర్చుకొనెను. మహాశయులకుఁ గూడ విజయుని యందు భక్తిగౌరవము లుదయించెను. కాని యాతఁడు శ్రీరామకృష్ణునిచూచి యుండియు ఇంకను ఇతరసాధువుల చూడ నేల యాతురపడుచుండెనో యని యాశ్చర్యపడెను. విజయునివంటి వారలే అట్లు మోసపోవుచున్న నిక తదితరులగతి వేరుగఁ జెప్పవలయునా యని యనుకొనెను. గిరీశబాబొకతరి విజయుడు శ్రీరామకృష్ణుని సమక్షమున నిమీలిత నేత్రుడై ధ్యానమొనర్చుచుండుటనుజూచి “కం

జన్మస్థాన నివాసము

డ్లారఁజూచి యానందింపవలసిన మహాత్ముని ఎదుట గూర్చొని కండ్లు మూసికొను నవివేకి యెవఁడు" అని చెప్పెను. మహాశయులీ వాక్యమును విని గిరీశబాబు గొప్పవిద్యానిధియని పొగడుచు నాతనికి సాష్టాంగము నమస్కరించెను.

తూర్పు బంగాళమునఁ బారడి యను బ్రహ్మచారి కెవుఁడు పలుకుబడియుండెను. ఈయన శిష్యుఁడగు బ్రహ్మానంద భారతుని కోరికపై మహాశయులొకమారు బారడిని చూచుటకుఁ బోయెను. ఇంతకుఁ బూర్వము, బ్రహ్మానందుఁడు తారాకాంత గంగోపాధ్యాయుఁడని పిలువఁబడుచుండెను. తారాకాంతుఁడు న్యాయవాదవృత్తివలన చాల ధనము గడించెను. మొదటినుండియు ఈతనికి భగవత్ప్రార్థన యనినను సాధుజనసంసేవనమన్నను అమితానందము. ఆ కారణమున గొంతకాలమునకు తన వృత్తినుండి విరమించుకొని భగవద్ధ్యానమందే గడుపసాగెను. ఈతఁడు తరచుగ నాగమహాశయుల దర్శించుచు నాతనితో నొక్కొక్కప్పుడు నాలుగైదు దినములుండును. కొంతకాలమైన తరువాత ఈతఁడు బ్రహ్మచారివద్దకుఁ బోవుచు నాతని శిష్యునివలె మెలఁగ నారంభించెను. ఒకసారి తాను బ్రహ్మచారికి పూర్వజన్మమున గురువని చెప్పెను. ఒకనాడు తారాకాంతుడు మహాశయులఁజేరి, తనకుఁ బూర్వ జన్మస్థితి జ్ఞప్తియున్నదనియుఁ, దానిప్పుడు చంద్ర, సూర్య, బ్రహ్మాదిలోకముల కేగగలననియు, జాతిమతభేదములును, ఆచారములు, ధర్మాధర్మములు, అన్నియు నసత్యములనియు, జ్ఞానమొక్కటే సత్యమనియు ననెను. నాగమహాశయు లీమార్పును చూచి "గురు కటాక్షములేనియెడల నెంత గొప్ప సాధకుఁడైనను తప్పుదారిని పడిపోవును" అనెను.

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్ర

తారాకాంతుని బలవంతముమీద మహాశయులు బారడిని చూచుటకు బయలుదేరెను. సాధుసందర్శనమున కేగునప్పుడు రిక్త హస్తముతో పోగూడదని కొన్ని పండ్లను తీసికొనివెళ్లెను. బ్రహ్మచారి యందు దేనిని స్పృశింపక ప్రక్కనున్న యాబోతున కర్పించెను. మహాశయుని దీనదృష్టులను, కృశాంగమును, మలినవేషమును జూచి యధిక్షేపణాపూర్వకముగ నవ్వమొదలిడెను. కాని మహాశయులు తల వంచుకొని లెక్క సేయకుండెను ఆతని శాంతభావమును చూచి సహింప నేరక బ్రహ్మచారి శ్రీరామకృష్ణునియందు దోషమారోపించి దూషింప సాగెను నాగమహాశయులు దీనిని సహింపలేకపోయెను. నేత్రములు క్రోధపూరితములయ్యెను. శిరము పైకెత్తి చూడగనే కృష్ణపింగళవర్ణమున భీషణాకృతితో భైరవమూర్తి యొకడు బ్రహ్మచారి నణచి వేయుటకై యాతని యనుజ్ఞను కోరుచు నెదుట నుండుటను చూచెను. కాని యాక్షణముననే కోపము నణచుకొని తన తలను నేలపై గొట్టుకొనుచు "తండ్రి! నీ యాజ్ఞ నల్లంఘించి యన్యసాధు ధర్శనాభిలాషి నగుటవలన తగిన శాస్తియైనదని" యచ్చోటు వాసి "తండ్రీ! రామకృష్ణా!" యనుచు పర్వెత్తిపోయెను. గృహమునకేతెంచిన పిదప నిక ముందెట్టి సాధువులను దర్శింపఁగూడదనుకొనెను. ఇతరులెవరైన నొక సాధువును గూర్చి చెప్పునప్పుడు "మనసా! అట్టి అభిలాషలకు జిక్కకుము! ఒరుల గృహముల నెన్నడును మెట్టకు" మని తన్నుదా నాజ్ఞాపించుకొనును.

బ్రహ్మచారి శిష్యుడింకొకడు నాగమహాశయులకద్ద కప్పుడప్పుడు వచ్చుచుండెను. ఆతనికి పై సంగతి జరిగిన తరువాత నొక దినమున నాగమహాశయునితో "అయ్యా! నిన్ను మా గురువుగారొక వత్సరములో రక్తము గ్రక్కుకొని చత్తువని శపించి"రనెను. ఇది విని

మహాశయులు కడుపు చెక్కలగునట్లు నవ్వెను. ఇది జరిగి పూర్తిగనొక సంవత్సరము గడచెను, గాని శాపప్రభావమేమియు గన్పట్టలేదు. అందువలన నా శిష్యుడు గురువునందలి విశ్వాసము నశింప మహాశయుల యాంతరంగిక శిష్యుడయ్యెను. అప్పటినుండి భక్తిమార్గావలంబియై జీవితమందు గొప్ప మార్పుగలిగి ప్రవర్తించెను.

ప్రాపంచిక విషయములకై నాగమహాశయు లెన్నడును కలత పడియుండలేదు. కాని గురునిందయన నాతడు రౌద్రమూర్తియే. నారాయణగంజి నివాసియగు నొక సంపన్నుడు ఒకపరి శ్రీరామకృష్ణుని గూర్చి యసత్యకథనములఁ జెప్పి నిందింపసాగెను. అంత మహాశయు లాయన నట్టి సంభాషణను మానుమని వినయముతో ప్రార్థించెను. ఈతడు ప్రార్థించుకొలదియు నా సంపన్నుడించుక వచ్చినట్లు దూషింప నారంభించెను. మహాశయుడు "గురుదేవునిపై ఇట్టి కల్ల నిందలను మోపకుము" అని ఎంతయో చెప్పెను. కాని యాతడు మానలేదు. మహాశయులు సహింపలేక "నాయింటినుండి యావలికిఁ బొమ్ము. లేకపోయిన తగిన శాస్తి ననుభవింతు"వనెను. దీనిని కూడ నాతడు లెక్కసేయలేదు. మహాశయుని శాంతమంతయు నశించెను. రక్తారుణితలోచనుడై తనువు కంపమొంద, నాతని చెప్పుదెబ్బలతో సన్మానించుచు "నీచుడా! నా ఇంటినుండి తత్క్షణమే వెడలిపొమ్ము. నాగృహమునందే నా గురుదేవునిపై నింద నారోపింప సాహసించెదవా" అనెను. ఆతడు దియోబాగునందు పలుకుబడి కలవాడు. అట్లు దెబ్బలు తిని పోవుచు అతడు "నీవెట్టి సాధువో చూచెదగాక! దీనికి తగిన ప్రతిఫలము ననుభవింపక తప్పదు" అనెను. నాగమహాశయులా బెదరింపులను లెక్కసేయక "తండ్రీ! నిన్ను దూషించువాగల నా గృహమున కెందులకుఁ బంపెద"వని శ్రీరామకృష్ణునితో మొరపెట్టుకొనెను.

తరువాత కొంతసేపటిలోనే శాంతించెను. కొలది దినముల కావల నాసంపన్నుఁడును మరల నేతెంచి క్షమింపుమని యాతని వేడుకొనెను. నాగమహాశయులాతని లేవనెత్తి ప్రేమపూర్వకముగఁ నాదరించి సంతోషపరచెను. తరువాత నాతఁడింటికి మరలిపోవునప్పుడు తాను కూడ కొంత దూరముపోయి దిగవిడచి వచ్చెను. సాధు పాదుకా ఘాతమువలన సంపన్నునకు మనసు మారి మంచివాఁడయ్యెను. గిరీశ బాబునకీ సంగతి తెలిసి నాగమహాశయులు కలకత్తాకుఁ బోయినప్పుడు "నీవు చెప్పులను తొడుగవుకదా! ఆతని కొట్టుటకు చెప్పు లెచ్చటి నుండి తెచ్చితి"వనెను. అందులకు మహాశయులు "ఆతని చెప్పులతోనే యాతని కొట్టితినని చెప్పి "జయ శ్రీ రామకృష్ణ జయ శ్రీరామకృష్ణ" యనుచు నాతనికి నమస్కరించెను. గిరీశబాబతనితో "నీవు త్రాచు పామువంటివాఁడవు సుమా!" యనెను.

ఒకానొక దినమున నాగమహాశయులు బేలూరు మఠమున కేగుచుండెను. మార్గమధ్యమున నావపై గంగానదిని దాటవలసివచ్చెను. ఆ నావలో పలు స్వభావములు గలవారుండిరి. నాగమహాశయులొక మూలఁ గూర్చుండెను. నావ కొంత దవ్వేగుసరికి బేలూరు మఠము దృగ్గోచరమయ్యెను. అంత మహాశయులు చేతుల జోడించి నమస్కరించెను. అతఁడు నమస్కరించుట జూచి యందొకఁడు ఆ మఠమందలి వారి యాచారవ్యవహారములను ఖండించుచు దూషింపసాగెను. మరియిద్దరు ముగ్గురాతనితో తాళము వేయ మొదలిడిరి. మహాశయుఁడు దీనిని సహింపలేక ఉద్రేకపూరితుఁడై "విషయాలోలురగు మీరేమెరుగుదురు? మీ కా మఠమునుగూర్చి యేమి తెలియును? ఛీ! అందరి సన్యాసులను దూషించిన మీ సిగ్గులేని నాల్కలను ఎవరేమి చెప్పఁగలరు," యనెను. ఆతని భీషణవాక్యముల కా బాటసారులు భయ

పడి నావికునిఁ ద్వరలో దరిఁజేర్చుమనిరి. నావ దరిజేరినంతనే ఆసా ధుల దూషించినందులకు దమ్ముతడు శపించునేమో యని వారు పర్వెత్తిపోగిరి. ఈ సంగతి వివేకానందుడెఱిగి "ఒక్కొక్క సమయ మున నిట్లు బుసపెట్టవలసి యుండును" అనెను.

నాగమహాశయుల గృహమున కొకనాడొక సన్న్యాసివచ్చెను. ఆతని త్యాగము వస్త్రములయందును, వైరాగ్య మమాయకులను గృహ స్థులయెడలను మాత్రమే దీపించును. మరియు గంజాయి యన్న నతని కతి ప్రియము. గంజాయి త్రాగుటలో నాతనిని మించిన వాడింకొక డుండడు.

ఆతఁడు దిగంబరియై వచ్చుచు దూరమునుండియే మహాశయుని జూచి కొంచె మనుమానించి వస్త్రములను ధరించి మహాశయుని జూడ వచ్చెను. అనంతరము మహాశయులంజేరి అణిమాద్యష్టసిద్ధులను గూర్చి ప్రసంగింప మొదలిడెను. అంత మహాశయులు "ఈ భావములన్నియు నతి హేయములు. శ్రద్ధాభక్తిలాభమునకు శత్రువు"లనెను. సన్న్యాసి యా మాటలను చెవినిబెట్టక "నేను మలము తిని యేను దినములుండ గల"ననెను.

నాగ:—దానివలని గొప్పతనమేమి? కుక్కలు జీవితమంతయు మలమును తినియే గడపును.

సన్న్యా:—నేను దిగంబరినై జీవితమంతయు గడుపగలను.

నాగ:—పిచ్చివాడా! పశువులు పక్షులు మొదలగు జంతుజాల మంతయు వస్త్రములు లేకయే తిరుగును. నీ గొప్పతనమేమి?

సన్న్యా:—నేను తరులతాదుల క్రిందనే జీవితము గడుపగలను.

నాగ:— ఇందు మాత్రమున్న ఘనతయేమి? జంతువు లెన్ని వృక్షాదులనే యాశ్రయించి బ్రతికియుంటలేదు?

సన్యాసి యిట్టి విధములను సిద్ధులనెన్నో చెప్పెను. అంత మహాశయుని ప్రియభక్తుడగు నతోబారు ఇక నాతనికి అవకాశ మీయక సన్యాసికి సంహారముద్రను చూపెను. సిద్ధుల విషయమై మహాశయులు "సిద్ధులను పొందుట యోగాదారు నియమముల కార్యము. ఐదు నియమములు ప్రయత్నించుచో ఎట్టి సిద్ధినైనం బొందవచ్చు"ననును.

ఇట్టి సన్యాసులు అనేకులు బంగాళమున గాన్పింతురు. అచ్చట వారికి గౌరవము హెచ్చు. నాగమహాశయుని దీనభావములను మలినవేషమును, విశేషముగా నాతడితరులవలె సాంసారికి కృత్యములను చేయుట మొదలగునవి చూచి మొట్టమొదట నాతని నెవరును మహాపురుషుడని తెలిసికొన జాలకుందురు. కాని యొక్క మారాతనితో మాటలాడిన "ఈ దీన హీనగృహమేధి మనుష్యరూపమున నున్న దేవతయే" యని తెలిసికొందురు.

ఒకపరి దీనబంధు ముఖోపాధ్యాయుడను నాతడు డయోబాగునకు వచ్చెను. దీనబంధు మంచి గాయకుడు. మహాశయుండాతని "ప్రసాద పదావళిని" వినెను. అతనికి దానిని ఎన్నిమారులు వినినను తనివితీరకుండెను. అంత దీనబంధు "ఇట్టి మహాపురుషుని నా జీవితమున నింకొకనిని చూచియుండలే"దనెను. ఇతిహాసములలో విదురుడు మొదలగు వారలగూర్చి వినిచో మహాశయులు వారికెంతమాత్రము తీసిపోడని తెలియగును. విదురుడే మరల ఈ మహాశయరూపమున యవతరించెనా యని యనుకొందుము.

శరచ్చంద్ర చక్రవర్తి (మహాశయుని శిష్యుడు—ఆయన జీవితమును మొదట వంగభాషలో రచించిన భక్తుడు) మామగారగు

జన్మస్థాన నివాసము

శ్రీయుత మదనమోహన బారుదీ యను నాతడు, తనయల్లుడు (శరచ్చంద్రచక్రవర్తి) నాగమహాశయుని సంసర్గమువలన చదువుకొనుటమాని సంసార ధర్మములయెడ విరక్తిగలిగియుండెనని లోకులవల్ల వినెను. నిజమగుసంగతి యేదో తెలిసికొనవలెనని మదను డొకనాడు దియోభాగునకు బోయెను. నాగమహాశయుని చూడగనే యాతని యుద్వేగమంతయు దూరమయ్యెను. మహాశయుని ఆదరణచేతను ఆతని యమాయిక వ్యవహారముచేతను, అతిథి సత్కారముచేతను సంప్రీతుడై తన అల్లుడు అట్టి మహాపురుషునిసద్దకు వచ్చుచు పోవుచు నాతనితో పరిచయము కలిగియున్నచో అదృష్టవంతుడేయని అనుకొనెను.

"ప్రఫుల్ల కుసుమముల వెదకుచు తుమ్మెదలు తమంతతామే వచ్చును. దివ్యజ్ఞాన ప్రసారముచే వికసితమైన హృదయము తన తేజస్సును నలుప్రక్కలకు బ్రసరింపజేయక మానదు. అప్పుడు నిజముగు భిక్షులు, సత్యాన్వేషణా పరాయణులును, తమకు దామే యాతనిం జుట్టుముట్టుదురు" అను శ్రీ రామకృష్ణుని మహావాక్యము మహాశయునియందు సార్థకమయ్యెను. ఇప్పుడు సత్యాన్వేషకులు, జ్ఞానసంపాదనోత్కంఠులు, వివిధ దేశములనుండి ఈతనిం జేరుచుండిరి. ఈతని కీర్తికాంత నల్దిక్కులకు వ్యాపించెను. నాగమహాశయులు భార్యనుజూచి "శ్రీ రామకృష్ణుని తుదివాక్యములీనాటి కనుభవసిద్ధములయ్యెను. ఇచ్చటకి వచ్చువారందరును ఈశ్వరాన్వేషకులన్న మాట సత్యము. ఇట్లని యాయన నాతో చెప్పిరి. అందువలన నందరిని జాగ్రతతోను భక్తిశ్రద్ధలతోను ఉపచరింపుము. నిన్ను జగదీశ్వరు డాశీర్వదించు" ననెను.

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్ర

నాగమహాశయుఁడు తన దర్శనాభిలాషులై తన ఇంటి కెవ్వరరుదెంచినను. స్వల్పాహారమైన గ్రహింపకుండ బోనిచ్చువాడుకాడు. దూరమునుండి వచ్చువారలకు శయ్యల నమర్చును. గృహములోని కొంతభాగమున ఇట్టి యాగంతుకుల యుపచారమునకని ప్రత్యేకించి యుంచెను. అందు వారెన్నాళ్లైన నుండవచ్చు. కుటుంబమందలి ప్రతివ్యక్తియు నతిథిసత్కారమున నమితానందము నొందుదురు. దీనదయాళ్ ఒకసారి "గృహస్థుని పంక్తినుండి అతిథి యాహారము బలవంతముగ లాగుకొనినను యజమాని స్వర్గమున కేగును. ఈ దరిద్రుని గృహమున కిందరతిథులేతెంచి భుజించుట నా పూర్వజన్మ పుణ్యమే" యనెను. అందులకు మహాశయులు "ఇది యంతయు భగవానుని విచిత్ర లీలానటన. ఆయనయే అనేక రూపములతో మనలను తరింపఁజేయుటకు వచ్చుచున్నా"డనెను. నిజముగ నాతడతిథులను భగవన్మూర్తులుగ దర్శించుచున్నాడు.

ఒకదినమున నాగమహాశయులు శూలనొప్పిచే బాధపడుచుండెను. బాధ దుర్భరముగా నుండెను. ఒక్కొక్కప్పుడు స్మృతి తప్పిపోవుచుండెను. అట్టి సమయమున నీతని కెరుకపరుపకయే పదుగురు భోజనమునకు వచ్చిరి. ఇంట పిడికెడు బియ్యమైనను లేదు. ఏమి చేయగలడు? ఆ యవస్థయందే, వేదన ననుభవించుచు, అంగడికి బోయెను. తనపరిచిత నౌకరుల మోయనీయడు గాన, బియ్యపు మూటను భుజముపై పైకొని వచ్చుచుండెను. బాధమిక్కుటము కాగా నతఁడు వచ్చుచువచ్చుచు క్రిందబడిపోయెను. కాని యతడు తనబాధకై ఇసుమంతయు విచారింపక "తండ్రీ! రామకృష్ణా! ఈనా కర్మమేమి? ఇల్లేల తెచ్చిపెట్టితివి? నారాయణస్వరూపులింటి కాతిథ్యమునకై యరుదెంచియున్నారే! వారిని సత్కరించుట కాలస్యమగు

చున్నది. ఈ దినము సాధు సంసేవనమునకీ యస్థిపంజరమేల యడ్డు తగులుచున్నది" అని అశ్రువులురాల ప్రార్థించెను. తరువాత కొంత సేపటికి బాధ యుపశమిల్ల ఇంటికేతెంచి యా సాధుమూర్తులకు సాగిలపడి తన యాలస్యమునకు మన్నింపుమని వేడుకొనెను.

వర్షాకాలమున నొక దినమున వాన బోరున వర్షించుచుండ నిర్వురతిథులేతెంచిరి. ప్రచండమారుత మప్రతిహతముగ వీచుచుండెను. ఆ రాత్రివర్షము మింటికి మంటికి నేకధారయై వర్షించుచుండెను. నాగమహాశయులకు నాల్గుగదులు మాత్రమే కలవు. ఆనాల్గింటియందును మూడు జీర్ణములై వర్షాతపముల నాపలేకయుండెను. కప్పుయొక్క సహస్రరంధ్రములనుండి సహస్రధారలుగ వర్షము కురియుచుండెను. నాల్గవ గదిమాత్రము మంచి స్థితియందుండెను. అందు నాగమహాశయులు పరుండును. ఇప్పుడతిథులు భోజనములు గావించిరి. కాని యారేయి గడుపుటెట్లు? నాగమహాశయులు భార్యను బిలచి "చూడుము. ఇట్టి సమయమున నతిథులేతెంచుట భగవంతుని యాశీర్వాదము. మనమెంతయు నదృష్టవంతులము. ఈ రాత్రికెట్లో నెగడిదరిని గూర్చొని భగవన్నామము జపించుచు గడపుదమని" యయ్యతిథులనందు శయనింపజేసి, తామారాత్రి యంతయు నెగడి దరిని ధ్యాన నిమగ్నులై గడపిరి.

నాగమహాశయునకు మాసవేతనముగాని నియమిత వ్యయముగాని లేదు. ఉప్పుకొఠారుపై వచ్చులాభములు మాటిమాటికి మారుచుండెను. ఇంటికి లెక్కలేక యతిథులేతెంచుచుండిరి. అందువలన తరచు ఆహారపదార్థములయిపోవుచుండెడివి. కాని ఎప్పుడే పదార్థములు కావలసినను తన్నెరిగియున్న నారాయణగంజి

షాహుకార్లవద్ద నప్పుగొని సాలుసరికి కలకత్తానుండి రంజితుహ్రా పంపు ధనముతో నాయప్పులను దీర్చువాఁడు.

పట్టణములలో నున్న భాగ్యవంతులు గూడ దుకాణదార్ల నుండి, మహాశయులు పొందునంత గౌరవమునుఁ బొందఁజాలకుండిరి. తక్కినవారందరు కొను వెలకే నాగమహాశయు లెక్కువ సరుకులను పొందువాఁడు. కాని యీ సంగతి తెలిసినప్పుడు వారికిచ్చునన్ని సరకులనే తనకుఁ గూడ నిమ్మని నిరోధించును. ఒక కొట్టుమీఁదనే అదుకాణదారడుగు వెలకే, కొనుట ఈతనికి స్వాభావికమై యుండెను. అయినను ఎన్నడును మోసపోలేదు. "ఎవడు సత్యమునే నమ్మి దానినే పరమావధిగఁ జూచునో యాతడు మోసపోక సర్వదా రక్షింపఁబడుచుండును. అతఁడే భగవత్కృపా సముద్రమునం దోగులాడుచుండు" నని యతఁడు చెప్పుట వాడుక.

ఆతని సాధుస్వభావ మెల్లరెరిగినదే యగుటచే నాతని మోసపుచ్చ సాహసింపలేకపోవువారు. అదియుఁగాక నాతనియందు, పరులగౌరవమును పొందనగు శక్తి మూర్తీభవించియుండెను. ఒకసారి నాగమహాశయులొక శ్రొత్త దుకాణమువద్దకుఁ బోవుట తటస్థించెను. మొదటిదినములలో నెక్కువధరలు చెప్పినను, తరువాత తరువాత, మహాశయులు బేరమాడకుండుటయు నడిగినధన మిచ్చుటయుఁ జూచి చెవిలో రహస్యముగ తగ్గుధరలఁ జెప్పుటగాని చెట్టింపుసరకుల నిచ్చుటగాని చేయువాడు. వర్తకులు అతడు తమవద్ద ముందు కొనినచో తమకు ఎక్కుడు లాభమువచ్చునని యొకనమ్మిక గల్గియుండిరి. అందువలన నాతఁడు బజారునకుఁ బోవునప్పుడెల్ల వర్తకులు తమవద్ద ముందు కొనుడని ప్రతివారును బ్రతిమాలువారు.

జన్మస్థాన నివాసము

నాగమహాశయుని కొక్కొకసారి అతిథులకు భోజనవసతి సదుపాయములం జేయుటయేగాక దారి బత్తెములకుం గూడ నిచ్చుట తటస్థించెడిది. ఒకమారొక యతిథి అతనిం జూచుటకు వచ్చి జబ్బుపడెను. మహాశయుం డతనికిం బరిచర్య సలిపి నెమ్మదిగనున్న తరువాత దారి బత్తెములకుం గొంత సొమ్మిచ్చి యింటికిం బంపెను. ఇట్టివి తరచు జరుగుచుండెడివి.

పరిమితి లేని యీ వ్యయమువలన మహాశయు లప్పుల పాలయ్యెను అతని భక్తులలో కొంతమంది ఋణములను దీర్చ నుద్యుక్తులైరి. కాని యాతఁడా యుపకారమునెంతయు నిరసించెను. వివేకానందు లమెరికా దేశమునుండి మరలివచ్చిన తరువాత మహాశయులు ఋణగ్రస్తుఁ డైనట్లు దెలిసికొని ఋణవిముక్తునిం జేయ సాహసించెను. కాని మహాశయులు నెమ్మదిగ "సన్యాసులు నాకిడు ఆశీర్వచనములే జాలును. కష్టమో సుఖమో నా కుటుంబ మెప్పుడును 'పాల'లిచ్చు వేతనము మీదనే జీవింపవలె" ననెను. ఇక నాతని భక్తులొకరైన ఋణము మాట జ్ఞాపకము చేసినచో "నయ్యా! జీవనాధార మేమియు గనపడకున్న నుపవాసమైన నుందుము గాని గృహస్థాశ్రమధర్మము మాత్రము విడువజాలను. నా దుఃఖస్థితిగూర్చి మీరెవ్వరును కష్టపడవలదని ప్రార్థించుచున్నాను. భగవానులగు శ్రీ రామకృష్ణులు తమకేది యుచిత మనితోచునో యదియే చేయుగాక" యని యనును.

తనపనులకు లేదు సరికదా గృహకార్యముల నిమిత్తమైనను సేవకుల నియమించుట కాతఁడెంతయు సంతాపపడును. తనయింటి మరమ్మతులకై తాపీవాండ్రు మొదలగు సేవకులు పనిచేయుచో సహింపజాలఁడు. అందువలన మహాశయుం డింట లేనప్పుడు అతని భార్య ఇంటి కప్పు వేయుట మొదలగు మరమ్మతులను చేయించెడిది.

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్ర

ఒక తరి నాగమహాశయులు చాలకాలమువరకు నింటనుండుట తటస్థించెను. అందువలన ఇల్లు బాగుచేయించుట కవకాశము లేకుండెను. గృహము నివాసానర్హమై యుండెను. ఇక చేయునది లేక శరత్కుమారి కూలివాండ్ర నింటికప్పును తిరుగనేయుటకుఁ బిలిపించెను. కూలివాండ్రింట ప్రవేశింపఁగనే మహాశయులొక మహాపాప కార్యము తన యింటఁ జరుగనున్నట్లు, పిచ్చియెత్తి కేకలిడెను. మొదట నొక చిలుము తయారుచేసి తాపీమేస్త్రి కిచ్చెను. పిమ్మట నాతడింటి పైకెక్కి యసూర్యాతపమునఁ బనిచేయుచుండఁ జూచి సహింపలేక నాతనిని దిగిరమ్మని దీనముగఁ బ్రతిమాలుకొనెను. అయిన నాతడు తన పని సాగించుటఁ జూచి పట్టజాలక తండ్రి! నన్నీ దుర్భరమగు గృహస్థాశ్రమ మెందులకు స్వీకరింపు మంటివి? అయ్యో నా సుఖము కొరకన్యులు బాధపడుట చూడవలసివచ్చె గదా! పాప మువశమించుగాత! గార్హస్థ్య మనుగంటు గాక" యని నెత్తిమోదుకొనసాగెను. ఈతని వ్యాకులత్వముజూచి యాతడు దిగివచ్చెను. మహాశయుఁ తక్షణమే వానికద్దకుఁ బర్వెత్తి వేరొక చిలుమునిచ్చి విశ్వాసపాత్రుఁడగు సేవకునివలె విసరనారంభించెను. పిమ్మట నాతనికా దినవేతనమిచ్చి యింటికిఁ బంపెను.

నాగమహాశయు లెన్నఁడైన పడవలో ప్రయాణముఁజేయవలసి వచ్చినప్పుడు, పడవవానిని పడవను త్రోయనీకఁ దానే తెడ్డువేయును. ఒక్కొకసారి తక్కుఁగల బాటసార్లాతని నిరోధించువారు. కానివారి మాట లెన్నడును లెక్కకు రాలేదు. అందువలననే కొందరు పడవ వాండ్రు తమ నావలలో నాతని నెక్కించుకొనువారుకారు. అట్టి మహాపురుషుడు తామందుండగ నావత్రోయుట పాపమని తలచువారు. వర్షాకాలమునందు దెయోభాగంతయు నీటితో మునిగియుండును. పడవ లేక ఎవ్వరును ఇంటినుండి కదలలేక పోవువారు. అందుచే ప్రతి

జన్మస్థాన నివాసము

గృహమునకు ఒకనావయుండుట తప్పనిసరి యైయుండెను. కాని మహాశయులకు స్వంతపడవ లేదు. దానఁనాతడు వర్షాకాలములో చాలభాగము ఇంటనే గడుపవలసివచ్చెడిది. అయినను ఒకొక్కప్పుడు పడవ యత్యావశ్యక మనిపించును. అందువలన ముందేగృహ కృత్యములకు వలయు సంభారములను సిద్ధముచేయవలసివచ్చెడిది. ఈపని యాతనిభార్యయే యిరుగుపొరుగువారి సహాయమున నిర్వర్తించెడిది.

ప్రతి సాయంతనమును నాగమహాశయులు శ్రీరామకృష్ణ విగ్రహమునకు ధూపదీప నైవేద్యాదుల నర్పించును. భక్తులు వచ్చినదనమున ఆతనియింట భగవత్సంకీర్తనము జరిగెడిది కాని ఆం దాతడెన్నడును పాల్గొనక ఒకమూలగూర్చొని చిలుములను తయారుచేయును. అయినను ఆతని సమక్షమున నొక అసహజమగు ఆవేశమా సంకీర్తనయం దుద్భవించెడిది. సంకీర్తనానంతరము నాతఁడు శ్రీరామకృష్ణనామము నుచ్చైస్స్వరమున జపించుచు చైతన్యవిహీనుడై యుండును.

ఒక్క సంకీర్తనయందేగాక తక్కిన ప్రార్థనా సమయము లందుగూడ మహాశయుని గృహమున భక్తి మూర్తీభవించియుండును. ఒకమా రాతనిగృహమునకు శరచ్చంద్ర చక్రవర్తివచ్చెను. మహాశయుని కోరికపై ఆతడు ఉపనిషత్తులలో కొన్నిటఁ గొంతభాగము చదివి వివిధార్థములతోపాటు ఒక్కింత తన యభిప్రాయమును జతచేయుచు బోధచేసెను. అంతయు సాంతముగ విని "అన్ని యర్థములును సత్యములే. వేర్వేరాచార్యులు వేర్వేరు మతస్థులకు తగునట్లు చెప్పిరి. ఇది వ్యాఖ్యాతల తప్పుకాదు" అనుచు, శ్రీరామకృష్ణుడు ఊసరివిల్లి సామ్యము నుదాహరించుచుచెప్పిన మహావాక్యమును నుడివి, "ఈశ్వరుఁ

డనేకరూపములతో విరాజిల్లును. ఎవ రెట్లాతని నర్థము చేసికొందురో, అట్లు వారు వర్ణింతురు. ఎవరును ఆతనినిజస్వరూప మిట్టిదని నిర్ణయింపలే" రనెను. తదనంతరము సరస్వతీవిగ్రహమును జూపుచు "ఇయ్యదియు సత్యమే. ఎందరెందరీ దేవులను దేవతలనుకొల్చి తరింపలేదు!" అనుచు ఆవిగ్రహమునకుం దనేకమారులు సాగిలపడెను. ఆ సమయమున నర్చకుం డతివైభవముతో పూజలొనర్చుచుండ నాప్రదేశమంతయు స్వర్గధామ మట్లుండెను. మహాశయు లంతలేచి "తల్లి విద్యాస్వరూపిణి. ఆమె కృపాలేశము లేకున్నచో జ్ఞానోపలబ్ధి కాజాలదు. జనని నన్నుజ్ఞానునిగ నొనర్చి ఈ శూద్రకుటుంబమున జన్మింపజేసినది. నేను శాస్త్రపఠనమున కనర్హుడను. అందువలన మీరా శాస్త్రార్థములను వినిపించి నన్ను కృతార్థుని జేయుం"డనెను. ఈతని దృఢభక్తినిచూచి "ఈతడు భక్తిసాధనయందు చాల నభివృద్ధిపొంది కొన్ని దివ్యదర్శనములం గనియుండవచ్చును. కాని బ్రహ్మజ్ఞానమును ఇంకను బొందియున్నట్లు లేదు"అని చింతించుచుండ మహాశయు లచ్చోటు పాసివెళ్లెను. కొంతసేపటికా భక్తుడు మహాశయుని వెదకుచు ఇంటివెలుపలకురాగా, ఆతడొక సాలవృక్షముక్రింద పడియుండెను. భక్తుం డాతనిప్రక్కకేగి నిల్చొనెను. అంత మహాశయులు "అమ్మృణ్మయ విగ్రహరూపముననున్న నాతల్లి ప్రేమమయి. ఆద్యంతరహితయగు సచ్చిదానంద స్వరూపిణి. నాజనని జ్ఞానసముద్రము" అనుచు సమాధిస్థితిని బొందెను. ఒక యరగంటకాలము వరకట్లే చైతన్యరహితుడై పడియుండెను.

ఇట్టి సమాధులలో అతడు తరచు గంటలతరబడి పడియుండును. కొన్నిదినముల ప్రాణాపాయము తటస్థించునేమోయని శంకించువరకు స్మృతివిహీనుడై యుండువాడు.

నాగమహాశయుని గార్హస్థ్య జీవితము

నాగమహాశయు లెప్పుడు కలకత్తాకుఁ బోయినను మున్ముందు కాళీఘట్టములోనున్న దేవిని సేవించి యటనుండి గిరీశబాబుదర్శనము నకై పోవువాఁడు. "ఎవరైన గిరీశునితో నిముసమాత్రము కాలము గడపినను ప్రాపంచికవిషయవిముక్తుఁ డగును. గిరీశునకు మనుజుని చూడఁగనే యాతనిస్వభావమును గుర్తించు అంతరదృష్టికలదు. ఆదృష్టి ప్రభావముచేతనే ఆతఁడు శ్రీరామకృష్ణుని యవతారపురుషునిగ గ్రహింపగలిగె"నని మహాశయులు గిరీశునిగూర్చి యనువాఁడు. మరియు గిరీశనామోచ్చారణ మాత్రమున వంగి నమస్కరించును. శ్రీరామకృష్ణ శిష్యవర్గములో గిరీశుఁడు కాంతుఁడు ప్రథమస్థానము నొసంగెను.

ఒకపరి మహాశయులు దుర్గాపూజకు వలయు సంభారములను గొనితెచ్చుటకు కలకత్తాకు పోయెను. అప్పుడు గిరీశబాబు గృహ మునకేగెను. ఇతని రాకడజూచి గిరీశుఁడు మేడదిగివచ్చి ఆదరముతో పైకిఁ గొంపోయి, యొక కుర్చీపైఁ గూర్చుండుమనెను. కాని మహా శయులు క్రిందకూర్చొనెను. ఇదిచూచి యచ్చటనున్న యొకరు పైన కూర్చుండుమని నిర్బంధించెను. అంత గిరీశుఁడు "అయ్యా! ఆయ నను నిర్బధింపకుము. ఆయనను యిచ్చవచ్చినచోటనే కూర్చుండ నిండు" అనెను. అంతట మహాశయులను శ్రీరామకృష్ణునిగూర్చి యేదేని చెప్పుమని కోరెను. అందులకాతఁ "డయ్యా! ఆమహాత్ముని తెలిసికొనుటకు నేనెంతటివాఁడను! నేను వట్టిమూఢుఁడను. ఆయన నెట్లు తెలిసికొందును. మీరు నాపై దయగొని నన్నాయన పాద పద్మములపై యూరని భక్తికలిగియుండునట్లాశీర్వదింపు"డనెను. ఇట్లు చెప్పునప్పుడు మహాశయుని ముఖముపై శాంతమును నమ్రతయు తాం

డవించుచుండెను. అంత గిరీశుడు "అందువలననే శ్రీరామకృష్ణుని
నే నవతారమూర్తిగ నెన్నుట. ఏ మహాత్ముని కృపాకటాక్షమున ఇట్టి
మార్పు,- ఒకమనుష్యమాత్రుని మనస్సున నిట్టిస్థితి,- కలిగెనో ఆతఁ
డొక యవతారమూర్తి కాకయుండుట ఎట్లగును? ఆతఁడు మానవా
తీతుఁడనుటకు సందియములేద"నెను. ఇంకను కొంతకాలము శ్రీరా
మకృష్ణునిగూర్చి ప్రసంగించినతరువాత మహాశయు లాదినమునకు
సెలవుగైకొని వెడలిపోయెను.

శ్రీరామకృష్ణుని సన్న్యాస శిష్యులు అప్పుడు ఆలంబజార్
మఠములో నుండిరి. ఒక యాదివారమున మహాశయులా సన్న్యాసుల
దర్శనార్థమై యచ్చోటికి బోయెను. అచ్చట చాలమందియుండిరి.
మహాశయులు వారలందరకును సాష్టాంగముగ నమస్కరించెను.
ఆతని రాకడ మఠమున నతిశయ సంతోషకారణమయ్యెను. ఆనం
దము తాండవించెను. సోదరశిష్యులు మహాశయుని కుశలమడిగిరి.
ఆసమయమున రామకృష్ణానందస్వామి సాయంకాల పూజనొనర్చు
చుండెను. మహాశయుఁడుకూడ అందు పాల్గొనెను. అంత నందరును
భోజనమునకై కూర్చొనిరి. మహాశయునికొక పళ్లెరమున వడ్డించిరి.
ప్రసాదమును గొనినతరువాత వా రెంతవేడుకొనినను వినక తానే
స్వయముగా ఆ పళ్లెరమును శుభ్రపరచెను. అనంతరము వారందర
కును చిలుములను తయారుచేసెను. ఆ రాత్రి యుక్కపోతగ నుం
టచే, జపధ్యాన నిమగ్నుడై యా మఠమునందే గడపెను.

శ్రీరామకృష్ణ నిర్యాణానంతరము మహాశయులు చాలకాలము
వరకు దక్షిణేశ్వరమునకు బోలేదు. ఒకనాడు సురేశుడును చక్ర
వర్తియును నింకొక భక్తుడును వెంటరాఁ దక్షిణేశ్వరమునకై బయల్వె
డలెను. మార్గమధ్యమున శ్రీరామకృష్ణుఁడు తన యంత్యదివసముల

గడపిన కాశీపురోద్యాన గృహముగలదు. సురేశుడా ఇంటిని చక్రవర్తికి చూపుచుండెను. కాశీపుర నామము విన్నంతమాత్రముననే మహాశయుల యొడలు కంపింపసాగెను. ఆ గృహమువైపు కూడ జూడలేకపోయెను. ముఖము కళావిహీనమై యెండిపోయినట్లయ్యెను. శ్రీరామకృష్ణుని నిర్యాణవిషయమై చర్చవచ్చినప్పుడెల్ల మహాశయులు "ఇదియంతయు ఆమహాత్ముని లీలామాత్రమే. ప్రాణికోటికి ముక్తి నిచ్చుటకై ఆ వ్యాధిని తనకు తానే తెచ్చిపెట్టుకొనె"నను. ఈ దారిని నడచుట కాతని కిది రెండవతూరి.

మిత్రులు ముగ్గురును దక్షిణేశ్వరము చేరిరి. ద్వారప్రాంగణమున మహాశయులు సాగిలపడెను. చక్రవర్తి యిదివరలో ఈ ప్రదేశమును చూచియెరుగడు. అందువలన సురేశు డతనికి శ్రీరామకృష్ణుడు జపముసల్పిన ప్రదేశములను బిల్వవృక్షము, పంచవటి మున్నగువానిని చూపించుచుండెను. మహాశయుడు వారితో నొక ప్రాణవిహీనమగు విగ్రహమువలె పోవుచుండెను. ఆతని మనమప్పు డెచ్చట నుండెనో ఎఱుగ నశక్యము. తరువాత వారు శ్రీరామకృష్ణు డుండిన గదిని సమీపించిరి. ఆగదిని సమీపించునప్పటికి మహాశయుడు "అయ్యో, తండ్రీ! ఇచ్చటనేమి చూచుటకు వచ్చితి"నని యాగదివద్ద నిలువున గూలెను. చక్రవర్తి లేవదీసెను. కాని ఎన్నివిధముల ప్రయత్నించినను, ఆతని నా గదిలోనికి తీసికొనిపోవుట యశక్యమయ్యెను. ఆతడు తనజీవితమున నెన్నడును ఆగదిలోనికిపోయి యెరుగడు. దక్షిణేశ్వరమున కేగినపుడెల్ల దూరమునుండి యాగదికి ప్రణామ మాచరించి వెడలిపోవువాఁడు.

ఆదినముననే శ్రీరామకృష్ణుని మేనల్లుడగు హృదయముఖోపాధ్యాయుడు అచ్చటికి వచ్చియుండెను. ఆతనివద్ద కొన్నిబట్ట

లుండెను. ముఖము విచారగ్రస్తమై వాడియుండెను. ఇప్పుడాతడు బట్టల నమ్ముకొనుచు జీవించుచుండెను. అతఁడు మహాశయుని బాగుగ నెరిగియుంటచే యిర్వురును శ్రీరామకృష్ణునిఁగూర్చి ముచ్చటింప నారంభించిరి. జగన్మాతపై హృదయుఁడు కొన్నిపాటలను పాడెను. మహాశయుఁడు వానిని విని 'శ్రీగురుదేవుఁడీ పాటలనే పాడుచుండువా,డనెను. తరువాత హృదయుం డతివిచారముతో "మీరుగదా ధన్యతములు. ఆ మహాత్ముని యవ్యాజకరుణామృతము మీపై వర్షింప ధన్యులైతిరి. కాని నేనుమాత్రము జీవనోపాధికై యింటింటికి వీధివీధికి తిరుగుచు బట్టల నమ్ముకొనవలసిన వాఁడనైతిని. మామ నాపైనొక్కింత దయార్ద్రదృష్టిం బరపియుండుచో ధన్యుఁడనైయుందును"అని వేదనచే హృదయము బరువెక్క బాలునివలె దుఃఖమాపుకొనలేక కన్నీరు కాల్వలుగట్ట విలపించెను. తరువాత వారు మార్గమధ్యమున నుండిన అలంబజారు మఠములోనికిబోయి సాయం ప్రార్థనలగావించి ప్రసాదము స్వీకరించి గృహోన్ముఖులైరి. రామకృష్ణానందుడు వారలను కొంత వరకు సాగనంపెను. హృదయుఁడును మహాశయుఁడును రామకృష్ణానందుని సెలవుగైకొని గిరీశుని గృహముజేరిరి. అచ్చటనుండి మహాశయులు తన బసకు బయలుదేరిరి.

ఈ కాలమున మాతృదేవి (శ్రీరామకృష్ణుని ధర్మపత్ని) గంగానదీతీరముననున్న నీలాంబరబాబుతోట యింటియందు నివసించుచుండెను. ఒక యాదివారమునాఁడు మహాశయుఁ డామెను చూడబోయెను. పోవునప్పుడు కొంత మిఠాయియు, ఒక ఎర్రని యంచుగల వస్త్రమును గొంపోయెను. చక్రవర్తియు నాతనితో నేగెను. మధ్యమధ్య మహాశయులు బాలునివలె "అమ్మా! అమ్మా!" యనుచు కేకలిడుచుండెను. కొంతవడికి వారిర్వురును అహిరీతోలా ఘట్టము

నాగమహాశయుని గార్హస్థ్య జీవితము

సమీపించి యట గంగానదినిదాటి కొలదికాలములో బేలూరును చేరిరి. మహాశయుని వేదన యధికమయ్యెను. పెద్దగాలికి ఆడిపోవు నెండుటాకువలె దేహము వడకసాగెను. ప్రేమానందస్వామి యుల్లం తమారమునసే ఈతనిజూచి యాతని యాగమనమును మాతృదేవికి దెలియపరచెను. మహాశయులు గృహమును సమీపింపగనే ప్రేమానందుడు ప్రేమపూరిత హృదయముతో మహాశయుని బట్టుకొని దేవి సమ్ముఖమునకు గొంపోయెను. అట నొక యరగంటసేపు ఉన్నతరువాత అందఱును ఈవలికివచ్చిరి. మహాశయుడు అసంపూర్ణస్మృతితో "తల్లి తండ్రికంటె నెక్కుడు దయచూపించు"ననెను. అంతప్రేమానందుడు "ఆహా! ఈ దినము మాతృదేవి మహాశయునిపై తనప్రేమ జ్యోత్స్నను బ్రకాశింపజేసినది. ఆతడు తెచ్చిన మధురపదార్థముల దాను స్వీకరించి స్వహస్తముతో బ్రసాదమిడినది ధన్యుడుగదా ఈపుణ్యాత్ముఁడు" అనెను. కొంతసేపట్లుగడపి మిత్రులిర్వురును మరల కలకత్తాకు మరలిరి.

మాతృదేవి మహాశయుని కొక వస్త్రమును కానుకగా నొసంగెను. దానినాతఁడు పూజా సూచకముగ సరకులను కొనుటకు అంగడికి బోవునప్పుడు శిరమున ధరించుచుండెను.

మహాశయులు పూజకువలయు సంభారముల నన్నిటిని "పాలుల"నుండి యుప్పు వర్తకముపైవచ్చు ఆదాయభాగము నుండి కొనితెచ్చుచుండెను. ఒకసారి సరకులకై కలకత్తాకు పోయినప్పుడొక భక్తుని కోరికపై దేవికి విసరుటకై యొక వెండిపిడిగల చామరమొక దానినిగొని ఇతర సరకులతోఁగూడ స్వస్థలాభిముఖుడయ్యెను. సాగనంపుటకు వచ్చిన మిత్రుడు సామానుల నందిచ్చు తొందరలో తనగొడుగు నాతడెక్కిన రైలుపెట్టెలో పొరపాటున

విడిచిపోయెను. పాపమాతడు గొడుగును మరచిపోయినాడని దానిని కాపాడుచుండ కొండొక ప్రయాణికుడు అడిగెనదని మహాశయుడెంత చెప్పినను వినక తీసికొనెను. బండి కదలినతరువాత నా ప్రయాణికుడు మైమరచి నిద్ర చెందెను. దానిచే నాతడు గమ్యస్థానమునుదాటి చాలదూరము పోయెను. అచ్చట ఎక్కువయైన సుంకమిచ్చుటకాతని వద్ద పైకము లేకపోవుటచే అధికారులు ఆతనిని ఆ స్టేషనులో ఆపిరి. మహాశయులీ సంగతిని జ్ఞప్తికి దెచ్చుచు "చెడుకార్యముల కెల్లప్పుడును శీఘ్రముగనే ఫలము గలుగును. కాని మందబుద్ధులగు మానవులు తెలిసికొనలేక యున్నారు." అనెను.

ఆ రైలుపెట్టెలోనే యొకడు తన యుంపుడుకత్తెతో ప్రయాణము చేయుచుండెను. మహాశయుడు వారిని చూడగనే యొక దృశ్యమును గనెను. ఒక భూతము ఆ మనుజుని కంఠము నొడిసిపట్టి రక్తమును పీల్చుచుండెను. చూచుచుండగనే ఆ వ్యక్తి రక్తమాంసములెల్ల పోయి శల్యావశిష్టుడయ్యెను. అంత మహాశయులు నిశ్చేష్టుడై "అమ్మ అమ్మ"యని కేకలిడెను. ఆతడీ విషయమై "ఇది యంతయు సత్యము. నమ్ముడు. దీనినంతయు ఈ కండ్లతోనే చూచితిని" అనెను.

ఈసారిమాత్రము నాగమహాశయులు దుర్గాపూజానంతరమున కొలదికాలమునకే కలకత్తాకు మరలిపోయిరి. కలకత్తాలో నున్నంత కాలమును సురేశచక్రవర్తులతో తరచు అలంబజారునకు దక్షిణేశ్వరమునకు గిరీశుని గృహమునకు పోవుచుండువారు.

కుమార్తులీలోనున్న ఈతని బసకు పెక్కుమంది వచ్చువారు. కాని అందెవరైన ఆతనియెడ గౌరవభావముగాని యణకువగాని చూపుచో "అయ్యా! మాంస యుతమగునీ యస్థిపంజరముననే

మున్నది? శ్రీరామకృష్ణునిగూర్చి ఏదైన చెప్పి నా యాత్మకు శాంతి యొనగూర్చు" డనువాఁడు.

అప్పుడప్పుడు గిరీశబాబు మహాశయుని కాతిథ్యమిచ్చువాడు. మహాశయుఁ డానందమున దప్పక స్వీకరించువాడు. గిరీశుని గృహమున భుజించుచో దేహాత్మలు రెండును పరిశుద్ధమగు ననువాఁడు. శ్రీరామకృష్ణ శిష్యులలో ఎవరి యింటనైనను గొంకులేక భుజించును. అట్టి చోటుల జాతిమత భేదములను పాటించక "ఇది జగన్నాథాలయము*" అనువాఁడు

మహాశయు లొకనాఁడు గిరీశుని కతిథియయ్యెను. ఆనాఁడు శ్రీరామకృష్ణునికి కచోరీలను నివేదనచేసి యా ప్రసాదమొక పళ్లెరమునను కూరల నింకొకదానిలోను వడ్డించిరి. అది చూచి మహాశయుఁ "డయ్యా! ఈ కూరలు జిహ్వాచాపల్యమును వృద్ధిచేయును. కనుక దయయుంచి తీసివేయుఁడ"ని ప్రార్థించుచు కొలదిమాత్రము కూరను కచోరియున్న పాత్రలోనికి గొనెను. చివరకు ఉప్పుకూడ చపలత్వమును వృద్ధిచేయునని తీసుకొనువాఁడు కాఁడు.

ఇంకొక దినమున గిరీశుడు విందునకు పిలచెను. ఆనాఁడు గిరీశుడు "కాయ్" చేపయొక్క గుడ్లను కొన్నిటిని సంపాదించెను. కాని మహాశయులు, శాకాహారియగుటచే అతనిచే వీనిని తినిపించుటకష్టము. అతఁ డందులకొక పన్నాగమును పన్నెను. నాగమహాశయులు శ్రీరామకృష్ణ శిష్యవర్గమును తనకు తమ ప్రసాదము నిమ్మని యడుగుట కలదు. వారట్లిచ్చుట కెన్నఁడును ఒప్పుకొనువారు కారు. ఆనాఁడు

---

* పూరియందలి జగన్నాథాలయమున జాతిమత భేదముల పరిగణింపరు.

మహాశయులు గిరీశుని ప్రసాద మడిగినతోడనే "జయశ్రీరామకృష్ణ" యనుచు తన యాకునందు కొన్ని గ్రుడ్లమతీసి యాతనికి ప్రసాదముగ నిచ్చెను. మహాశయు లది ప్రసాదమగుటచే మాఱుమాటాడక గ్రహించుచు "గిరీశా! నీబుద్ధి యతితీక్ష్ణము సుమా" యని ప్రశంసించెను.

శీతకాలమున మహాశయులు కప్పుకొనుటకు వస్త్రములేక చలిచే బాధపడు చుండెనని తెలిసి గిరిశుడు దేవేంద్రముజుమ్‌దారను ఒక భృత్యునిచే నొకకంబళము నిచ్చిపంపెను. అది గిరీశుడు పంపినట్లెఱిఁగి మహాశయుం డద్దాని కన్నిమారులో నమస్కరించి శిరముపై నిడుకొనెను. మహాశయు డెట్టికానుకను తీసికొనడని గిరీశు డెఱుఁగును. కాని దేవేంద్రునివలన తానంపిన కంబళము స్వీకరింపబడెనని విని మిగుల సంతసించెను. అంత కొన్నిదినములకు, ఆతఁడద్దాని నుపయోగపరచుకొనుటకు బదులు శిరముపై నిడికొని తిరుగుచుండెనని తెలిసి మిక్కిలి యాతురతపడి అద్దాని నిజస్థితి తెలిసికొనిరమ్మని దేవేంద్రు నంపెను. దేవేంద్రుడును తిరిగివచ్చి యాసంగతినే చెప్పెను.

కలకత్తాలో మూఁడుమాసము లుండి తరువాత మహాశయులు స్వస్థానముసుచేరెను. దీనదయాళు దేహస్థితి ఆదినమున కాదినము క్షీణదశకు వచ్చుచుండుటచే ఇప్పటినుండి తరచు కలకత్తాకు పోజాలకుండెను.

వివేకానందుడు మొదటిసారి అమెరికానుండి మరలివచ్చినప్పుడు చక్రవర్తి యాయనను చూడబోయెను. చక్రవర్తి మహాశయుని బాగుగ నెరుగునని తెలిసి యాయన "ఓయీ 'వయమ్‌తత్వాన్వేషాన్మధుకర హతస్ త్వంగ్ ఖలుకృతీ' మన జీవితములన్నియు సత్యాన్వేషణమున నిరుపయోగముగ జరిగిపోయినవి. మనలో ఆతడొకడే శ్రీగురుదేవుల

కత్యంత ప్రియసుతుడు" అని తనకు మహాశయుని చూడవలెనని యున్నదని యట్లాతనికి జాబు నంపుమనియు కోరెను.

వివేకానందస్వామి అమెరికానుండి మరలి వచ్చెనను సంగతి తెలిసినతోడనే మహాశయుడు కలకత్తాకువచ్చెను. అప్పటికి బేలూరు మఠాలయపు కట్టడము పూర్తియగుటచే వివేకానందస్వామి యచ్చటనే వసించుచుండెను. మహాశయులు జాబు అందిననాటి సాయంకాలమునకే అచ్చటికి చేరుకొనెను. స్వామినిగని సాగిలపడెను. స్వామికి రుగ్మతగనున్నది యని తెలిసి యాతురతతో "నీవు బంగారుగనివని ఠాకూరు చెప్పెడివారు. నీ యారోగ్యమును కాపాడుకో ప్రపంచమంతయు దుఃఖమునుండి యుద్ధరింపబడును. జగమంతయు నీపై యాధారపడియున్న"దనెను. అనంతరము స్వామి, మహాశయుని యా మఠమునం దుండుమనెను. అందుల కాత "అయ్యో! నేనేమిచేయుదును? గురువాజ్ఞనెట్లు తిరస్కరింతును? ఠాకూరు నన్ను ఇంటనే యుండుమని ఆజ్ఞాపించి"రనెను. మహాశయుని రాకచే ఆనాటి అధ్యయన పాఠశాలకు శిష్టానధ్యాయనము. అందరును మహాశయుని ముందు కూర్చొనిరి. స్వామి శ్రీరామకృష్ణ నామోచ్చారణ మొనర్చినంతనే మహాశయు డుత్తేజితుడై లేచి "జయ్ రామకృష్ణ, జయ్ రామకృష్ణ" యని యరచుచు, "క్రిందటిసారి నేను దక్షిణేశ్వరమునకు పోయినప్పుడు గురుదేవుడు కాన్పింపలేదు, కాని ఠాకూరే మఠమం దిప్పుడు ప్రత్యక్షమై యున్నా"రనెను. వివేకానందుడు దేవాలయములను మఠములను నిర్మించు విషయముపై తన యభిప్రాయము నడుగ మహాశయులు, "ఇవియన్నియు దేవదేవుని యిచ్ఛానుసారముగ జరుగుచున్నవి. మీరుమాత్రము దేహారోగ్యమును కాపాడుకొనవలయును. మీశరీరపోషణమే సమస్త మానవులకు సుఖదాయకమై

దుఃఖవిముక్తిని కలుగజేయు"ననెను. అంత స్వామి తక్కుంగల సన్న్యాసుల దిక్కు మొగమై "మహాశయుని చూచినంతమాత్రముననే, దేవదేవుని యవ్యాజకరుణా కటాక్షమున మనుజు డెంతటి యుచ్చస్థితికి రాగలుగునో మనకెల్లరకు తెలియగలదు. ఇంద్రియ నిగ్రహమునను వైరాగ్యమునను ఆతఁడే మనకన్న మిన్న"యనెను. కొంతసేపైనతరువాత నాగమహాశయుని పూజాప్రదేశమునకు తీసికొనిపోయిరి. అచ్చట మహాశయుఁడు సాష్టాంగపడెను.

ప్రతి సాయంత్రమునను వివేకానందస్వామి మఠముచుట్టును విహారార్థము నడయాడుట వాడుక. ఆనాడు మహాశయుడు కూడ ఆతని ననుసరించెను. మహాశయుడు రాత్రులు మఠమునందు గడపజాలడని ఎరిగియుంటచే స్వామి యొకశిష్యునితో నావను సిద్ధపరపుమని చెప్పెను. అప్పటికి కొలదివెలుతురుమాత్ర ముండెను. చీకటి పడుచుండుటచే స్వామి సెలవుగొనగోరి మహాశయు లాతనికి సాష్టాంగపడి "జయ శివావతారమూర్తీ! జయ శంకరా!" అనెను. స్వామి యాతని లేవనెత్తి "మహాశయా! అప్పుడప్పుడు నీ పవిత్రదర్శనమిచ్చి మమ్ము ధన్యులనుచేయుచుండు"మనెను. ఎప్పుడైన స్వామినిగూర్చి సంభాషణవచ్చినయెడల "శంకరభగవానునకు జయము" అనును. స్వామి పశ్చిమదేశ దిగ్విజయ ప్రసంగమున మహాశయుడు భావప్రపూర్ణుడై, గద్గదకంఠుడై స్వామి గొప్పయవతారమూర్తియనువాఁడు.

బాగుబజారునందలి స్వర్గీయ బలరామబోసుని గృహమునకు శ్రీ రామకృష్ణుడు తరచు వచ్చుచుండువాఁడు. మహాశయు లా గృహము శ్రీవాసుని *పెరడని చెప్పువాడు. సాధారణముగ శ్రీరామ

* శ్రీవాసు గౌరాంగుని ముఖ్యశిష్యులలో నొకఁడు. ఈతని గృహప్రాంగణమునకు గౌరాంగుడు తరచువచ్చుచుండువాడు.

నాగమహాశయుని గార్హస్థ్య జీవితము

కృష్ణునిశిష్యులు కలకత్తాకు వచ్చినప్పు డందు విడియువారు. అప్పటి కితడు వారిదర్శనార్థమై పోవుచుండును. ఒకనా డట్లు పోయినప్పుడు చక్రవర్తి వెంటబడియెను. ఆదినమున నా గృహమున బ్రహ్మానంద ప్రేమానందులు విడిసియుండిరి. వారేదోవిషయమై మాటలాడు చుండిరి. ఇంతలో మహాశయుండు రా ఆసంభాషణమును ముగించి శ్రీ రామకృష్ణునిగూర్చి ముచ్చటించిరి. తరువాత వారు గృహోన్ముఖు లగుచుండ బ్రహ్మానందు డిట్లనెను. "నాగమహాశయుని సన్నిధానమున మనస్సు అన్నివిషయములను మరచి గురుమహాశయుని జ్ఞప్తికి తెచ్చును. ఇట్టి ఆధ్యాత్మికశక్తిసమన్వితు లుండుటచే గదా భగవత్తత్త్వము హిందూదేశమున ఇంకను నిలచియున్నది ? ఈతడే ధన్యతముండు". మహాశయునికి సన్యాససోదర శిష్యులయం దమిత గౌరవము. "వారు మానవమాత్రులుకారు. భగవల్లీలార్థ మవతరించిన దేవతాస్వరూపులు. వారిని తెలిసికొనుట ఎవరితరము." అనువాడు.

క్రముక్రమముగ దీనదయాళుని యంతిమ దివసములు సమీపించెను. అంత్యకాలమంతయు ఈశ్వరప్రార్థన ధ్యానాదులయందే గడచెను. ప్రాపంచిక విషయంబులకు తనమనంబున తావొసంగక ఎట్టికల్మషముచేతను స్పృశింపబడక యుండెను. ఒకనాటి ప్రాతఃకాలమున మహాశయుడు తండ్రి చేయిపట్టుకొని నడపించుచుండెను. అంత హఠాత్తుగ దీనదయాళు స్మృతి విహీనుడై భూమిపైబడెను. మహాశయులు తండ్రిని చేతులపై లేవనెత్తి గృహములోనికి గొంపోయెను. అప్పటికి స్మృతివచ్చెను. మహాశయుడు తండ్రికి మరణకాల మాసన్నమయ్యెనని తెలిసి వైద్యునికొరకు చెప్పిపంపి తానాతని చెవియందు భగవన్నామము జపింపదొడగెను. మరణ సింసిద్ధుడై యున్న దీనదయాళుకూడ ఆతనిస్వరముతో తనకంఠ మైక్యముచేసి

దేవదేవుని నామము జపించెను. ఇంతలో వైద్యుడు వచ్చెను. అది శిరస్సంబంధమైన వ్యాధియనియు, మిక్కిలి యపాయకరమైన స్థితిలో నుండెననియు ఇక జీవితాశ కనబడదనియు చెప్పెను. పితాపుత్రు లిద్దరిట్లు ఈశ్వరనామము జపించుచుండ, దీనదయాళుని కంఠము మూగ పోయెను.

దీనదయాళు పరలోకగతు డగునప్పటి కాతనికి ఎనుబదిసంవత్సరముల వయస్సు. తండ్రి యవసానదశయందుకూడ స్మృతిరహితుడై యుండక భగవన్నామము జపించుచు తన నాటకమునకు భరతవాక్యము చెప్పెనని మహాశయుడు సంతుష్టాంతరంగుడై యుండెను.

మతానుసారముగ మహాశయులు విచారసూచకములగు వస్త్రములను ధరించి, శాస్త్రవిధిప్రకారము హవిష్యమును మాత్రమే స్వీకరించి యుపవాసముండి పిండప్రదానమును యథావిధిగ నొనర్చెను. తరువాత తానిహమున తండ్రికొనర్పగల యంత్యకర్మయగు శ్రాద్ధకర్మ వచ్చెను. అది యెంతయో గొప్పగ చేయవలెనని యాతని అభిలాష. కోర్కెలుండవచ్చునుగాని తీర్చుకొనుటకు ధనమెచ్చటనుండివచ్చును?

ఈతనియెడ భక్తిగౌరవములుగల భక్తులు కొందరు "రాలీ" సోదరుల కంపెనీలో పనిచేయుచుండిరి. వారికీ సంగతి తెలిపి యాతని ఎరుకలేకయే తమలోతాము చందాలవేసుకొనిరి. మహాశయునికీసంగతి ఎట్లో తెలిసి, వారిని తనకొరకై యట్లు కష్టపడవలదని వేడుకొనెను. చివరకు తన యింటిని అడుమానము పెట్టి ౫౦౦ రూపాయిలను, పొరుగుననున్న యొక గృహకునుండి కొంత సొమ్మును ఋణముచేసి మొత్తము రు. ౧౨౦౦ లతో అత్యంత వైభవముగ శ్రాద్ధకర్మల నొనర్చెను.

నాగమహాశయుని గార్హస్థ్య జీవితము

అనంతర మాతడు గయకేగి శిరోముండనము గావించుకొని శాస్త్రవిధిగ పిండప్రదాన మిచ్చి మరల కలకత్తాకు వచ్చెను.

మహాశయులు పితృశ్రాద్ధకర్మలకై యప్పులపా లయ్యేనని "పాలుల"కు దెలిసి కుమార్తులీలో నున్న ఈతని గృహమున కద్దె ఎక్కువ చేయ నిశ్చయించుకొనిరి. రంజితుకూడ ఈ యుద్దేశ్యమును బలపరచెను. కాని మహాశయు డందుల కొప్పుకొనలేదు. చాలకాలము నుండి యందు అద్దెనుండిన కీర్తివాసుడు మహాశయుని ధార్మికభావమునకు సంతసించి తనకు తానే ఎక్కువ బాడుగ నిచ్చుట కియ్యకొనెను. కాని మహాశయులు తన యసమ్మతిని జూపుచు "కీర్తివాసా! నీవు రాత్రింబగళ్లు కష్టించి సంసారమును సాగించుకొనుచున్నావు అతి దుర్ఘటమున నద్దె యిచ్చుచుంటివి. నేను నీవద్దనుండి యెక్కువ అద్దెతీసికొనుట కంగీకరింపజాల" ననెను. మహాశయులు కీర్తివాసుని పుత్రునివలె ప్రేమించుచుండెను. కీర్తివాసుడును మహాశయులు కలకత్తాలో నుండునంతకాలము ఎక్కువ గౌరవముతోను, ప్రేమతోను కొలుచుచుండెను. చాలకాలమువఱకు కీర్తివాసుడా గృహమందే యుండి మహాశయులుండిన గదిని శిథిలమైన యతని చాపను జాగ్రతతో కాపాడుచుండెను.

నాగమహాశయులు గయనుండి కలకత్తాకు మరలి వచ్చినప్పుడు శ్రీ మాతృదేవి బాగ్ బజారునం దుండెను. ఒకనాడామె దర్శనార్థమై యాతడు కొన్ని మధురపదార్థములను ఒకవస్త్రమును తీసికొనిపోవుచుండ మార్గమధ్యమున శూలనొప్పి యమితముగ వచ్చెను. అందువలన ముందున కొక్కడుగైన నిడలేక ప్రాంతముననున్న యొకగృహావరణమధ్యమున స్మృతిరహితుడై పడిపోయెను. అట్లు రెండుగంట

లుంచినతరువాత బాధ కొంత యుపశమింప లేచెను. అప్పటినుండి యింటికి బండిపై పోవచ్చును పోవుటకు వలయు శక్తి మనకు వద్ద నుండెను. కాని మొదట యనుకొనినట్లు మాతృదేవిని దర్శింపకుండ నింటి కెట్లు మరలగలడు? అందువలన తనయశక్తతకు దుఃఖించి బాధ పూర్తిగ నుపశమిల్లినయనంతర మామె దర్శనము చేసికొని రాత్రి 9 గంటలకు యింటికి తిరిగిపోయెను.

ఆ సంవత్సరము ప్లేగువ్యాధి కలకత్తాలో నిరంకుశముగ వ్యాపించెను. ప్లేగుయొక్క ఆవిర్భావమున కదియే మొట్టమొదటిసారి. ధనికులు, పేదలు అను వివక్షత లేక నొక్కుమ్మడి యందరును కలకత్తా సరిహద్దులను దాటి పారిపోయిరి. పట్టణము పాడుపడిన ట్లుండెను. మెస్సర్సు "పాలులు" కూడ కలకత్తాలోనున్న తమగృహమును నాగమహాశయుని యాధిపత్యమున నుంచి వారి గ్రామమునకు పోయిరి. ఒక వంటబ్రాహ్మణుడును, ఒక బ్రాహ్మణోద్యోగి (గుమాస్తా)యు నింకొక నౌకరును మాత్రమే యాతనితో నుండిరి. ఒకనాడు చక్రవర్తి మహాశయుని జూచుటకు "పాలుల" గృహమునకుబోవ నాతడు కండ్లకు జోడుపెట్టుకొని గీతాపారాయణము జేయుచుండెను. నాగమహాశయులు చక్రవర్తిని జూచి "ఇట్టి యజ్ఞానియు మూఢుడు నగు నాకు గీతార్థము బోధపడునా? నీవు బ్రాహ్మణుడవు, పండితుడవు కావున దయయుంచి నా కీశ్లోకార్థముఁ దెల్పుచు చదివి వినిపింపు" మని వేడుకొనెను. చక్రవర్తి యందలి

"కర్మణ్యా కర్మ యః పశ్యేత్" అను శ్లోకము చదివి దానికి వివిధ వ్యాఖ్యాతలు వ్రాసిన వ్యాఖ్యానానుసారముగ నర్థముఁ జెప్పెను. ఆటీక లన్నిటియందున శ్రీధరస్వామి టీక యాతనికి నచ్చియుండుట వలన దాని నెంతో ప్రీతిపూర్వకముగ వినియాడెను

నాగమహాశయుని గార్హస్థ్య జీవితము

మూడవదినము లిట్లు సవ్యముగ జరిగిపోయెను. నాల్గవనాడు బ్రాహ్మణోద్యోగికి ప్లేగు వచ్చెను. వైద్యుని పిలచిరి. కాని యాతని కెవ రుపచారము సేయుదురు? ఎవ్వరుగూడ నారోగి ప్రక్కనుండుటకు సాహసింపఁజాలకపోయిరి. ఇక నాగమహాశయు లొక్కడు మాత్రము పరిచర్య చేయవలసివచ్చెను. రోగ మభివృద్ధి జెందెను. వైద్యుడు నిరాశచేసికొని వదలెను. మృత్యువాతఁబడబోవు నారోగి మహాశయుని తన్నెట్లయిన గంగానదీతటమునకు జేర్చుమని వేడుకొనెను. మహాశయుని కెవ్వరును సాయము రాకపోవుటవలన నాతడే దగ్గరనున్న ఘట్టమునకు గొంపోవలసివచ్చెను. రోగి త్రోవలోనే "గంగా - గంగా" యని స్మరించుచు మహాశయుని యొడిలోనే ప్రాణముల విడిచెను. రోగి ప్లేగువ్యాధిచే మరణించుటవలన నా శవమును పూడ్చుట కెవ్వరుని రాకుండిరి. కాని ఎట్టకేలకు మహాశయు లెక్కుడు ధన మిత్తు నని యాశపెట్టినతరువాత కొందరు బ్రాహ్మణు లద్దానిఁ బూడ్చిరి. ఈసత్కార్యమున నాతని కిరువదియైదు రూపాయీలు వ్యయ మయ్యెను. ఆదినమున సురేంద్రనాథసేను, అఘోరచౌదరి, నరేంద్రనాథబోసు అను ముగ్గురుజను లాతని జూచుటకాతని ఇంటికి పోయియుండిరి. వారీతని చెయ్దియుమునుజూచి యాశ్చర్యపడిరి. నరేంద్రబోసు ఈతనికి పిచ్చిపట్టిపోయెననియే నమ్మెను.

ఒకదినమున నాగమహాశయులు కాళీఘట్ట స్థాపితమగు జగన్మాతదేవాలయమునకు బోయెను. మాతను దర్శించి మరలివచ్చుటలో మైదానమున నొకభక్తుని గలసికొనెను. భక్తు డీతనికి "ఏడెను*" తోటల జూపుట కచ్చటికిఁ గొంపోయెను. తోటలోని కడుగువెట్టు

* కలకత్తాలో సుప్రసిద్ధములగు ఆరామములు.

ఆరంభముగ మహాశయులు బాలునివలె ప్రతివస్తువును జూపి 'ఇది యేమి? అది యేమి'? అని ప్రశ్నింప మొదలిడెను. తరువాత మరలి వచ్చునప్పుడు, "మనుజుడు సౌఖ్యములకొరకై యనేకమార్గములంబడి పోవుచుండును. జీవితము సార్థకత జెంద జనన మరణ రహస్యముల దెలిసికొనుటకు ప్రయత్నించుట మాని యశాశ్వతములగు విషయేచ్ఛల ననుభవింపగోరును. ఈ ప్రపంచమును కొలది దినములలో వీడవలసి యుండుననని తెలిసియు నిట్లున్నది. ప్రపంచమంతయు తామసిక రాజసిక ప్రకోపమై కామినీకాంచనాధీనమైయుండ నరు లర్థానివెంట దవిలి యున్మాదులై పోవుచున్నారు. తండ్రీ! ఏమి నీ లీలలు! ఏమి నీ నటనాకౌశలము! నీ ప్రభావముముందు శుకాది మహర్షులుగూడ ముగ్ధులగుచున్నారుగదా?" అనెను.

ఒకదినమున నాగమహాశయులును మఱికొందరు భక్తులును శ్రీ రామకృష్ణుని జీవితమునుగూర్చి ముచ్చటించుకొనుచుండిరి. అంత నచ్చటనున్న నిరంజనానందస్వామి మహాశయునితో "నయ్యా! శ్రీగురుదేవుండు తమ్ముదాము నీచులమనియు, కించిజ్ఞులమనియు క్రిందు పరచుకొనవలదనియు నట్లుజేసినవారుతప్పక నధః పతితులగుదురనియు సెలవిచ్చిరి గదా. మీరేల ఇట్లు మిమ్ములనే నిందించుకొందురు? అందరికంటె నల్పునిగ నేల భావించుకొందు"రనెను. మహాశయు లందుల "కయ్యా! నాయల్పత్వమును నీచత్వమును నాకు ప్రతినిముషమును ప్రత్యక్షమగుచుండ నేనే శివుడ నని ఎట్లు తలంపగలను? "శివోహం" అని మీరు తలంపవచ్చును. గిరీశుండు తలంపవచ్చును. మీ భక్తి మేరువును బోలినది. నా కట్టిభక్తి లేదే! మీరెల్లనన్నాశీర్వదించినయెడల ఠాకూరు తన కృపావర్షమును నాపై వర్షించినయెడల నాజీవితము సార్థకముగాగలదు," అని ప్రత్యుత్తరమిచ్చెను. ఆతనిమాటలయందలి

నాగమహాశయుని గార్హస్థ్య జీవితము

అట్టి మనోనిశ్చయమును జూచి నిరంజనానందుడు మారుపల్కక లేక పోయెను. ఈ విషయమునుగూర్చి ప్రసంగించుచు గిరీశు డిట్లనెను. "ఇట్టిమనోనిశ్చయముతో నహంభావమునెల్లబోద్రోలినయాతడే దక్కనొండెవడును నాగమహాశయుని యత్యుత్తమస్థితికి రాజాలడు. అట్టివారు మెట్టినచోటు అతిపావనప్రదేశము కాగలదు.

గృహమున కేతెంచి మహాశయులు ఆనాడు తనయల్పత్వమునుగూర్చి తలపోయుచు కొంతమంది యాగంతుకుల యెదుట తానొక పాపములమూట యనియు కీటకాధముండనియు చెప్పెను. ఇంతలో నిరంజనానందుడు చెప్పిన మాటలు జ్ఞప్తికి రా "ఈ దినముననేకదా గిరీశుని ఇంట, కీటకాధముండనని తలచిన కీటకాధముండనే యగుదుననియు, అట్లుగాక నేనే శివుండనని భావించిన శివుండనే యగుదుననియు వింటిని. ఇంక నాగతి ఏమి కావలయును" అనెను. కొంతవడికి మరల నిట్లనెను. "అట్లు కాదు. నిజము చెప్పటయే మంచిది. నేను నిజముగ కీటకమాత్రుడనే. పుర్వును పుర్వని పిలుచుటయందెట్టి తప్పును లేదు. సత్యము పలుకుట నేరము గాదు. శ్రీ గురుదేవుని కృపాతిశయమునను సాధువర్యులగు మీ యొక్కయు గిరీశునియొక్కయు దయాతిరేకమునను నేను సత్యపరిపాలనమునుండి యెన్నడును తప్పకుందునుగాత!" ఇట్లు చెప్పుచు నచ్చటనుండినవారల కెల్ల నమస్కరించెను. శ్రీ గురుదేవుని మనసున నెంచి సాష్టాంగముగ నమస్కరించెను. తరువాత కొంతవడి యూరకుండి మరల నిట్లనెను. "ఈ యస్థిపంజరముపై నా కింకను ఇంత మోహముండగా నేనె శివుడనని నే నెట్లు చెప్పకొనంగలను? గిరీశు డసహాయశూరుడు. సాక్షాత్ భైరవాంశసంభూతుడు. కావున నాయన తాను శివుడనిచెప్పకొనుట చెల్లును". గిరీశుండు తలంపునకు రా నాతనికి నమస్కరించెను. మరల

"అయ్యా! నేను నీచాతినీచుడను. మీ కెట్టి సేవచేయగలను? మీకు పొగాకు చిలుములను తయారుచేసి ఇచ్చుటకే తగుదును" అని చిలుములఁజేయ నారంభించెను.

రామకృష్ణ పురవాసియు శ్రీరామకృష్ణ భక్తాగ్రేసరుడు నగు శ్రీయుత నవగోపాల్ ఘోషు శ్రీరామకృష్ణ వార్షికోత్సవమును ఎక్కుడు వైభవముతో జేయ సమకట్టెను. బెంగాలీ వారపత్రికయగు "వసుమతీ" సంపాదకుడు బాబు ఉపేంద్రనాథ ముఖర్జీ నాగమహాశయుల నుత్సవమున కాహ్వానించెను. నాగమహాశయుఁడు ఉత్సవదినమున ప్రాతఃకాలముననే అహీరీతోలాలోనున్న యుపేంద్రుని గృహమునకు బోయెను. ఈతడు వచ్చుటకు ఉపేంద్రుడొక బండిని కుదిర్చియుండెను. కాని మహాశయుడు నడచివత్తునని చెప్పెను. గుఱ్ఱములను కొట్టినచో మహాశయులు సహింపలేడని యుపేంద్రుడెరిగి యుండుటచే బండి వానిని కొట్టవద్దని యాజ్ఞాపించి మహాశయుని యెంతో బ్రతిమాలి బండి నెక్కించెను. గమ్యస్థానమును జేరుచునే ప్రథమమున నవగోపాలబాబునకు సాష్టాంగ వందన మాచరించెను. తరువాత నింటిలోని కరిగి చావడిలో నొక మూల నిలువబడి యతిథులకు విసర మొదలిడెను. నవగోపాలబాబును తక్కుంగల యతిథులెంతో బ్రతిమాలిరి. గాని లాభములేకపోయెను. రామకృష్ణపురమంతయు శ్రీరామకృష్ణుని పవిత్రనామముతో నానాడు ప్రతిధ్వనించెను. అతిథు లందరును శ్రీరామకృష్ణ సంకీర్తనమున మైమరచియుండిరి. శ్రీరామకృష్ణ భక్తసేవాపరాయణుడగు మహాశయునికి వారికి విసరుట దక్క కార్యమేమియు గన్పట్టలేదు. ఆమూల నట్లే విసరుచు నిల్చుండెను. తరువాత భక్తు లందరును ప్రసాదస్వీకారమునకు బోయినప్పుడు దాను గూడ ముకుళిత కరకమలుడై వారితో నేగెను. కాని వారి పంక్తిని కూర్చొ

మును కియ్యకొనలేదు. అందరును ఎంతయో వేడినమీదట ఒక్క మెతుకును మాత్రము స్వీకరించెను. ఈతని నడవడినిజూచి యందరాశ్చర్య నిమగ్నులైరి.

ఉత్సవానంతరమున కలకత్తాకు మరలునప్పు డెందరు ప్రయత్నించినను మహాశయుని బండి నెక్కింపలేకపోయిరి. అందువలన వారందరాతనితో నడువవలసినవారైరి. వచ్చునప్పుడు మహాశయులిట్లనెను. "శ్రీరామకృష్ణదేవుడు నవగోపాలుని భార్య విద్యాప్రకృతి స్వరూపిణి యనెను. ఈ భక్తవర్గమును కేవల మనుష్యమాత్రులని తలచువారు పశుప్రాయులు. మానవులెన్నటికిని కాజాలరు".

అటుతర్వాత కలకత్తాయందు నాగమహాశయులు కొలదికాలమేయుండి స్వస్థానమునకు మరలిపోయెను. ఇంటయే కలకత్తాకుబోవుట కాతనికి కష్టపటిసారి.

శ్రీరామకృష్ణుడు దేహమును చాలించిన తరువాత మహాశయులు స్వస్థానమునకు బోయి, యచ్చట నేకాంతప్రదేశమున నొక కుటీరమును నిర్మించుకొని యందు తానొక్కరుడుమాత్రము వసించుచుండునట్లు సంకల్పించెను. ఇది యాతని సహధర్మిణికిదెలిసి "మిమ్ములను నేనే విషయమునుగూర్చియు గూడ నెన్నడును వేధించియుండలేదు. ఇక వేధింపబోను. వేరుగ నుండు టెందులక"నెను. భార్య చెప్పిన యీ మాటలపై నమ్మకముంచి మహాశయు లాయింటియందే తన కుటుంబముతో నివసించుట కొప్పుకొనెను. కాని యింటియందు గార్హస్థ్యధర్మమున నుండెడి నను మాట మాత్రమేగాని జీవితమును సన్న్యాసులకన్న నెక్కుడు కఠిన నియమములతో గడపెను. ఆతని భార్య ఆయనయం దేనాడును ఎట్టి మనోవికారమును పొడగాంచ

లేదు. "శ్రీరామకృష్ణ దివ్యనామమః గైకొని యాయన సకల విష యేచ్ఛల ద్రొక్కివైచెను. ప్రజ్వలితాగ్ని మధ్యమున నుండెను గాని దేహమెచ్చటను కసుగందలేద" నెడిది.

ఒకమారు దియోంబాగునందలి యాతని గృహమునకు కులగురువు సంతతివారగు నిద్దరేతెంచిరి. వారిలో నొకడు భక్తుడు. ఆతని పేరు నవీనచంద్రభట్టాచార్యుడు. దీనదయాళ దేపనిగ నాతని బలవంతపర చుటచేత నాతడు మహాశయునిఁ జూచి "యోయీ! గృహస్థాశ్రమ ధర్మమును దెలిసికొని వివాహము చేసికొనుట యెందులకో, భార్య యనవేమో తెలిసి వంశమును నిలుపుటకై గడంగు"మనెను ఇది విని మహాశయుఁ డమితదుఃఖమున నిలువునఁ గూలబడి మూర్ఛనొందెను. ఒడ లంతయు గాయములుపడి రక్తసిక్తమయ్యెను. తరువాత కొంతవడికి తేరి యాభక్తుని జూచి "యయ్యా! తమరు మా కులగురువుల సంతతి వారు, మరియు భక్తులు. అట్లుండియు నన్నిట్టి నీచకార్యమునకు సిద్ధ పడు మని యాజ్ఞఁ జేయుటకంటె వేరొక పాపకార్య ముండునా?" యనుచు ప్రక్కనున్న యొక యిటుకరాయిఁ దీసికొని తల పగిలి గాయమై రక్తము స్రవించువరకును కొట్టుకొనెను. ఇది చూచి యా భక్తుడు మిక్కిలి విచారించి తన యాజ్ఞను రద్దుచేసెను. తోడనే మహాశయుడు సంతోషముతో యాతని పాదధూళిని స్వీకరించెను.

ఒకతరి దీనదయాళు మహాశయునిఁ గోపమున నిట్లనెను. "సన్యాసివలె నిట్లుండిన నీవు కూడు గుడ్డలెట్లు వచ్చును?" అంత నాగమహాశయుడు "తండ్రీ! సంసారవిషయమై జిజ్ఞాస పడవలదు. వృక్షము లన్నియు తేపివుల్ల నెల్లప్పుడు నలరారుచునే యుండును. నాకు ఏ స్త్రీపైనను మోహమెన్నడును జనించియుండలేదు. జనని

గర్భమునుండి వెలువడినప్పు డెట్లుంటినో యిప్పుడు నట్లే యుంటిని. ఇక కట్టుకొనుటకు గుడ్డ యేల?" అనెను.

మహాశయుని సంసారవైముఖ్యమునకు దీనదయాళు తాతని తరచు మందలించువాడు. ఈ విషయమై తండ్రి కొడుకుల కొకనాడు వాద మేర్పడెను. మహాశయుడు ఉద్రేకముతో "నా జన్మమం దెన్నడును నాకు మోహము జనించియుండలేదు. ఈ ప్రపంచముతో నా కెట్టి సంబంధమును లేదు. నాహం నాహం (నేను కాదు, నేను కాదు,)" అనుచు దిగంబరుడై గృహమునుండి వెడలిపోయెను. ఇది చూచి భార్య వెక్కి వెక్కి ఏడువ నారంభించెను. ఆమెదుఃస్థితిం గాంచి జాలి గొని, మహాశయుని భక్తుడొకడు అతని మరల నింటికి గొనివచ్చెను.

దిమోభాగు వాస్తవ్యము, మధ్య వయస్కురాలునగు వితంతు వొకర్తుక తరచు మహాశయునికడకు వచ్చుచు నొక గొప్ప భక్తురాలి వలె నటించుచుండెను. కాని యామె యపవిత్రభావమును, ఆమె దుర్వృత్తియు మహాశయుని సూక్ష్మదృష్టికి తెలియవచ్చెను. అట్టి వయసునందు గూడ నామె యట్టి భావముల గలిగియుండుట కాతడా మెను జాల యసహ్యించుకొనెను. ఈమె మనోభావములను మహాశయుని భార్య గ్రహించి యామె నింటికి రాకుండజేసెను. దీనిగూర్చి మహాశయు డిట్లు చెప్పువాడు. "అయ్యో! యీతుచ్ఛ, దుర్గంధపూరిత కళేబరమును కుక్కలును గ్రద్దలును గూడ చేనక జాలవు. అట్టి ఈ శరీరముపై ఆమెకు మోహ మెట్లు కల్గెనో తెలియకున్నది. శ్రీ గురుదేవుడు నన్నింకను ఎన్నివిధముల పరీక్షించుచున్నాడు! కరుణామయుడగు భగవంతుని కటాక్షము లేక మోహాంధకారమునుండి వెలువడుట ఎట్టి వానికిని అసంభవము." అనెను. అప్పుడప్పు డీకవిముఖము

నుండి సులభగ్రాహ్యముగ గొప్ప వేదాంతసత్యములు గూడ వెలువడు చుండెను. మోహమున కెంత దూరమో భగవంతుని కంత దగ్గర యని యాతఁడు తరచు చెప్పువాఁడు.

కామినీవిషయమున నుండిన వైముఖ్యముకన్న నాతనికి కాంచనముపట్లనె ఎక్కుడు వైముఖ్యము. ఒకతరి "పాలుల" బంధువులలో నొకనికి విషూచి తగిలెను. ఎన్ని వైద్యములో చేయించిరి. కాని రోగము తగ్గలేదు. వైద్యమందు మహాశయుని కౌశలమును ఎరిగియున్న వారగుట నాతని సాయపడుమని వేడుకొనిరి. మహాశయుడును మాట తీసివేయనేరక యొక హోమోపతీమందును చెప్పెను. ఆ మందు నీయగనే వ్యాధి కుదిరెను. వ్యాధి కుదిరెనను సంతసమున "పాలులు" మహాశయునికి బహుమాన మీయవలె నని కొంత సొమ్మును తీసికొని వెళ్లిరి. మహాశయుడు తీసికొనలేదు. వారెంతయో బలవంతపరచిరి. అంత మహాశయు డేడ్చుచు "అయ్యో! దైవమా! నన్ను ఈనిందార్హమగు వృత్తిని ఏల నేర్చునట్లు చేసితివి? ఇందువలన నెన్ని పాపముల కొడిగట్టవలసియున్న"దనెను. ఆతని యాక్రందనమునుజూచి "పాలులు" "మహాశయా! నీవు మనుష్యమాత్రుడవు కా" వనిరి.

ఈ యలౌకికగృహమేధికృత్యము లన్నియు యలౌకికములుగనే యుండెడివి. "పాలుల" కోరికపై యొకనాడు మహాశయుడు భోజేశ్వరమునకు బోయెను. భోజేశ్వరమునుండి మరల కలకత్తాకుఁ బోవునప్పుడు దారిబత్తెములక్రింద నెనిమిది రూప్యములను, చలి నాపుకొనుట కొక కంబళము నిచ్చిరి. భోజేశ్వరమునుండి యోడరేవున కారు మైళ్ల దూరము. మహాశయుడు ఓడరేవును జేరి టిక్కెట్టు తీసికొనబోవు సమయమున నొక భిక్షుకి యైదార్గురు బిడ్డలు తన్ను బట్టికొని 1 వేలాడు

నాగమహాశయుని గార్హస్థ్య జీవితము

చుండ మహాశయునకు నమస్కరించి యతిదీనముగ దన కష్టములను జెప్పుకొని తనకేమైన నిమ్మని ప్రార్థించెను. మహాశయుడా మెదీనాలాపములకు జాలిగొని తనవద్దనున్న యెనిమిది రూప్యములను కంబళము నామెకిచ్చెను. భిక్షుకియు సంతసించి యాతని దీవించి వెడలిపోయెను. ఆరుమైళ్లు నడచుటవలన గలిగిన యలసట నపనయించుకొన నెంచి యట కొండొకతడవు విశ్రమించెను. ఓడరేవు విడిచిపోయిన తరువాత కలకత్తాకు నడచుట కారంభించెను. అతనివద్ద ఏడణాల యారు పైసలు మాత్రముండెను. మార్గమధ్యమున నేదేని దేవాలయమున్న నందలి ప్రసాదము స్వీకరించియు మరొకప్పుడటుకులను భుజించియు ఆకలిని తీర్చుకొనుచు ప్రయాణము సాగించెను. నడుమ నదులను దాటవలసి నప్పుడు చిన్నవైనచో నీదియు పెద్దవైనచో కొలది పైకమునకు చిన్న నావనెక్కియు దాటిపోవువాడు. ఇట్లు తనవద్దనున్న కొలది యణాలపై నాధారపడి ఇరువది దినములేకదీక్షగ నడచి కలకత్తా చేరెను.

ఒకసారి మహాశయుడు ఉప్పువర్తకము పడిపోవుటచే దగ్గర పైకములేక మిక్కిలి దుస్థితియం దుండెను. తరచు నిరాహారుడై పోవలసి వచ్చెడిది. అంతె, చాలకాలమునకు "పాలులు" రెండువేల మణుగుల యుప్పును పంపిరి. అమ్ముటకై మహాశయుడు కిద్దర్ పురమునకు బోయెను. అంతయుప్పున కధమము ఏడురూప్యములైనను వచ్చియుండును. కాని మహాశయుడా యెండలో గూర్చొనియుండి పదమూడణాలకంటె నెక్కువ సంపాదింపలేకపోయెను. ఆ పదమూడణాలను తీసికొని యింటికి వచ్చుచుండగా దారిలో నొకడు తన కష్టములను చెప్పుకొని తనకేమైన నీయుమని వేడుకొన నా పదమూడణాల నాతని కిచ్చి రిక్తహస్తుడై యింటికి బోయెను. ఆ దినమున కాకలి బాపుకొనుట కింట నొక బియ్యపుగింజయైన లేకుండెను

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్ర

చిన్నతనమున పిల్లి మ్యావు మనుటయు కుక్క మొరుగుటయు మహాశయుని చెవిని, వాని క్షుద్బాధను సూచించు శబ్దములుగ, బడు చుండెను. అప్పు డతడు మేనత్తనుజూచి "అమ్మా! అవి యట్లేలగుల కేడ్చుచున్నవి? వాటికి కొంచె మాహారమిడరాదా?" యని కొంచె మన్నము తీసికొని "యన్నా! యేడ్వకుము. ఇదిగో యాహారము స్వీకరించు" మని పెట్టువాడు.

మహాశయుల ఇంటివద్ద నొక చిన్నచెరు వుండెను. అతడు పదమూడు పదునాల్గు సంవత్సరముల వయస్సున నుండినప్పు డనుదినమును భోజనానంతర మాచెరువునొద్దకు బోయి ముఖమును చేతులను ప్రక్షాళనము చేసికొనువాడు. ప్రక్షాళనార్థము పోవునప్పుడు దనతో నన్నమును పప్పును తీసికొనిపోవును. ఈతని చేతితో నిడు నాహారమున కలవాటుపడిన యా చెరువునందలి చేపలీతని పిలు పును వినగనే వచ్చి చేతినుండి యాపప్పును అన్నమును స్వీకరించె డివి. ఇట్లాతడు కలకత్తాకు విద్య నభ్యసించుటకు బోవువరకును చేప లతో నాడుకొనువాడు. మహాశయుడు పశుపక్ష్యాదులకు గూడ జ్ఞానము కలదనియు జన్మాంతరముల నుచ్చ జన్మల నెత్తి యవి ముక్తములగు ననియు చెప్పువాడు.

వేసవికాలమున నొకనాటియుదయమున మహాశయుడు గృహ మంటపమున గూర్చొని పొగ పీల్చుచుండ రెండడుగుల పొడవైన పుగోరు వంక లాతనిముందు ప్రాలెను. మహాశయుడు వానిని గమనించక పోవుటచే నా గోరువంక లాతని పాదముల ముక్కుతో తాకి తాము వచ్చిన సమాచారమును తెలిపెను. అంత మహాశయుడు వానిని జేతుల లేవనెత్తి ముద్దుగొని "యమ్మలారా! వచ్చితిరా! ఇంచుక నే పొగను

ఆహారముఁ గొనివత్తు"నని లోనికి బోయి యన్నముదెచ్చి తన చేతులతో తినిపించెను. కాని వానియాకలి యింకను దీరకపోవుటచే నవి వాని ప్రక్క ప్రదక్షిణముచేయ నారంభించెను. మరల లోనికి బోయి మరి కొంత యన్నమును జలమును తెచ్చి యిడ నా పక్షులాతని చేతిపై గూర్చొని యా తెచ్చిన యాహారమును దిని తృప్తిచెందెను. తృప్తిచెందిన యనంతర మా పక్షుల నుపలాలించి "మీ రిక నరణ్యమున కేగి యిచ్చ వచ్చిన ట్లాడుకొని రేపి వేళకు రండన" నని యెగిరిపోయెను. తరువాత నాగమహాశయు డిట్లనెను. "ఆహా! శ్రీరామకృష్ణుఁడు తన పుత్రులతో నెన్నివిధముల నాడుకొనుచున్నాడు. ఆతని వింతలీలల నెవ రెరుగగలరు?"

నాగమహాశయు డహింసాధర్మప్రత్యక్షస్వరూప మని చెప్పవచ్చును. "అహింసా పరమో ధర్మః" అను సిద్ధాంతమును అతడు అక్షరము వదలక యనుష్ఠించెను. నారాయణగంజిలో జనపనార నుత్పత్తి చేయు (Jute Mills) యంత్రాలయములయందు పనిచేయుచుండిన యిర్వ రాంగ్లేయోద్యోగులు వేట తమకమున దియోబాగునకు వచ్చిరి. తుపాకులధ్వని విని మహాశయుఁడు వారి దరికిఁ బరుగున బోయి చేతులు జోడించి "అయ్యా! దయయుంచి యీ దుష్కృత్యమునుఁ జేయవల" దని దీనముగ వేడుకొనెను. ఈతని మాటల యర్థమును తెలియక వారు తుపాకులను మరల దట్టించి కాల్చుటకు గడంగిరి. మహాశయుఁ డంతట బెదరించుచు, "కాల్చినచో జాగ్రత్త" యనెను. ఆ దొర లీత డున్మత్తు డని వారిపనులయందు మగ్నులై యుండిరి. తోడనే మహాశయుఁడు క్షణమున వారిపై నురికి రెండు చేతులను రెండు తుపాకులను బట్టుకొనెను. తుపాకుల నాతని చేతినుండి తీసికొనుటకు వా రెంతయో ప్రయత్నించిరి. ఆతని సంకల్పశక్తి యపారముఁ గావున నాత డప్పు

సింహబలునివలె కన్పట్టెను. వారల కతనితో పెనఁగుట యసాధ్యమయ్యెను. తరువాత మహాశయుఁడా తుపాకుల నింటికిఁ గొంపోయి యొకమూల నునిచి యట్టి ముష్కరాయుధముల తాకినందులకు రెండు చేతులను రాతిపై పెట్టి రాచి రాచి కడిగెను. ఉద్యోగులును నారాయణగంజికి బోయి యాతనిపై నభియోగము తేఁ సమకట్టిరి. ఇంతలో మహాశయుఁడొక బంగాలీ యుద్యోగస్థునిచే నా యాయుధముల వారికి పంపివేసెను. ఆతఁడా తుపాకుల వారి కిచ్చి మాటసందర్భమున మహాశయుని సాధుస్వభావమును గూర్చి చెప్పెను. ఆతనిపై భక్తిగౌరవము లుదయింప వారు దమ యుద్దేశమును మార్చుకొనిరి. అప్పటినుండి వారు మరల వేఁటకై దియోబాగునకు బోలేదు.

మహాశయుఁడు ఎట్టి ప్రాణియైనను కష్టపడుట చూచి సహింపలేకుండెను. ప్రతివత్సరమును వరదలలో నెన్నియో చేపలు కొట్టుకొనివచ్చి యాతని ఇంటియొద్దనున్న చెరువునందు నివాస మేర్పరచుకొనును. ఒక దినమున నొక జాలరి యా చెరువునందు కొన్ని మత్స్యముల బట్టి యూరి కట్టుబాటుప్రకారము చెరువు స్వంతదారునకు ఈయవలసిన భాగము నిచ్చుటకై మహాశయునియింటి కేగ నాతఁడా జాలరిగంపలో కొట్టుకొనుచున్న చేపలను జూచి జాలినొంది తత్క్షణ మా జాలరి యడిగిన రొక్కమిచ్చి వాటినన్నిటిని గొని మరల చెరువునఁ విడిచెను.

ఇంకొకదినమున వేరొక బెస్తవాఁడా తటాకమున చేపలఁ బట్టి యమ్ముటకతని గృహమున కేగెను. ఈ సారి గూడ మహాశయుఁడు వాని నన్నిటిఁగొని యథారీతిగ చెరువునఁ విడిచెను. జాలరి దీనిని జూచి భయపడి యా చేపల వలయును తట్టయు తనకు జేరగనే యీ పిచ్చి

వాని బారినుండి పారిపోయెను. జన్మమధ్యమున మరల నాతఁడు మహాశయుని ప్రాకారమును దాటి ఎన్నడావైపునకు బోయి ఎఱుఁగడు.

మహాశయుఁడు అహింసావ్రతదీక్షయం దెంత పట్టుదలతో నుండెనన నాతఁడు సర్పములు మొదలగు క్రూరజంతువులఁగూడ చంపనొల్లకుండెను. ఒకపరి త్రాచుబా మొకటి యీతని పెరటిలోనికి వచ్చెను. దానిఁ జూచి యచ్చట నున్నవా రందరును భయభ్రాంతులైరి. ఈతనిభార్య మహాశయునితో నా పామును చంపివేయుట మంచిదని చెప్పెను. అందుల కాతఁడు "అడవులలోనుండు ఈ పాములఁ జంపుట వలన నేమి రాగలదు? మన మనస్సులలో నున్న పామును జంపవలెను" అనుచు నా పామును సంబోధించి, చేతుల జోడించి "నీవు మనస్సుయొక్క ప్రత్యక్షస్వరూపమవు. నీకు యోగ్యనివాసము అరణ్యము. ఈ నా కుటీరమును విడిచి నీ నివాసమునకే బోయి నన్నాశీర్వదింపు" మనెను. ఈతని మాటలయందలి యర్థమును తెలిసిన దానివలె, ఆపాము పడగను దించి యరణ్యమువైపునకుఁ బోయెను. మహాశయుఁడు తరచుగ "నీ బహిఃప్రకృతి మన మనస్సులయొక్క పరివర్తనమే. నీ వీ ప్రకృతి నెట్లు గూడ నెంతువో నీ కది యటులనే గన్పించును. అది యద్దము వంటిది. దర్పణము నెదుట చేయు వెక్కిరింతల నెల్ల యందలి ప్రతిబింబము మనల కటులనే సమర్పించును." అనువాఁడు

ఒకదినము మహాశయుఁడు చెరువునందు ముఖప్రక్షాళనము చేయుచుండగా నొకపాము ఆతని కాలిబొటనవ్రేలిని కరచెను. పాము తన పనిని నిర్విఘ్నముగ జేయుటకై మహాశయుఁ డచ్చోటినుండి కదలలేదు. తరువాత నాతనిభార్య వచ్చి యీ వింతచూచి గడగడ వణకెను. మహాశయుఁడు అంత "ఎందు కిట్లు భయభ్రాంత వయ్యెదవు? ఉపద్రవ

మేమియును లేదు. పాప మీ నీటిపాము నా వ్రేలిఁ జూచి యది కప్ప యని భ్రమపడి పట్టుకొని త్వరలోఁ దన ప్రమాదమును తెలిసికొని నా కపాయము గలుగకుండ విడిచిపుచ్చినది" యనెను.

ప్రాణిలోకమునం దెల్ల నొక్క పరమాత్మయే నివసించుచుండె ననుట యాతని కనుభవసిద్ధము. సర్వలోకమును ఆ పరమాత్మయందే పుట్టి ఆ పరమాత్మయందే తమజీవయాత్రను గడపుచున్నవి యనుట యాతనికి సాక్షాత్కారము. ఎల్లప్పుడును నీవి ట్లెందులకు చేతులను జోడించుకొని యుందు వనిన తనకు సర్వప్రాణిలోకమునందును ఎల్లెడలను తన ఇష్టదేవత కానుపించుచుండె నని చెప్పువాఁడు. అతడు ఒక సజీవమగు పాదునుండి యొకగరికను కోయుట కూడ నాతనికి కష్టముగ నుండెను. అందుమాత్ర మా పరమాత్మ స్పందనము లేదా? నాగమహాశయుఁడు చీమలు, దోమలు మొదలగు చిన్న ప్రాణులను గూడ నశ్రద్ధగ చూచువాఁడు కాఁడు. చీమలు తనపై ప్రాకినచో సంతోషమున వాని నింకొక క్షేమకరమగు స్థానమునకుఁ జేర్చువాఁడు. ఈ భూతదయార్ద్ర భావ మాతని మనమును సంపూర్ణముగ వశముచేసికొన నొక్కొక్కప్పుడు అతఁడు తన పాదముల క్రిందబడి యనేకజీవములు మృతిజెందు నని ఎచ్చటికిని బోకుండ నుండువాఁడు. ఒక్కొక్కప్పు డుచ్ఛ్వాసనిశ్వాసముల వలన గాలిలోని సూక్ష్మజీవములు నశించునని వాయువును బంధించువాఁడు. అట్టి సందర్భములయందు ఆతని మరల నూపిరి సెల్చునట్లు చేయుట కొక సూత్రము "నీవు ఆత్మహత్యను చేయఁగడంగుచున్నా వనుటయే". ఆత్మహత్యనుగూర్చి శ్రీరామకృష్ణుఁడు చెప్పిన వాక్యముల నాతఁడు జవదాటనొల్లఁడు. "ఈశావాస్యమిదం సర్వం" అను నుపనిష ద్వాక్యము ననుభవసిద్ధముగఁ దెలిసికొని, అన్నిటను నొక శివశక్తి

నాగమహాశయుని గార్హ్యస్థ జీవితము

ప్రవహించుచున్నదని యెఱిగి మానవులకువలెనే చెట్లుచేమలకును సుఖదుఃఖము లున్నవని గ్రహించి, తదనుగుణముగ దమజీవితమును గడపిన యనేక సాధుపుంగవుల జీవితములు మన హిందూదేశమున విశ్రుతపూర్వములు. ద్రవిడ వాఙ్మయమున నాళ్వారులయొక్కయు, నాయనారులయొక్కయు జీవితములయం దిట్టి యనుభవము లెన్నియేని గలవు.

ఒకప్పు డీతనిభక్తులలో నొకడు మహాశయునియింటిచావడిలో గూర్చొని చావడికి తూర్పుభాగమున కాధారముగ నుంపబడిన స్తంభములను చెదలు పట్టియుండ జూచెను. తోడనే యాతడా స్తంభమును గొట్టగ నాచెదలు పురుగులు రాలి భూమిపై బడెను. మహాశయుడు దీనిని జూచి "అయ్యో! యెట్టిపని యొనర్చితివి! పాప మీ పురుగు లెంత కాలమునుండియో యీ స్థానమున శాంతిప్రదముగ నివసించుచుండెను. ఇట్లు వీనిని చెదరగొట్టు టెంత క్రూరము! ఎంత యన్యాయము"ని చెప్పెను. ఇట్లు చెప్పుచుండ నాతని కన్నుల కరుణాశ్రువులు నిండియుండెను. పాపమా శిష్యుడు నిస్తబ్ధుడై ఖిన్నుడై బొమ్మవోలె నిలబడిపోయెను. అంత మహాశయుడా పురుగుల సమీపించి "ఇక మీరు మరల మీస్థానము నాక్రమించుకొనుడు. మిమ్మెవ్వరును బాధపెట్ట"రని మరల నవి పుట్టపెట్టుకొనుటకు సాయపడెను. కొంతకాలమునకు స్తంభములు కూలిపోయెను. కాని యా చెదలుపురుగులను బాధించుట కాతడొప్పుకొనలేదు.

మహాశయునికి బాల్యమునుండియు గోవులన నతిశయభక్తి. ఆవులం దాతడు జగన్మాతస్వరూప మెక్కుడుగ దర్శించువాడు. తరచు వాని పాదధూళి శిరమునం దుంచుకొనును. ఒక దినమున నాతని వద్ద

చెరకుగడ ముక్క యొండగఁ జూచి దాని యాకులఁ దినవలెనని గోవొకటి ప్రయత్నించుచుండెను. అంత మహాశయు లా చెఱకు ముక్కను చిన్న ముక్కలుగ గోసి గోవునకు ప్రేమతో బెట్టెను. తరువాత దాని పాదములకు సాష్టాంగపడి విసర నారంభించెను. విసరుచుండగ నాతని మనమున భక్తిభావముదయించి యాతడుస్మృతి రహితుడై పడిపోయెను.

మహాశయుండు శక్త్యుపాసకుడు. శక్తియుపాసనయందు బ్రహ్మ మును తల్లి రూపమున బూజించును. ఆయనయు శ్రీరామకృష్ణుని వలెనే "త్రోవలెన్నియైనను గమ్యస్థాన మొక్కటియే. ఇందు జాతి మతభేదములు ప్రయోజనపడవు. ఏయొక్క మతమును నమ్మి యందు నిష్ఠగలిగియున్నను ఈశ్వరుడు తప్పక కటాక్షించును" అని నమ్మెను. అతనికి జాతిమతములయం దెట్టి భేదబుద్ధియు లేకుండెను. శైవులయినను వైష్ణవులైనను * బౌలులైనను, కార్తబాజులైనను ఆత డొకే రీతిని గౌరవించెను. అతనికి ముసల్మానులయందును క్రైస్తవులయందును హిందువులయందును సమాన గౌరవ ముండెను. మసీదును జూచినపుడెల్ల నాతఁడు చేతుల జోడించువాడు. అదే రీతిగ క్రైస్తవ దేవాలయముల గాంచినప్పుడును "జీససునకు జయమగు గాక" యనుచు నమస్కరించువాడు.

భక్తిసాధనలగూర్చి యిట్లనువాడు. "ఫలవృక్షము క్రిందనుండు కాపరివలె బుద్ధియెల్లప్పుడును మెలకువగ నుండవలెను. పండ్లు పక్వ మగుట ఈశ్వరుని కృపాధీనము. సాధకుఁడు తన సాధనలయొక్క ఫలము ననుభవించుట యెల్ల నాతని కటాక్షమే. కొందరి యెడల నెట్టి

* వీ రిర్వురు చైతన్యమతమునందు రెండు విధములవారు.

పురుషప్రయత్నముకు లేకయే యాకరుణ ప్రసరించును. ఈ ప్రకారము వారు నిద్రించుచుండ కృపాసింధువగు భగవంతుఁడు వారిపై నమృతమును వర్షించెనా యనునట్లు అందరకును ఆశ్చర్యకరముగ నుండును. అట్టి వారలు ఎట్టి సాధనలను అభ్యసించవలసిన యవసరమే యుండదు. వారలు * కృపాసిద్ధులనబడుదురు. భగవంతుని యనుగ్రహములేక యాతని నెవ్వరును జూడజాలరు. పరమేశ్వరుడు భక్తుల పాలిటి కల్పతరువు. తన్ను కోరిన దెల్లయు నొసగును. కాని మనుజుడు బుద్ధిగలిగి మరల సంసారసాగరమున బడద్రోయు కోర్కెల గోరరాదు. అతని చరణకమలములయం దచంచలభక్తియు ఆత్మజ్ఞానమును ఇచ్చునట్లే కోరవలెను. అట్లు కోరినయెడల నాతఁడు ప్రాపంచిక విషయబంధవిముక్తుఁ డగుచు అతని కృపకు తప్పక పాత్రుడగును. ప్రాపంచికేచ్ఛలఁ దవిలినచో సుఖ మెన్నడును ఉండజాలదు. ఏభక్తుడు సదా యీశ్వరధ్యానమందే మునిగి యాతని భక్తగణమును భక్తితో బూజించుచు పవలు రాత్రి యనక నా దేవదేవుని నామస్మరణముఁ జేయుచుండునో యాతఁడు మాత్రమీ దుఃఖభూయిష్ఠమగు నీ ప్రపంచమున కతీతు డగును."

మరియు అణిమాద్యష్టసిద్ధులనుగూర్చి ఇట్లనువాడు. "హృదయము పవిత్రమై ఆధ్యాత్మిక పథమున నుచ్చస్థితిని పొందు కొలదిని కొన్ని సూక్ష్మతరములగు విషయేచ్ఛలు మనస్సు

---

* భగవంతుని యవ్యాజకృపాకటాక్షమునకు పాత్రులైనవారు కృపాసిద్ధులు. ఇట్టి యనేకులు అవతారమూర్తుల చరిత్రలయందు కాన నగుదురు. ఉదాహరణరూపమున చైతన్య మహాప్రభుని కృపకు పాత్రులైన బందిపోటుదొంగలును హంతకులును నగు జగన్నాథుఁడు మాధవుఁడనను సోదరులు ఇచ్చట పేర్కొనదగినవారు.

నాకర్షింపజొచ్చును. అట్టి వానికి కొన్ని యలౌకికశక్తులు వచ్చి అతడు వానిని ఉపయోగించుకొనదలచె అవి అతనిని అధఃపతితుని జేయ జూచును. నిర్మలాత్మునికి వస్తువితర్క మనవసరము. స్వచ్ఛమగు స్ఫటికమున నెల్ల వస్తువులును ప్రతిబింబితములగునట్లాతని నిర్మల హృదయమున గూడ ప్రతి లౌకిక విషయమును సంపూర్ణముగ గోచరమగును. కాని ఇట్టి మహిమ లాతని మనము నాకర్షించినచో నాతడు తన యాదర్శజీవితమునుండి యధఃపతితు డగును."

నాగమహాశయుని సమక్షమున నాతని భక్తులకెట్టి సందేహము ఉదయించినను వారాతని నడుగువారు కారు. మహాశయుడే యాసంగతిని ప్రసంగవశమున నెత్తి వారికి తృప్తియగునట్లు సందియములందీర్చువాడు. ముఖమును జూచి యెట్టి వానియొక్కయు స్వభావమును తెలిసికొనగల శక్తి గలవాడు. ఆతడొకని పక్వభావమునుగూర్చి చెప్పిన వాక్యము లెన్నడును తప్పిపోలేదు. ఒక్కొకసారి భార్యతో నెవరోయొకరు తమ యింటి కతిథులుగ రాబోవుచున్నారనియుఁ దాను అంగడికేగి వస్తువులను కొనివత్తుననియు జెప్పి యాత డంగడికి పోయి మరలి వచ్చునప్పటికా చెప్పినవారు తప్పక వచ్చియుండువారు.

ఒక దినమున నశ్వినీకుమార చక్రవర్తి యను నాతడు శరచ్చంద్ర చక్రవర్తితో మహాశయుని చూచుటకు దియోబాగునకు బయలుదేరెను. అశ్వినికి శూలనొప్పి ప్రతి సాయంత్రమును వచ్చి రాత్రియంతయు నాతని మూర్ఛాబద్ధునివలె పడవేయుచుండెను. ఆ బయలుదేరిననాడు వారు దియోబాగును సాయంత్రములోపల చేరలేకపోయిరి. అందువలన ప్రతి నిముషమును ఆ బాధ యెప్పుడు వచ్చునో యని భయపడుచు పయనము సాగించుచుండిరి. కాని భగవానుని దయవలన నేకష్టమును లేక దియోబాగును జేరిరి. అశ్విని వేళ తప్పుటచే నిక నారాత్రి గూడ

నే బాధయు కలుగునట్లు తోచదని చెప్పగ శరత్ చంద్రుడు సంతసించెను. అయినను మూడు దినములు నిద్రాహారములు లేక బాధపడుచుండిన యాతఁడు ఆ రాత్రి నొప్పి లేకుండుటచే తృప్తిగ భుజించి హాయిగ నిద్రించెను. అట్లు వారిద్దరు సుఖముగ మూడుదినములుండిరి. తరువాత యశ్విని యీ సంగతి జ్ఞప్తికి వచ్చినప్పుడెల్ల "నేను నా పూర్వ దుష్కర్మమువలన ననుభవించుచుండిన బాధయెల్ల నొక్కసారి యా మహాత్ముని దర్శనము సేయగనే యుపశమించెను. అప్పటినుండియైన నాయనను బట్టుకొని యాయన దయకై వేచియుండినచో నీ సరికి నా స్వభావ మెంతయో మారి నా యదృష్టము ఫలింప ముక్తిమార్గమున నెంతయో దూరము పోయియుండును గదా" యని విచారించువాడు.

ఇంకొకతరి నొక బ్రాహ్మణ బాలునికి స్ఫోటకము వచ్చెను. విశంతునను నాతని తల్లి యా బాలుని మొదల జీవితాశ గన్పట్టకపోవుటచే మృత్యుశయ్య నలంకరింపనున్న యా చిరుతని మహాశయునియింటి గుమ్మముముందు బడవైచెను. కాని భగవదనుగ్రహమువలన నా బాలుడు రోగవిముక్తుడయ్యెను. తరువాత సురేశుడు "మహాశయా! యా బాలుడెట్లు జీవించెనని" యడుగ "సురేశా! బాలుడు జీవించినమాట మాత్రము నిజము, కాని ఎట్లు బ్రతికెనో యది నేనెరుగ" ననెను.

వేసవికాలమున నొకనాడు మహాశయుని గృహమున కొకింత ఉత్తరముననున్న పూరి ఇంటికి నిప్పంటుకొనెను. కొలది సేపటిలో నా యగ్నికి వాయువు తోడై యగ్నిని సహస్రముఖముల వ్యాపింపజేసెను. చూచుచుండగనే భయంకరముగ జ్వాలయయ్యెను. మహాశయుని ఇల్లు ఈ పూరి ఇంటికి ముప్పది బారలదూరమున నుండెను. అగ్నికణములన్ని వైపుల [illegible]చుండెను. చుట్టుప్రక్కల ప్రదేశమంతయు కోలాహలమయ్యెను. ప్రతివ్యక్తియు మంటల నార్పుటకు

ప్రయత్నించుచుండెను. మహాశయుని కిది యేమియు దెలియక ముకు లితహస్తుడై యావంతయు కదలక కూర్చుండెను. మహాశయుని భార్య తమ గృహముగూడ నా యగ్ని కాహుతి యగునను భయమున కంపిత దేహయై యింట నున్న సుద్దలు మొదలగునవి యావలకు దీయుచుం డెను. మహాశయు డిది చూచి "యోసీ మూర్ఖురాలా! యింకను ఎట్టి యజ్ఞానమున నుంటివి? ఈ తుచ్ఛములగు వస్తువులతో నేమిచేయుదువు? పరబ్రహ్మమూర్తి యీ రూపమున నీ యింటి కెంతయో దగ్గరకు వచ్చి నాడు, ఆతనికి పూజల నర్పించి ప్రార్థించుటకు బదులుగ నీ స్వల్పము లును నీచములునగు వస్తువులకై దేవులాడుచుంటివా?" యని "జయ్ పరమేశ్వరా! జయ్ సచ్చిదానందా!" యని కేకలిడుచు నృత్యము నేయుచు "మనుష్యుని రక్షించుటకై భగవంతు డున్నప్పుడు భయ పడుదుమేల? ఆయనకు రక్షింప కోరిక లేకున్నచో, నా వ్యక్తిని రక్షించుటకు భూమియం దెట్టి శక్తియును లే" దనెను. తరువాత నా పూరియింటిని భస్మమొనర్చి యగ్ని చల్లారెను. మహాశయునిగృహము చెక్కుచెదర కట్లే యుండెను.

*అర్ధోదయము వచ్చిన సంవత్సరమున నా పవిత్రదినమునకు మూడు నాల్గుదినములకు ముందే మహాశయుడు స్వస్థానమునకు మరలి వచ్చెను. అందువలన దీనదయాళు మిక్కిలి కోపము చెంది "నౌరీ! నీ కెట్టి మతమో తెలియకున్నది. కడు వింతగ నున్నది. ఇది యేమా నీ మతిసారము. వివిధదేశములనుండి వచ్చిన మనుజు లెల్లన నా గంగాతోయముల స్నానము చేసిన చాలు నని వేచియుండు సమయమున వడిపోయినట్లు పరమపవిత్ర మగు గంగానదిని వదలి

---

*ఇది ప్రతి ఏబది సంవత్సరముల కొకమారు వచ్చుచుండును. ఇది పూర్వాచార పరాయణుల కతి పవిత్రదినము.

యిప్పటికి వచ్చితివా? చేతికి దొరికిన రత్నమును బోగొట్టుకొని గాజుపెంకులకై వెదకు నభాగ్యురాలివి నీవు? ఇప్పుడైనను తరుణము మించిపోలేదు. నన్ను కలకత్తాకు గొనిపొమ్ము"ని తీక్ష్ణముగ బలికెను. అంత మహాశయుడు "నాయనా! గంగామతల్లిపై నిజముగ భక్తియున్నయెడల ఆమెయే యీతని గృహమున కేతెంచి పావనము చేయును. అత డామెకొరకై నేనొక చోటికిం బోనేల?" యనెను. ఇంతలో పవిత్రదిన మేతెంచెను. శ్రీమతి హరకామిని, కైలాసబోసు ఇంకను మరికొందరు నాగమహాశయుని భక్తులాదినమున దియోభోగునకు వచ్చిరి. సరిగ నా పవిత్రసమయమున మహాశయుని ఇంటి పెరటియందు ఆగ్నేయదిక్కున భూమి పగిలి మర్మర ధ్వనులతో నీరుబుకుచు పెరటినింపివేయుచుండుటను జూచి హరకామిని నిశ్చేష్టయయ్యెను. మహాశయు డప్పుడు గదిలో నుండెను. ఈ ధ్వని విని యీవలికి వచ్చి యా ప్రవాహమునకు సాష్టాంగపడి "యమ్మా! గంగాభవానీ! జగద్వ్యాపినీ జయము! పాపహారిణీ జయము" అని యతిగౌరవమున కొంత యుదకమును శిరముపై చల్లుకొని మరల సాష్టాంగపడెను. తరువాత నింట నున్నవా రందరును ఆ నీటి యందు స్నానముల నాచరించిరి. ఈ వార్త వ్యాపింపగనే జనులు తండోపతండములుగ వచ్చి యచ్చట స్నాన మాచరించిరి. ఇక మహాశయుని గృహావరణ మంతయు "గంగాభవానికి జయము"ను వాక్యములతో ప్రతిధ్వనించెను. అంత నొక ఘంటకు ప్రవాహ మాగి నీరు తగ్గుట కారంభించెను ఈ యుదంత మంతయు సత్యమని సాక్ష్య మొసగువారు మహాశయుని కాలము నాటివా రిప్పటికి యున్నారు. ఆ పవిత్రతోయముల ముట్టుటవలన ఎన్ని సంవత్సరములనుండియో బాధపడుచున్న హరకామిని రోగవిముక్తురా లయ్యెను. ఈ విషయ మెన్నడును మహా

శయుఁ డెవరితోడను జెప్పలేదు. దానిగూర్చి ప్రశ్నించినప్పుడు కూడ "నయ్యో! కొలదియున్న గొప్పచేయుట మానవస్వభావము గదా" యనును. ఈ సంగతిని వివేకానందులతో జెప్పగా నాతడు "అట్టి మహాత్ముల సంకల్పశక్తి కసాధ్య మేదియు లేదు. వారి సంకల్పశక్తిచే ఎట్టివారును సంసారబంధములు తొలగి ముక్తులు కాగలరన నిక వారి కసాధ్య మేమియుండును?" అనెను.

మహాశయునికి, తనజీవితమందలి ప్రతి కార్యమందును, రామకృష్ణుని పవిత్రసాన్నిధ్యము తెలియుచునే యుండెను. ఒకతరి మహాశయుడు నిద్రించుచుండ నొక మార్జాల మాతనిముఖముపై బడి ఎడమకంటిని గోకెను. అది కొంచెము గాయమై బాధపెట్టసాగెను. కాని దానికై లెక్కసేయక "పూర్వజన్మకృతదుష్కర్మల కిట్లు రామకృష్ణదేవుడు శిక్ష విధించుచున్నాడు. ఇది కూడ తప్పక నాతని కృపయే" యని యూరకుండెను. గాయముకూడ నెక్కువ చికిత్స చేయకయే నిమ్మళించెను. ఆతనికి ప్రతివస్తువునుగూడ రామకృష్ణ స్వరూపమే. జగ మంతయు నాతనికి రామకృష్ణ తేజోమయముగఁ దోచెను.

కలకత్తాలో నుండగా నొకప్పుడు రెండుచేతులలోను ఒక విధమగు బాధ యుదయించి మిక్కిలి కష్టపెట్టెను. ఆబాధ మూలమున నాతడు చేతులను కదల్పలేక నెల్లప్పుడును ముడుచుకొనియుండవలసి వచ్చెను. తా నెల్లప్పుడును ముకుళితహస్తుడై యుండునట్లు గుణపాఠమును నేర్పుటకై శ్రీగురుదేవు డట్లు విధించెనని యాతడు చెప్పవాడు.

శూలనొప్పితో నాతడు బాధపడుచున్నప్పుడు, "జయము రామకృష్ణా! ఈ యస్థిపంజరమును సంపూర్ణముగ నీ పాలుచేయకుండుట

కిది తగినశిక్షయే. ఇది యెల్ల నీ కృపాకటాక్షము. తండ్రీ! ఈ విధముగ నైనను సదా నిన్నే స్మరింపజేసి నీదయకు పాత్రునిగ జేయుచున్నావు. శ్రీ రామకృష్ణుని స్మరింపజేయుటచే నీ బాధగూడ ధన్యతమమైనది. ఓ దేవా! నీకు జయము. నీ కృపకు జయ మగుగాత! ఇది నీ కృపాతేజఃప్రసారమే! తప్పక నీ తేజఃప్రసారమే! నీ దయకుఁ బాత్రుఁ డగుట తప్ప మనుజునకు వేరొండు ముక్తిమార్గము లేద"ని స్తుతించువాఁడు.

మహాశయుఁడు గురుపీఠము నెన్నఁడును ఎక్కలేదు. ఎవ రైనను నేదేని బోధింపుమని కోరిన "ఒకరికి బోధించుట కెవ్వరికిని యధికారము లేదు. కర్మ పరిపక్వము కాఁగానే శ్రీ రామకృష్ణునిదయ ప్రసరింప జ్ఞానచక్షువు తనంత నదియే యున్మీలనమగును. ఆ కంటితో నెచ్చట జూచినను సర్వము శ్రీ కృష్ణమయముగఁ దోచును. అప్పుడు ప్రతివస్తువును వింతరూపముతో గన్పట్టు" ననును.

కాని భక్తు లెన్నఁడేని యధైర్యపడియున్నయెడల "మీరు శ్రీ రామకృష్ణునియెడ విశ్వాస ముంచినప్పుడే మీ కిది తుదిజన్మ యని నమ్ముఁడు. ఎవ్వఁడు హృదయపూర్వకముగ నా దేవాది దేవుని నమ్మునో ఆతఁడు ధర్మపథమునుండి తొలఁగక చతుర్విధ పురుషార్థములను పొందును," అనుచు వారలకు ధైర్యము చెప్పువాడు.

వంగదేశమునందు ప్రసిద్ధ నాటకాచార్యుఁడగు గిరీశ చంద్ర ఘోషు నాగమహాశయుని గూర్చి అర్థగాంభీర్యముగ నిట్లనువాఁడు. "మహామాయ నరేంద్ర (వివేకానంద) నాగమహాశయులఁ దనవల యందు పడవేసికొనుటకు ప్రయత్నించి గొప్ప కష్టమునకు లోనయ్యెను. నరేంద్రుని వశపఱచుకొనుటకు ప్రయత్నింపగా నాతఁడు పెద్దయై

పెద్దదై యామె తలత్రాళ్లు చాలనంత పెద్దయగుటచే విఫలమనోరథయై తన యుద్యమమును విరమించెను. ఇక మహాశయుని బంధించుటలో నాతడంతకంతకు సూక్ష్మమై సూక్ష్మమై యామెత్రాళ్లనుండి తప్పించుకొనిపోవుచు నామెను భంగపఱచెను."

భక్తవర్గము

నాగమహాశయుడు గురువుగ వర్తించుట కెన్నడును ఒప్పుకొని యుండలేదు. ఆత డెవరికిని యుపదేశము చేయలేదు. తాను శాస్త్ర విధిప్రకారమే నడుచుకొనుచు నితరు లావిధిని మీరిన దుఃఖించు వాడు. "శూద్రు డుపదేశముచేయుట కర్హుడు కాడ"ను శాస్త్ర ప్రమాణమును తిరస్కరింప నొల్లడు. కాని యాతని కటాక్ష మహిమచే అనేకుల హృదయములయందు జ్ఞానాగ్ని రగిలెను. ఆతని పవిత్ర సంస్పర్శము అధఃపతితుల నెందఱినో కాచిరక్షించెను. అట్లుండినను తన్నెవరైన గురువుగ నిర్దేశించిన మనసున చాల బాధపడువాడు "నేను అధమజాతి శూద్రుడను. నేనేమి యెరుగుదును? మీ రందఱిచ్చటికివచ్చి మీ పాదధూళిచే నన్ను ధన్యునిజేయుచున్నారు. శ్రీరామకృష్ణ గురువర్యుని దయచే మిమ్ము నందరిని చూడగలభాగ్యమబ్బినందుల కెంతయు ధన్యచరిత్రుడ నైతి" ననును.

బ్రాహ్మణ భక్తు డొక డాతని నుపదేశింపు మని మిక్కిలి బలవంతపెట్టెను. అందుల కాత "డయ్యా! నీవు బ్రాహ్మణుడవు. అందును విద్యాధికుడవు. అట్టి నీవు శాస్త్రవిధుల నల్లంఘించుట తప్పు. శాస్త్ర విధులను తిరస్కరించినందుననే మన మిట్టి దుర్గతి పాలైతి మని దెలియుము. నేను గృహస్థుడను. గృహస్థాశ్రమధర్మమును పాలించుటయే నా ధర్మము. అదియే నా గురువాక్యము. ఆ యాజ్ఞను పిమాత్రమును

జవదాటుటకు నాకధికారములేదు" అనెను. కాని యా భక్తుడు హతాశుడై చాలదీనవదనుడగుటయుఁ జూచి "నాయనా! అధైర్యపడకుము. పరమశివుఁడే నీ కుపదేశింపఁగలవాడు" అని ఆశీర్వదించెను. తరువాత కొంతకాలమున కాతడు వివేకానందునివలన నుపదేశ మందెనని విని సంతసించి యిట్లనెను. "ప్రస్తుతకాలమున శ్రీ గురుదేవుని సన్న్యాసశిష్యులే యుపదేశము చేయుట కర్హులు. వారే సరియైన గురువులు వారివద్ద నుపదేశమందినవారలు ధన్యులు. వారలు తప్పక భగవంతుని యనుగ్రహమునకు పాత్రు లగుదురు."

నాగమహాశయునివద్ద నుపదేశమంది యాతనికి శిష్యులై మెలగుచుండినవార లెవ్వరును లేకపోయినను ఆతని భక్తవర్గము లెక్కకు మిక్కుటమై యుండెను ఆతడు వారల ప్రేమించి వారలెన్నడును ధర్మపథము నతివర్తించకుండునట్లు జాగ్రతతో చూచుచుండువాడు. భక్తుఁడు దూరముననున్నను దగ్గరనున్నను తన సమక్షమున నున్నను లేకపోయినను ఎల్లప్పుడాతని ముక్తిపథగమనాభివృద్ధికై ప్రార్థనల సల్పువాడు. ఒకసారి యాతని భక్తుడొక డాతని జూచువలెనని మిక్కిలి యభిలాషజెంది దియోభోగునకు రానుద్యమించెను. ఆతడు ఢకా కళాశాలలో చదువుకొనుచుండెను. ఆతడు ఢకానుండి నారాయణగంజికి వచ్చుసరికి సాయంత్రమయ్యెను. అది వర్షాకాలమగుటచే రోడ్లు పొలములు మొదలగునవియన్నియు నీటితో నిండియుండెను. నారాయణగంజినుండి దియోభోగునకుఁ బోవు మార్గము శ్రీ శ్రీ లక్ష్మీనారాయణజీ దేవాలయము ప్రక్కనుండి పోవును. ఆనాడు ఆకాశము మేఘావృతమగుట చీకటి మిక్కిలి దట్టమయ్యెను. వాన జోరున ధారాపాతముగ వర్షించుచుండెను. కష్టములలో కష్టములను నట్లాసమయమున నచ్చట నొక నావకూడ దొరకదయ్యెను. ఇక వేరు

మార్గము గానక నా నీటిని ఈది యావలికి జేరుటకు నిశ్చయించెను. నాగమహాశయుని మనసార ధ్యానించి యా గంభీర ప్రవాహమున నురికెను. రాత్రి తొమ్మిదిగంట లయ్యెను. అప్పటికా భక్తుడు చలిచే దేహమంతయు మొద్దుబారి మహాశయుని యింటి కుత్తరమున తేలుచు వచ్చెను. అప్పటి కితని యుద్యమము తెలిసినవానివలె మహాశయు డతనికై గట్టున వేచియుండెను. ఈతని జూడగనే "అయ్యో! ఎంత సాహసమున కొడిగట్టితివి! ఇప్పుడీ పంటభూములన్నియు పాములతో నిండియున్నవి. ఇట్టి నిశీథ మధ్యమున నాకాశము చిల్లులువడునట్లు వర్షించుచుండ నిట్టి యసాధారణ కార్యమును చేయ సమకట్టుట పాడియా? ఎట్టి పని యొనర్చితి"వని మందలించుచుండ, నాతని మందలింపులకుత్తరమొసంగక నాతనివెంట నాతని ఇంటిలోనికి బోయెను. మహాశయుని భార్య కట్టుకొనుటకు పొడి వస్త్రమిచ్చి యట్టి సాహసకృత్య మొనర్చినందులకామె గూడ మందలించెను. అంత నా భక్తు డేడ్చుచు "మహాశయా! మిమ్ము జూడకుండ నుండుట దుర్భరమయ్యెను" అనెను. ఎట్టకేలకు శరత్కుమారి వంట చేయుటకు లోనికేగెను. కాని వండుటకు యెండుపుల్లలు లేకపోయెను. ఇది మహాశయునికి దెలిసి భక్తుడెంత వలదని వేడుకొనినను మానక నింటి వాసమొకదానిని తెగగొట్టి భార్యకిచ్చి "ఏమి? నాకొరకై ప్రాణములను గూడ లెక్క సేయక యిట్టి రాత్రియందు పాములతో నిండియున్న పొలములలో బడి యీదివచ్చిన యీతనికై ఈ మాత్రము చేయవలదా? ఇట్టి వానికెంత కొలది సేవ యొనర్చినను ధన్యుడ నగుదు" ననెను. భక్తుడుగూడ తానా రాత్రి కష్టములనుండి యీవలబడి రక్షింపబడుటకు మహాశయుని కృపయే కారణ మనుకొనెను. ఈవిషయము ను

నాగమహాశయుని గార్హస్థ్య జీవితము

సోదరి నివేదిత తన "The Master as I saw Him" యను గ్రంథమున నతిశయముగ వర్ణించియున్నది.

ఇంకొక సమయమున నాయువకుడే యాత్మహత్య గావింపు కొన సంసిద్ధుడైయుండ మహాశయుడు అతి విచిత్రముగ రక్షించెను. అప్పుడా యువకుడు కలకత్తాలోని మెట్రొపాలిటన్ కళాశాలలో పట్ట పరీక్షకు జదువుచుండెను. ఆ పరీక్షకు జదువు కాలములో నొక నాడాతడు వెన్నెలలో డాబాపై పచారుచేయుచుండెను. చుట్టు ప్రక్కలనంతయు శాంతిప్రదముగ నున్నను ఆతని మనసు విచార గ్రస్తమై క్రుంగియుండెను. నాగమహాశయుని చాలకాలమునుండి చూడకుండుటయే ఇందులకు కారణము. అది యాతని నెంతయో బాధింప దొడగెను. ఆతని యాత్మ యింకను జ్ఞానోద్దీపితము కాలేదు. గురువర్యుడగు మహాశయుని దర్శనరహితము తనజన్మ దుర్భరమయ్యెను. శ్రీరామకృష్ణుని యితర శిష్యుల సాన్నిధ్యమున గొంత శాంతిబొందుద మన్న వా రెవ్వరితని నప్పటికెరుగరు. నాగమహాశయుడు ప్రతి సంవత్సరము వలెనే యా సంవత్సరము గూడ గుర్గాపూజార్థమై పరవులం గొనుటకు కలకత్తాకు వచ్చునని యెరుగును. అయినను ఆతడు అంత వరకు వేచియుండలేక పోయెను. "మహాశయునివంటి మహాత్ముడు కటా క్షించియు ఆనందమయ బ్రహ్మస్వరూపమును గాంచజాలని నా బ్రతు కెందుకు" కని తలపోసి యాతడు డాబానుండి క్రిందికిదుమికి చనిపోవు టకు నిశ్చయించుకొనెను. కాని యాతని వాక్యములు క్రియారూప ముగ పరిణమించునంతలో నానిశీథ మధ్యమున నొకవాణి యిట్లు విన బడెను. "రేపుదయమున నీవు మహాశయుని జూడగలవు". అప్పుడచ్చట నెవ్వరును లేకున్నను, ఈ మాటలెట్లు విననయ్యెనా యని యాతడు చకితుడయ్యెను. వెంటనే లోనికి బోయి పరుండెను.

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్ర

మరునాడు ఆ యువకుడు నిద్రనుండి లేచునప్పటి కెవరో తలుపుతట్టుచు పిలుచుచుండిరి. అంత నాతురతతో లేచి తలుపుదీయు సరికి మహాశయుడు చేతనొక సంచితో ప్రత్యక్షమయ్యెను. ఈతనిఁ జూడగనే మహాశయుడు "ఎట్టి సాహసమున కొడిగట్టితివి. నాకెట్టి యాందోళనమును కలిగించి యిప్పటికిప్పటికి వచ్చునట్లు చేసితివి. శ్రీ రామకృష్ణ సామ్రాజ్యమున ప్రవేశించినతరువాత కూడ నెందుల కిట్లు నిరాశఁజెందెదవు. తొందరపడకుము. ఆత్మహత్య మహాపాపము," అని మందలించెను. మరియు "ఇంతవరకును నీవు లోతునకుబోక, ఒడ్డునకు దగ్గర నేయుంటివి. ఇప్పుడిప్పుడు లోతునకు బోవుచున్నా"వనెను. తరువాత నాతని బేలూరుమఠమునం దున్న శ్రీరామకృష్ణ శిష్యుల దరికిఁ గొనిపోయి "అయ్యా! యీ యువకుడు మిక్కిలి యశాంతిగ నున్నాడు. దయయుంచి యీతడు శ్రీ గురుదేవుని కృపకు బాత్రుఁడగు నట్లాశీర్వదింపు" డనెను.

మహాశయు డొకమారు తన దర్శనమునకై తరచుగ వచ్చుచుండిన శిష్యులతో నిట్లనెను:—"నాయనలారా! మీరు నాకు ప్రాణాధికులు. నావలన మీకెట్టి యుపకారము గలుగవలసి యున్నను నా ప్రాణములనైన నర్పింప సంసిద్ధుఁడనై యున్నాను. అంతకు దక్క నీ యస్థిపంజరమునకు వేరు ప్రయోజనమేమి యుండును."

మహాశయుని భక్తవర్గములో మొట్టమొదట నెన్నదగినది యాయనసహధర్మిణియైన శరత్కుమారి. మహాశయునియింట ఆతిథ్యము గొన్న ప్రతివారు, ఒక దేవకన్యకవలె నామె యింటి పనులన్నియు జూచుకొనుచు, భర్తను, అతిథుల నెట్లు సేవించుచుండెనో, ఎఱిగి యుండిరి. ఉదయమున నందరికంటె ముందుగ లేచి ప్రాతః కాలకృ

త్యాగుల దీర్చి భగవద్ధ్యానమునకు గూరుచుండును. తన భర్తయు నతిథులును భుజించువరకు భోజనముసేయదు. ఆమె యింటిపనులన్నియు స్వయముగనే చేసికొనును గాని తుదకు తన సోదరియగు హరకామినినిగూడ తోడుపడ నియ్యకొనదు. ఆమెకు తనభర్త దక్క నితర దైవమేదియు లేదు. నాగమహాశయునియందే సదా ధ్యానముంచి మనసార పూజించును. ఒకసారి *మహాష్టమి దినమున భర్తకు పాదపూజ సేయ దలపెట్టెను. గాని యందుల కాత డియ్యకొనడయ్యెను. "పూజకు అర్హురాలగు నామె నుండి పూజ నెవ్వడు గ్రహింపనోపును?" అనెను. అయిన నంతటితో నామె యధైర్యపడక సమయము కొరకు వేచి యుండి తుదకొకపరి మహాశయులొకమూల నన్యమనస్కులైయుండగ నా తరుణము గ్రహించి తన కోర్కె నెరవేర్చుకొనెను. తరువాత నామె యాపూల నొక బంగరు ప్రాసయందిమిడ్చి తన మెడలో కట్టుకొనెను.

ఆమె యిప్పటికిని జీవించియున్నది. ఆమె సాన్నిధ్యము మహాశయుని శిష్యవర్గమున కత్యంత ప్రోత్సాహజనకము. ఆ నారీశిరోమణి పవిత్రతయొక్క యాదర్శ స్వరూపము. ఆయమ హృదయకోమలత్వము, శాంతి, ఓర్పు, మానవ సేవయందలి స్వార్థత్యాగము అన్నిటికన్న నామె పవిత్రతయు, తపశ్చరణమును చూపరుల నాశ్చర్యముగ్ధులంజేసి యామెయెడ భక్తిగౌరవముల గలుగజేయును.

నాగమహాశయుడు జీవించియున్నంతకాలమును భక్తులందరును ప్రతిశనివారము దియోబాగునకు బోవువారు. శరత్కుమారి యందరకును ఫలహారాదికములను సిద్ధముచేసెడిది. మహాశయుడు తనయింట ఎన్నడును వర్ణాశ్రమధర్మముల నతిక్రమించియుండలేదు. బ్రాహ్మ

---

* అక్టోబరు నెలలోని నవరాత్రులలోని యెనిమిదవ దినము.

ణులు భుజించునప్పు డాతడు బద్ధాంజలియై గృహప్రాంగణమున నొక పార్శ్వమున నిలబడియుండును. శరత్కుమారి దగ్గరనుండి మిక్కిలి భక్తిశ్రద్ధలతో భోజనమిడును. మహాశయుని గృహమున కరుదెంచినవా రెవ్వరు నొకసాధువర్యుని యాశ్రమమునకు వచ్చినట్లు తలంపక తమ జననీజనకులకడకు వచ్చినట్లే తలచువారు. నాగమహాశయుడు పరలోకగతు డైనతరువాత పూజ్యపాదులగు శ్రీ వివేకానందస్వామి ప్రతివత్సరమును వచ్చునట్లే దియోభాగునకు వచ్చెను. నాగమహాశయుడు, ఇట్లు స్వామి ప్రతివత్సరమును తప్పక వచ్చుచుండునని. తెలియుటచే చనిపోవుటకు ముందాతని స్నానాదికములకు తగునేర్పాటులను గావించియుండెను. స్వామి పూర్వమువలెనే మహాశయుని గృహమునకుపోయి, శౌచస్నానాహారాదికముల దేశాచారమునకు దగురీతి నిర్వర్తించుకొని తన ప్రతిజ్ఞను కాపాడుకొనెను. స్వామి యటనొక దినముండి ఢక్కాకు పోయెను. పోవునప్పుడు శరత్కుమారి యొక్క వస్త్రమొసంగెను. స్వామియద్దాని నక్షీణముగా ధరించి మహాశయుని గుణగానమొనర్చుచు దియోభాగునుండి వెడలిపోయెను. ఢక్కాకు ప్రచారక కార్యముపై పోవుటకు పూర్వము మహాశయుని భక్తుడగు నొకనితో "అచ్చటికేగి యుపన్యాస మిచ్చుటకు నా కిష్టములేదు. మహాశయుని పాదస్పర్శచే పవిత్రమైన యచ్చోటున నే నేమి చెప్పుదు" ననెను. అంత నాభక్తుడు "అయ్యా! ఆయన ఎప్పుడును మౌనముగనే యుండువాడు" అనెను. అందులకు స్వామి " ఆతడు మాటాడవలసిన యవసరమే లేదు. అట్టి మహాపురుషుల చింతాతరంగములు దేశముయొక్క చింతాస్రోతముయొక్క గతిని మార్చివేయగలవు."

మహాశయుని చిన్న మరదలగు హరకామినియు నాతని నేయిష్టదైవముగ బూజించుచు మనసార నాతని పదపద్మములనే ధ్యానించు

నాగమహాశయుని గార్హస్థ్య జీవితము

చుండెను. ఆమె హృదయస్థమగు భక్తియు నిరాడంబర జీవనమును మిక్కిలి కొనియాడదగినవి. మహాశయుడుగూడ నామెయందు ప్రతికా వాత్సల్యముంచి యామె ఇంట జరుగు పూజామహోత్సవ సందర్భములయందెల్ల యామె ఇంటికి బోవువాడు. మహాశయుడులేని పూజ యసంపూర్ణమని యామె విశ్వాసము.

ప్రాపంచికవిషయముల నామెకు నేవిధమయిన సంబంధమును లేదు. రోగముననుశోకముననూ, సుఖముననుదుఃఖముననూ, యెట్టి పరిస్థితులయందును అప్రచలితయై యుండెడిది. మహాశయుని భక్తులనందరి నొక్క కుటుంబములోనివారిగ నెంచి మిక్కిలి యాదరించునది.

మహాశయుని యత్తగారు ఒక గొప్ప భక్తురాలు. ఒకసారి యామె కలకత్తాకు వచ్చి కుమార్తెతోడను అల్లునితోను కుమార్టులీలో బస చేసెను. అచ్చట ప్రతిదినమును గంగాస్నానమాచరించి యచ్చటి మట్టితో శివలింగమును జేసి పూజించునది. ఒకదినమున నామెయట్లు పూజించుచుండ నాలింగము ఊర్ధ్వభాగమున బీటవారెను. అదియామె జూచి మిక్కిలి విచారించి యాదినమంతయు నా నదీతీరమున నేడ్చుచుండెను. చీకటి పడినను యింటికామె రాకపోవుటచే మహాశయుడామెకై వెదకుచు గంగాతీరమున నేడ్చుచున్న యామెను జూచెను. ఆమె యాతనితో జరిగినదంతయుం జెప్పగా నాతడామెను "నీకెట్టి చెడుగును సంభవింప"దని యోదార్చెను. తరువాత నామె యాతనితో నింటికేగి విచారభారమగు మనముతో నిద్రింప నా నిద్దురలో శివుడు ప్రత్యక్షమై "బిడ్డా! నీభక్తికి సంతసించితిని. ఇకమీద నీవు నావిగ్రహమునకు పూజచేయుట యనవసరము" అనెను. ఆమె ఆవిషయమును మరు నాడల్లునితో జెప్పెను. ఆదినము మొదలామె విగ్రహారాధనమును మాని

వైచెను. కారణ మేమని యడుగ "శివుడే నా యల్లుడై యుండ నిక నాతని ప్రతిమ నర్చింపనేల" యని ప్రత్యుత్తర మిచ్చెడిది.

హరప్రసన్న మజుందారుని భార్యగూడ మహాశయుని భక్తులలో నొక పేరుపొందిన యామె. వివేకానందు డామెనుగూర్చి యొక శిష్యునితో "విూ యూరియందు మంచి పాండిత్యమును భక్తియు పొంది యున్న స్త్రీ యామె యొక్కతయే" అనెను. మహాశయు డామె "నమ్మా!' యని పిలుచుచు నామె చేతినుండి భుజించుట కెంతయో ఉత్సాహించువాడు.

ఏ దేశమున నెచ్చోట నెట్టి క్షోభము సంభవించినను అచ్చట మహాశయుడు ప్రత్యక్షమైనమాత్రమున నంతయు నివారణ మగునని యాతని శిష్యులలో నొక గొప్ప విశ్వాసము గలదు. దాని కనుగుణముగా దమ దేశములయందెట్టి క్షోభము సంభవించినచో వా రాతని గొం పోవువారు. ఇట్టి సందర్భముననే యాత డొకనాడు భోజేశ్వరమునకు వెళ్లియుండెను. హరప్రసన్నునియూరు దానికిచేరువ యగుటచే వాతని నచ్చటికి కాతడు పిలుచుకొనిపోయెను. ఆతని భార్య మహాశయుని అంతకుముందు చూచియుండలేదు. తనభర్తయొక్క సాధువునెడ భక్తిగలిగి యుండెనని మాత్ర మెరుగును. ఆమె స్వభావ సిద్ధముగా భక్తురాలు. దానికి తోడెట్టి భగవద్భక్త సందర్శనము లభించెను. అప్పటినుండి యాతని నామె పుత్రునివలె ప్రేమించుచు నప్పుడప్పు డాతని దర్శనమునకై దియోబాగునకు బోవుచుండెను. ఒక దినమున వీరిద్దరును నడచుచు వచ్చుచుండ నొకవైష్ణవియగు భిక్షుకి యెదురువచ్చెను ఆమె యూరికాతకును పరిచితురాలు. ఆమె మహాశయుడొక స్త్రీ వ్యక్తితో (హరప్రసన్నుని భార్యతో) కలిసిపోవుచుంట గాంచి "దుర్గాచరణా! యీపె యెవతె?" యని యడిగెను. అందుల కాత "డీమె నాతల్లి" యనెను. ఆ

నాగమహాశయుని గార్హస్థ్య జీవితము

వైష్ణవి యీయామె యాతని తల్లి కాదని, యాతనిజనని బాల్యమందే గతించినదనియు, యెరుగును. దానిచే "నీమె నీకట్టితల్లి" యని మరల ప్రశ్నించెను. తోడనే యాత "డీమె నాజనని. నిక్కముగ నా జనని" యని మరల ప్రత్యుత్తరమిడెను. అంత నా ముదుసలి "యిప్పుడు నిన్ను సరిగఁదెలిసికొంటిని! నీపేరు దిగంతము వ్యాపింపదగినది. నాయనా! చిరంజీవివై మన మాతృభూమికి కీర్తిని సంపాదింతువుగాక" యని దీవించెను.

హరప్రసన్నుని భార్య చక్కగ పాడగలదు. మధురమగు తన కంఠమున జగన్మాత స్తవము బాడుచుండునప్పుడు "జనని తన్నుగూర్చి తానే పాడుకొనుచున్న"దని మహాశయు డనువాడు.

మహాశయుని జననియగు త్రిపురసుందరికి మాధవి ధాకురాణి యను పెదతల్లిగలదు. ఆమె మనుమని మిక్కిలి ప్రేమించెడిది. మహాశయు డామెను "అవ్వా" యని పిలుచును. ఆమె డక్కాకు సమీపముననొక యూరియందుండెడిది. ఇప్పటికిని ఆదేశమునం దామె గుణ సంకీర్తనము జరుగుచుండును. మహాశయు డామెను జూచుట కప్పుడప్పుడు పోవువాడు.

దియోబాగున కనతిదూరమున కాశీపురమను యూరు కలదు. అందొక మహమ్మదీయుడు మహాశయునియెడ భక్తిగలిగి యుండెను. అతని భావములు ఇతరులకువలె సంకుచితములుగాక విశాలవంతముగనుండెను. అతడు మహాశయు నొకపీరు (భగవంతుని కనుగొనినవాడు)గ భావించి యాతని హితోపదేశములను భగవంతుని యాజ్ఞగ శిరసావహించును. ఈ మహమ్మదీయుడు మహాశయునికి సేవ చేయవలెనని చాల యాశపడెను. నాగమహాశయు డాతనినొక గొప్ప

సాధువునిగ ఎఱిగియుండుటచే యాతనిసేవ నొల్లక, ఆతని నతి భక్తి భావముతో నెదుర్కొనుచుండెను. ఆతడు తరచు మహాశయుని యొద్దకు బోవుచు నాతని పవిత్రగోష్ఠియందుండును. ముదుసలియై యెబ్బది సంవత్సరములవరకు జీవించెను. తన సహధర్మిణి బాల్యమందే కాలగతి నొందినను మరల వివాహము చేసికొనక భక్తిపరుడై జీవితమును అతి పవిత్రవంతముగ గడపెను. సంసారబాధ్యత నంతయు కుమారునిపై బడవైచి నిశ్చింతగ భగవధ్ధ్యానమును సలుపుచుండెను.

మహాశయుడు తరచు ఇట్లు చెప్పువాడు:— "పరమేశ్వరుని యీ విశాల రాజ్యమందు జాతిమత భేదములు లేవు. ఆతని దృష్టి కందరును సమానులు. ఏనామమున నేరూపమునఁ బూజించినను తా నాతని స్వాధీనమందుంటినని మనమున నాతని చరణకమలములనే సర్వదా ధ్యానించుచు నాతనినే శరణుజొచ్చియుండునో ఆత డాదయామయుని కృపకుఁ బాత్రుడగును. వివిధములగు నీ మతము లాతని రాజ్యమును జేరుట కేర్పరుపబడిన వివిధమార్గములు."

నాగమహాశయుని దయకు పాత్రుడై జీవితము మారి సన్మార్గావలంబులైన వారిలో దియోబాగనందలి కాళీకుమార్ ఘోషియా యను నాతడొకడు. ప్రథమమున నాతడు మిక్కిలి బీదవాడు. కాని తరువాత నాతడు దియోబాగునందలి యొక్క సంపన్నునికి దత్తుపోయెను. కాళీకుమారుడు యౌవనమున దుష్టుడుగను జారుడుగ నుండి పెంపుడు తండ్రినుండి సంక్రమించిన ధనమునంతయు వ్యయపరచెను. నాగమహాశయుని సత్సంగతి యబ్బినను ప్రథమమున తా నలవాటుపడిన దుర్గుణములనుండి మరల్చుకొన లేకపోయెను. అందువలన మహాశయుడు మొట్టమొదట నాతని జూచువాడుకాడు. పూర్వపు దుష్కార్యములఁ దలచుకొని కాళీకుమారు డాలోచనాపరుడై యాతనియొద్ద కూర్చుండు

వాడు. ఒకసారి యాతడు తన తల నొక స్తంభమునకు కొట్టుకొనుచుండ మహాశయుడు చూచెను జాలిగొన్నవాడయ్యు నది పైకి దెలియనీక "ప్రతి వ్యక్తియు తన కర్మఫలము ననుభవించి తీరవలయు" ననెను. ఆ యువకుడీతని సాంగత్యమబ్బిన కొలదియు దుర్గుణముల నుండి విముక్తుడై జీవిత మత్యంతపవిత్రతమముగ గడపెను.

హరప్రసన్న మజుందారును గూర్చి యివరలో తెలిపియుంటిమి. ఆతడు మహాశయుని భక్తశ్రేష్ఠులలో నొక్కడు. ఒకసారి మహాశయుడొక భజనసమాజమున భగవత్కీర్తనలఁ బాడుచుండ పరవశుడై స్మృతితప్పి పడియుండుటయు నాతని ముఖమందు బ్రహ్మతేజము మూర్తీభవించి యుండుటయుఁ జూచి యాతడచ్చెరువడి "ఈతని మనస్సు భగవంతునియందు లీనమై యుండనోపును. ఇదియే సమాధి" యనుకొనుచు ఆతని పరిచయము గలిగించుకొనుట కాతురత పడెను. నాగమహాశయునిగూర్చి తెలిసిన కొలదియు నా కోరిక ప్రబలమై యెల్లప్పు డాతనిసన్నిధినే యుండవలెననియు నాతని దర్శనము చేయవలయు ననియు నువ్విళ్లూరుచుండెను. మహాశయుడాతని మిక్కిలి ప్రేమించుచుండెను. మార్గదర్శకములగు మహాశయుని గుణములన్నియు నీహరప్రసన్నునియందు మూర్తీభవించెను. ఆతని విశ్వాసము, నమ్రత, భక్తి, యన్నిటికన్న నెక్కుడగు నతిథిసంసేవనము మొదలగు గుణముల జూచిన మహాశయుని యపరావతార మననొప్పును.

యౌవనమునందతిసుఖలాలసుడుగ నుండిన నతో బారు ముఖర్జీ యను నొక యువకుడు మహాశయుల సాంగత్యమువలన తన జీవితమున నొక గొప్ప మార్పుగలిగి ప్రవర్తించెను. అతనియందలి యొక్క విశేష గుణమేమనగా తనకు సరియనియు ధర్మమనియు తోచినకార్య మెట్టి

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్ర

దైనను అందు ఎంత త్యాగమొనర్పవలసియున్నను ధైర్యవిహ్వలుడు గాక యాతడొనర్చితీర్చువాడు. ఆతనికి కొంత కవిత్వముజేయు శక్తి గూడ నుండెను. ఒకసారి యాతడు భగవంతుడు పాపులను రక్షించుటకొరకై మనుష్యావతార మెత్తెనని యొక నాటకమును రచించెను. అది దియోబాగునందు ప్రదర్శింపగ నాగమహాశయుడు చూచెను. ఆ నాటకమందు నమ్రతయొక్కయు దయయొక్కయు మూర్తియైన నాగమహాశయునివంటి పాత్ర యుండెను. నతో బారు గూడ దియోబాగు నివాసియే. మహాశయుని భార్యను శిష్యులను మిక్కిలి గౌరవించుచు ప్రాణాధికముగ జూచువాడు.

శ్రీరామకృష్ణుని శిష్యులలో అన్నదా ఠాకూ రను నాతడు పేర్వడసియుండెను. చదువను వ్రాయను తెలియకయున్నను ఆతనికి ఈశ్వరునియందు గొప్ప విశ్వాసము. తరచుగ నాతడు మహాశయుని వద్దకు వచ్చుచుండువాడు. మహాశయుడు గూడ నాతని నిరాడంబర వర్తనమునకు సంతసించి ప్రేమించువాడు. ఈతడు ఢక్కాలో నున్నప్పుడు ప్రభుత్వోద్యోగియగు నొక స్నేహితుని గృహమునకు పోవుచుండెను. వివేకానందుడు అమెరికాయందు గడించిన కీర్తికి అతనిపై యసూయజెంది యా యుద్యోగి, స్వామిపై నెన్నియో నేరములను కల్పించి చెప్పుచుండెను. అన్నదాఠాకూరది సహింపలేక "స్వామిజీని గురించి ఇంకొకమాట చెప్పితివా నీప్రాణములు నీకు దక్క"వనెను. ఆదినము మొదలాపురుషుని మఖల నాతడు దర్శింపలేదు. ఆతని యంత్యదివసములు శ్రీరామకృష్ణుని మహాశయుని నామములు నాల్కపై దాండవమాడుచుండ గడచెను.

హరకామినినిగూర్చి ఇంతకుముందే చెప్పియుంటిమి. ఈమె భర్తయగు కైలాసచంద్రదాసుడు గూడ మహాశయుని చరణదాసు

డయ్యెను. నాగమహాశయు డెల్లరను నారాయణాంశులుగ దర్శించుటచే నెవరివల్లను సేవపొందుట కొల్ల డయ్యెను. అయినను ఈతని విషయమునమాత్ర మా నియమము లేకుండెను. ఆత డీసాధువును గురువుగ భావించి అతని యాజ్ఞను ప్రేమతోను నమ్రతతోను శిరసా వహించి సేవ చేయుటయే తన జీవితముయొక్క పరమావధిగ నెంచుకొనెను.

పార్వతీచరణు డనునాత డింకొక భక్తుడు. ఈత డేకాంతమును మిక్కిలి కోరువాడు. మత విషయమో యెన్నడును చర్చింపడు. నాగమహాశయునియం దత్యంతవిశ్వాసము గలిగి యాతనిపై ప్రతివిషయమున నాధారపడి యుండెను. ఇతరులు వేదాంతసంశయములను గూర్చి చర్చించుచుండునప్పు డీతడు నిశ్చలముగ గూర్చొని తన యిష్టదైవమును ధ్యానించును.

మహాశయుని పొరుగింటివా డగు గోపాలచంద్రచక్రవర్తి అతని సాన్నిధ్యమును మొదట చవిజూచిన భక్తుడు. ఆతని నుండి మహాశయుని చరిత్రమును కీర్తియు వినినవా రాతని కెంతయు కృతజ్ఞులు. బాల్యావస్థలో నొక స్త్రీ యాతనికి * మధురభావ ముపదేశించెను.

దానివలన నాతని యందొక నూతనతేజ ముద్భవింప యాతని యందొక వశీకరణ శక్తికూడ యుండెను. భక్తబృందములో నీతడు

---

*భగవంతునిపట్ల భక్తునికి యుండదగు భావములలో నత్యున్నతమైనది. బృందావనమందలి గోపిక లీభావముననే గొలిచిరి. కాని సాధకుడు ఈ భావమును ప్రప్రథమముననే యవలంబించిన యధఃపతితు డగును. గనుక నిది కొంచె మపాయకరమైనది.

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్ర

సత్యగోపాలుడని పేర్కొనబడును. ఈతడు చక్కగ పాడగలడు. మరియు మృదంగవాద్యమున నసమానుడు. నాగమహాశయు డీతని మొదట చూచినప్పుడు "సత్యగోపాలుడు గొప్పభక్తుడు. పూర్ణమగు విశ్వాసము కలవాడు. కాని యీతనికి ఇంద్రియసుఖములయం దాశ ఇంకను వీడలేదు" అనెను. తరువాత నీతనికి మహాశయునితో సంబంధ మెక్కువ యగుకొలదియు తన తప్పిదములన్నియుఁ దెలిసికొని మత్సర భావమును వదలి సాధారణ భక్తిమార్గ మవలంబించెను. నాగమహాశయునిఁ దనగురువుగ భావించుచు నాతని వేదములకన్న మిన్న యని గొల్చుచుండెను.

పైన పేర్కొనఁబడినవారు గాక మహాశయుని భక్తులింకను ఎందరో కలరు. మన మెరుగనివారికెందరుండిరో తెలియదు. అట్లు ఒరుల కెరుకపడుట వారొల్లరు. ఒకసారి మహాశయుని దివ్యరూప సందర్శనముఁజేసిన నెట్టివారైనను నాతని మరువజాలరు. ఎందఱు యువకులో యాతని కటాక్షమువలన తమ జీవితములు మార జీవితము యొక్క పరమావధిని తెలిసికొనిరి. వివేకానందస్వామి అట్టి మహాపురుషుల సాంగత్యమున నైదు నిముషములలో నెట్టివారి జీవితములైనను పూర్తిగ మారి పవిత్రతమము లగునని చెప్పియున్నారు. "మతము గురువునుండి శిష్యునకు సంక్రమించు"నను నీ వాక్య మీతనియెడ సత్యమయ్యెను.

అంత్య దినములు - మహాసమాధి

B. S. 1306 వ సంవత్సరమున నాగమహాశయుడు దుర్గ పూజకు యథాపూర్వము కలకత్తాకు రాలేకపోయెను. ఆ సంవత్సరము నవంబరు మాసమున కలకత్తాలోనున్న చక్రవర్తి యనునాతని భక్తునికి మహాశయుల భార్యవద్దనుండి మహాశయుడు తీవ్రమగు జబ్బుచే బాధ పడుచుండెనని తంతివార్త వచ్చెను. ఆనాడాభక్తుడు శ్రీరామకృష్ణ సమాజ సభయందు "వేదమతము" అను వ్యాసమును చదువవలసి యుండెను. అందువలన నాతని కేమి చేయుటకును దోచకుండెను. కాని యద్భుతానందస్వామి యాతనితో "నోయీ నీకు వేదములగూర్చి చెప్పుట కొన్ని గౌరాతరుణములు లభించును గాని యీ సమయమదప్పిన ప్రత్యక్ష వేదమగు నాతని జూచుట తటస్థింప"దని చెప్ప నాత డాదినమునే దియోబాగునకు పయనమయ్యెను.

మరునాడు చీకటిపడుటకు పూర్వమే దియోబాగు చేరుకొనెను. చక్రవర్తి లోనికి ప్రవేశించునప్పటికి మహాశయుడు తన గది ముందొక (పరదాలచే కట్టబడిన) చావడిలో పరుండి యుండెను. అది శీతకాలమగుటచే చుట్టుప్రక్కలనున్న పొలములనుండి చలిగాలి మిక్కుటముగ వీచుచుండెను. ఆచలిగాలికి యారోగ్యవంతుడే కొయ్యబారి పోవుచుండ నిక రోగిమాట వేర చెప్ప బనిలేదు. ఆచావడికి వైచిన పరదాలుకూడ చినిగిపోయియుండుటచే చలిని ఏమాత్రమును ఆపలేకుండెను. ఈ స్థితియం దాతనిఁ జూచి యట్లాతని నా చావడిలో నుంచుటకు కారణమేమని శరత్కుమారి నడిగెను. అందుల కామె "నాయనా! ఏదినమునుండి యశక్తతవలన మంచము పట్టెనో నాటినుండి మేమెంత ప్రార్థించినను వినక యిచ్చటనే పరుండి యున్నారు. కొలది దినములకు పూర్వము శూలనొప్పివచ్చినది. ఆపైన గ్రహిణిబాధ సంభ

శించినది. రోగము ప్రబలమైనందున నాయాన యనుజ్ఞపై నీకు కంతి వార్త నంపితి"నని ప్రత్యుత్తర మిచ్చెను.

మహాశయులు తన బాధను ఒగులకు తెలుపడు. భార్యతో నొకసారి "నా ప్రారబ్ధము ఫలోన్ముఖమైనది. ఇక కొంచెమాత్ర మనుభవింప వలయు" ననెను. ఈ రోగ మంకురించుటకు పూర్వ మాతని దేహము కృశింప జొచ్చెను. పగటిపూట మాత్రము కొలది భుజించి రాత్రులం దుపవసించువాడు. అంతకంతకు శల్యావశిష్టు డయ్యెను. భార్య యధైర్యచిత్తయై యేడ్వగా "అస్థిమలమాంస భూయిష్ఠమగు నీ దేహమునకై విచారింపకు" మనెను. ఎందరు బ్రతి మాలినను మందుపుచ్చుకొనుటకు సమ్మతింపలేదు.

ఇప్పు డాతని రోగ మతిశయింప నా తెరలమధ్య పరుండెను. ఎందరో ఆతని లోన పరుండుటకు ప్రార్థించిరి కాని విఫలమనోరథు లైరి. జబ్బు సహింపరానిదిగ నుండినను రోగమునకు లొంగక నితర మును మరచి శ్రీరామకృష్ణ నామమునే జపించుచుండెను.

ఇట్లు పదునూడు దినములు బాధపడెను. చనిపోవువరకును చక్రవర్తి పక్కను గూర్చుండి భగవద్గీతలను ఉపనిషత్తులను చదువుచు నొక్కొక్కప్పుడు జగన్మాతను స్తవము జేయుచు, నవసరమగు నప్పుడు సేవ జేయుచు నుండెను. ఆతని కీర్తనల వినినప్పుడు స్మృతిరహి తుడై గంటలకొలది సమాధి నిమగ్నుడై యుండువాడు. సమాధి తీరిన యంతనే నిద్రనుండి మేల్కొను పసిబాలుని చందమున "నమ్మ యమ్మ" యని యేడ్చువాడు. ఆసమయమున నాతని జూచి నచో నాతడు తప్పక సాత్వికమూర్తి యని యనుకొనుట నిశ్చయము. చైతన్యము వచ్చినతరువాత నొక్పుడు "సచ్చిదానంద, అఖండ చైతన్య" యని యుచ్చరించువాడు.

అంత్య దినములు - మహాసమాధి

జబ్బులో నున్నంత కాలమును ఆతని భక్తులు ప్రతిదినమును వచ్చి చూచుచు నొకొక్కప్పుడు రాత్రులు గూడ నచ్చటనే గడుపు చుండిరి. అంతటి యవస్థలో నున్నను మహాశయుడు డాశ్చర్యజనకముగ అతిథి నారాయణస్వరూప మను సిద్ధాంతమును మరువక సత్కరించు వాడు. వారికి త్వరగ భోజనము పెట్టువిషయమునను నిద్రపోవుటకు తగు నుపాయములఁ జేయుసందర్భమునను భార్యను హెచ్చరించుచు అతిజాగరూకుడై యుండెను. వారికి సరిగ సత్కారము జరుగు చున్నదో లేదో యని మిగుల నాతురత జెందువాడు. ఆపదునూడు దినము లొక ఉత్సవమువలె నుండెను. నాగమహాశయు డొకొక్క శ్రీరామకృష్ణులఁ గూర్చి తక్క నితర విషయముల గూర్చి మాటలాడక పోవుటచే నతిథు లాపవిత్ర భావతరంగములయందు మునిగి తమ కష్టములను మరచి యొక్క భగవంతునే సదా ధ్యానించు చుండిరి. తన జీవితమును గూర్చి గాని రోగమును గూర్చి గాని వారెవ్వరైన శ్రద్ధగొని యెట్లుండునో యేమో యని భయము జెందుచో వారితో "నయ్యా! శల్యభూయిష్ఠమగు నీకళేబరముఁ జూచుట కొందుల కంతవ్యయప్రయాసలకోర్చి వచ్చితిరి? ఇది యిక నెంతో కాల ముండదు. ఇది మాటిమాటికి మారుచుండు" ననును.

చక్రవర్తి, మహాశయుడు వ్యాధిలో నున్నప్పుడు రాత్రిం బవళ్లచ్చటనే గడపెను. మహాశయు లొకానొకప్పుడు "ఈశ్వరుడెంత కరుణామయుడు! ఇది యంతయు నాతని కరుణాప్రసార సంజనితమే" యనువాడు. కాని యాతని బాధ జూచి చక్రవర్తి యొకసారి "భగవంతుడు దయామయుడు కాడు క్రూరు"డని యనుకొనెను. నాగమహాశయు డాతని మనోభావము గ్రహించి "నాయనా! భగవానుని దయఁ గూర్చి యీషణ్మాత్రమును సంశయింపకుము. ఈ కళేబరము ప్రపంచ

మున కేమి యుపకృతి చేయగలదు? ఇది యిప్పుడు మంచమెక్కినది. ఈ యవస్థలో నా గృహమున కేతెంచు నారాయణమూర్తులను సేవించ లేకున్నాను. అందువలన శ్రీరామకృష్ణుడు తన యనంతమగు కృపా మహిమచే నీ దేహమును మరల పంచభూతములం గలయునట్లు చేయుచున్నా"డనెను. తరువాత క్షీణకంఠముతో నెమ్మదిగ "దేహము తన జాగ్రత్త యందుండుగాక, దుఃఖములును కష్టములును తమ జాగ్రత్తలో తాముండుగాక. ఓమనస్సా! నీవుమాత్రము దీనియందు కాక యానందమయ ఆత్మస్వరూపమునందే మగ్నమనై యుండుము." అని తన్నుదాను హెచ్చరించుకొనెను.

మరల చక్రవర్తి దిక్కుమొగమై "ఈ దేహమునకై విచారింపకుము. మాంసమజ్జాయుతమగు నీ దేహమును మరచిపొమ్ము. జగన్మాత సంకీర్తనము చేయుము. శ్రీరామకృష్ణ చరిత్రమునే చెప్పుకొనుము. ఇదియే ప్రాపంచిక వ్యాధులను నిర్మూలన మొనర్పగల్గిన యౌషధము." అంత చక్రవర్తి భక్తిపూరితుడై మాతాసంకీర్తన మొనర్చుచు దేహమును మరచెను. కొంతవడికి శరత్కుమారి పిలువగా తెలివివచ్చి చూచునప్పటికి మహాశయులు మంచముపై గూర్చొని యుండెను. చూపులు నాసికాగ్రమున బంధింపబడియుండెను. కను కొలకులనుండి కన్నీరు చెక్కిళ్లపై ప్రవహించుచుండెను. సంకీర్తనము వినుచు నతడు సమాధిగతమనస్కుడయ్యెను. ఆత డట్లు కూర్చొనియుండగా చక్రవర్తి చూచియుండలేదు. ఇర్వురి సహాయము లేనిదే ఒకప్రక్కనుండి యింకొకప్రక్కకు పొరలుటకు కూడ శక్తిలేని యాతడు ఇట్లు కూర్చొనియుండుట వారికి ఆశ్చర్యమును గొల్పెను. చక్రవర్తి శరత్కామిను లది యేమియుపద్రవమును దెచ్చునో యని కంపింపసాగిరి. వా రెట్టకేలకు ఆతనిని నెమ్మదిగ పరుండబెట్టిరి. ఇంతలో మహాశయునికి తెలివివచ్చి జగదీశ్వరీనామ ముచ్చరించుచుండెను.

అంత్య దినములు - మహాసమాధి

ఆ దినమునకంటె నాదినము రోగము వృద్ధియగుచుండెను. కొంచెమైనను ఆహారము లోనికి పోవుటలేదు. క్రమముగా ఎవరైనను ఆతనివద్ద రాత్రులు మేల్కొనియుండవలసినయవసరము వచ్చెను. శరత్తు మరియు చక్రవర్తియు ఒకరితరువాత నొకరు మేల్కొని కనిపెట్టుకొనియుండసాగిరి. ఒకసారి చక్రవర్తి యధైర్యచిత్తుడై వినయముతో "అయ్యా! మీకరుణామృత మొకింత నాపై వర్షింపుడు. మీరీప్రపంచమును వీడినతరువాత నేనెట్లు జీవింపగలను? ఎవరిపై నాధారపడియుండగల?" ననెను. అంత మహాశయుడు "ఇందు భయపడవలసిన విషయమేమున్నది? శ్రీరామకృష్ణపాదముల శరణుజొచ్చిన తరువాత నాయన దయ తప్పక నీపై ప్రసరించునని నమ్ముము. ఎవరాతనిం గోరుదురో వా రాతని దెలిసికొనితీరుదురు" అనెను.

ఈ కాలముననే శారదానందస్వామియు రామకృష్ణోద్యమ వ్యవహారములసందర్భమున డక్కాలో నుండెను. ఆతడు తరచు మహాశయునివద్దకు వచ్చి యాతనిపరిచర్యవిషయమై తన సలహా నిచ్చుచుండెను. ఆతడు మిగుల చక్కగ పాడగలడు. అందువలన మహాశయు డాతని నొకనాడు శ్రీరామకృష్ణులు ప్రేమించు కీర్తనలను పాడుమని కోరెను. అంత నాతడు మూడు కీర్తనలను పాడెను. మహాశయుడు సమాధిగతుం డాయెను. తోడనే శారదానందులు చెప్పినట్లు భక్తు లాతని చెవిలో జగదీశ్వరీ నామోచ్చారణచేసినంతనే తెలివివచ్చెను.

మహాశయునికి తాను దేహమును చాలించుటకు పూర్వము కాళీమాతను పూజింపవలెనను కోరిక యుదయించెను. అందులకొక దినము నిశ్చయింపబడెను. కాళీవిగ్రహమును తీసుకొనివచ్చిరి. శారదానందుడు "యీ ప్రస్తుతావస్థలో ప్రక్కనుండి లేచి యాత డీవిగ్ర

హమును జూచుట కష్టము. అందువలన నా విగ్రహము నాతని పడక వద్దకు గొనితెండు. ఆతడు దర్శించినతరువాత పూజకై మరల మంటపమున బెట్టవచ్చు"ననెను. ఆ ప్రకారమే విగ్రహము నెదుట బెట్టిరి. చక్రవర్తి "అయ్యా! అదిగో నీవు పూజింప నభిలషించిన విగ్రహ మెదురుగ నున్నది చూడు" డనెను. అప్పటికి ఆతడు కండ్లుమూసికొని యుండెను. ఈమాటల వినినతోడనే కండ్లుతెరచి చూచునప్పటికి విగ్రహము కన్పట్టెను. తోడనే స్మృతిరహితుడై "అమ్మా! అమ్మా!" యని కేకలిడి సమాధిచెందెను. జగదీశ్వరీనామము చెవియం దుచ్చరించిరి. కాని యీసారి చైతన్యము రాలేదు. నాడి నిలిచిపోయెను. హృదయచలనము గూడ నాగిపోయెను. శరత్స్వామిని "అయ్యో! మా తాపూజనమును వంకబెట్టి మమ్మలను విడిచిపోయె"నని యేడువ దొడగెను. శారదానందు "డమ్మా! కంపించి యాతని ముందు కేకలిడుము. మరల నాతనికి స్మృతివచ్చు" ననెను. ఈరీతిగ రెండుగంటలు గడచెను. తరువాత హఠాత్తుగ నాత డమ్మాయని కేకలిడుచు మరల ప్రకృతావస్థకు వచ్చి "పూజయైనదా?" యని యడిగెను. అంత చక్రవర్తి "విగ్రహమును మీయెదుట నుంచితిమి. మీయాజ్ఞయైనతోడనే దానిని మండపమున నుంచి పూజింప నెంచితి" మనెను. పిదప నాగమహాశయుని యాజ్ఞపై శాస్త్రవిధిగ తను పూజల నొనర్చిరి.

మరునాటి ప్రాతఃకాలమున చక్రవర్తి "నిన్నటి మీ యవస్థ గాంచినతోడనే. మరల మీ రీప్రపంచమునకు రారనుకొంటి" మనెను. అందులకు మహాశయులు నీరసమగు స్వరముతో "ప్రారబ్ధము కొంత యున్నంతవరకు ఈ దేహము పో"దనియెను.

పూజానంతర మందరును జనని ఈసారి ఈతని కటాక్షించి రక్షించు నని యాశజెంది యుండిరి. కాని మహాశయుడు "జగదీశ్వరి

నన్ను రక్షించుటకు గాక నాయభ్యుదయమును గోరు మిమ్మందరిని దుఃఖములనుండి రక్షించుటకొరకు దయచేసినది. జగన్మాత మీయందరి పై దయ వర్షించి యాశీర్వదించు గాత" యని యనుటచే కాళీపూజ యందలి యాతని భావమును వారు గ్రహించిరి మరునాడు శ్రీరామ కృష్ణుని గూర్చి ముచ్చటించునప్పుడు "మీ కందరకును శ్రీరామ కృష్ణుని చరణకమలములయందు భక్తివిశ్వాసము లుదయించు గాక. నేను తుచ్ఛుడను. నే నెందులకును పనికిరాని యధముడ నని యాత డెరుగును. కాని యాతడు ప్రేమప్రపూర్ణు డగుటచే నన్నాతని ప్రేమ వార్ధియందు ముంచె" ననెను. పిదప 'జయరామకృష్ణ' 'జయ రామకృష్ణ' యనుచు నమస్కరించెను.

మరునాడు మహాశయునికి పితృశ్రాద్ధకర్మలకై యప్పిచ్చిన యతడు అతని చూచుటకై వచ్చెను. మహాశయు లతనికి నమస్కరించి "అయ్యా నీయప్పుల దీర్చలేకయున్నందుల కెంతయు విచారించు చున్నాను. నీ యుదారస్వభావమువలననే నాతండ్రి కంత్య క్రియలం జేయగల్గితిని. కాని నీధనమువిషయమై యాతురత జెంద నవసరము లేదు. నేను చనిపోయిన తరువాత నీ గృహమును నీ యధీ నము జేసికొనుము. నాభార్య పుట్టినింట నుండు" ననెను. ఇది విని యాతడు మిగుల ఖేదించి "అయ్యా! అప్పువిషయమై విచారింపకుడు. నే నప్పుకొరకు రాలేదు. మిమ్ము చూచుటకు వచ్చితి" ననెను. "ఇది యంతయు దేవదేవుని దయ" యని మహాశయులు కొంత వరకు కండ్లు మూసికొని యుండెను.

ఈ సత్పురుషుడు వెడలిపోయిన మూడు గంటలకు మహాశయుని యందొకవింతయగు మార్పు గల్గెను. ప్రక్కమీద నుండలేక ఇటునటు పొరలుచు సంధిలో అప్రసక్తముగ మాటాడ జొచ్చెను. చుట్టుప్రక్క

లంతయు చలిగా నుండెను. అయినను ఎంతసేపు విసరినను వేడి తగ్గ లేదు. ఆతడు "ప్రక్కనుండి లేవవలెనని యున్న" దనెను. అందువలన లేవదీసి కూర్చుండబెట్టిరి. కాని తత్క్షణమే మరల పరుండబెట్ట వలసివచ్చెను. మరల కొంతసేపటివరకు నిశ్శబ్దముగ నుండి మరల సంధిలో మాటలాడజొచ్చెను. ఇంతలో హఠాత్తుగ "రక్షింపుడు రక్షింపు" డని యరచెను. శరత్స్వామిని యేడ్చుచు "నీవేకాదా నీయంత్యసమయమున నెట్టిసంధికిని లోబడనని చెప్పియుంటివి? మరి యిప్పుడెందులకు కలవరపడుచున్నా" వనెను. పిదప నొకగంటకు తెరపివచ్చి నిద్రజెందెను.

ఈ హఠాత్సంధిని గూర్చి చక్రవర్తితో వివేకానందు డిట్లనెను: "ఆ సమయమున నాతని బహిఃప్రకృతిని మాత్రమే చూచితివి కాని లోపల నేమి జరుగుచుండెనో తెలియనైతివి. అప్పు డాతడు లోపల పూర్తిగ తెలివిగలిగియేయుండెను. మనుష్య స్వరూపమున నుండి మనుష్య స్వాభావికములగు బాధల నందకున్నచో నాతడు మనుష్యమాత్రు డని చెప్ప వీలుకాదు. ఇట్టే ఇతర ముక్తపురుషులయందు ఎందఱియందో చూచియున్నాము. జీవన్ముక్తుడగు మహాశయునియం దిదియొకలోపముగ ఎన్నదగినది కాదు. మరియు నాత డెట్టియవస్థయందుండి యిట్లు 'రక్షింపుమని' కేకలిడెనో చెప్పజాలను. ఈ శరీరమునుండి త్వరలో విముక్తుడై యాత్మైక్యసంధానము పొందుటకొరకు కేకలిడి యుండ వచ్చును." ఈ విషయమునే శ్రీయుత గిరీశ చంద్ర ఘోషిట్లు తన యభిప్రాయము దెల్పెను. "శ్రీరామకృష్ణుని శిష్యులలో నెవ్వరును కైవల్యముకొరకపేక్షింపరు. ఒకవేళ అట్లపేక్షించినను నిర్వాణముకొ నందజాలరు. ఎందువలనన 'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' యను గీతావాక్యము ప్రకార మీ జగత్తు నధర్మమునుండి

రక్షించి ధర్మసంస్థాపనము చేయుటకు మాటిమాటికి భగవంతు డవతార మెత్తుచుండవలయును. ఆతనితో నీ సిద్ధులును మహాపురుషులునుగూడ మనుష్యస్వరూపమున వచ్చుచుండవలయును. నాగమహాశయునికి ప్రపంచమున నేమాత్రమును ధ్యానము లేకపోయినను మాయను సంపూర్ణముగ జయించినవా డయినను తాను మరల నిచ్చటికి వచ్చి శ్రీదేవ దేవుని లీలయందు పాల్గొనుటకై ఈ కొలది ఇచ్ఛతో శరీరమును విడిచెను."

ఎట్లైనను ప్రాణము పోవువరకు నతనికి మరల ఇట్టి సంధి రాలేదు.

ఇక మూడుదినములకు చనిపోవుననగా మహాశయుడు చక్రవర్తిని పిలచి పంచాంగముం జూచి "ప్రయాణమునకు మంచిముహూర్త మేర్పరుపు"మనెను. పాపము చక్రవర్తి యిది కడపటిప్రయాణ మని యెరుగడు. అమాయకముగ "పుష్య త్రయోదశినాడు ప్రొద్దున పది గంటలకు ప్రయాణమునకు బాగున్న"దనెను. మహాశయుం డంత "చక్రవర్తీ! నీ వె పైనచో నాడినమున నా కడపటి ప్రయాణము సాగింతు"ననెను. పాపము చక్రవర్తి నిస్తబ్ధుడై కొంతవడికి తెలివి దెచ్చుకొని శరత్కుమారితో నీసంగతి నంతయు జెప్పెను. పిదప నామె "నాయనా! యిక నాయనకై విచారించుటవలన లాభములేదు. మరి యెంతోకాలము జీవింపరు. ఆయన యిష్టమే జరుగుగాక. శ్రీరామ కృష్ణుని సంకల్పమే నెరవేరుగాక" యనెను.

మరణమునకు రెండు దినములకు పూర్వము శరత్కామిని, చక్రవర్తి, మరి యింకొక భక్తుడును శయ్యవద్ద కూర్చొనియుండిరి. మహాశయుడు కండ్లుమూసికొని పరుండియుండెను. హఠాత్తుగ కండ్లు తెఱచి

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్ర

"శ్రీరామకృష్ణుడు తీర్థయాత్రా స్థలములను నాకు జూపింప నిట కేతెం చినాడు. చక్రవర్తీ! పుణ్యస్థలములం గొన్నిటినిఁ జేరొక్కనుము. నేను వానిని చూచెద"ననెను. ఈతని రోగమునకు కొలది దినములకుఁ బూర్వమే చక్రవర్తి హరిద్వారమునకు పోయియుంటచే హరిద్వారముఁ జేరొక్కెను. అంత మహాశయు డుద్రేకపూరితమగు కంఠమున "హరిద్వారము, హరిద్వారము, అదిగో గంగామతల్లి హిమాలయములనుండి మర్మరధ్వనులతో వచ్చుచున్నది. ఆతీరములనున్న వృక్షములు తరంగముల ననుకరించుచున్నవా యనునట్లు నాట్యము చేయుచున్నవి. చూడు మాపైపున చాందీపర్వత మున్నది. ఆహా! ఎట్టి మనోహరమగు ఘట్టము! స్నానమాడుట కెంత సుందరముగ నున్నది. నదీగర్భమునుండి తీరము వరకు నొకదానిపై నొకటి మెట్లుకట్టబడి యున్నవి. దయయుంచి ఒక్క నిముష మాగుము. ఈ యిరువదిసంవత్సరములలో నొకనాడైన నిచట స్నానముచేయలేదు. ఈపవిత్ర తీర్థముల నొక్క మునుకపైచి నాజన్మ మును తరింపజేసికొననిమ్ము" అనెను. పిదప "ఓ గంగాభవానీ! అహః పతితోద్ధారిణీ! పాపప్రహారిణీ!"యని కేకలిడుచు సమాధిచెందెను. మరల స్మృతివచ్చినతరువాత నాతని చూడగా నప్పుడే స్నానము చేసినవాని వలె నుండెను.

తరువాత చక్రవర్తి ప్రయాగక్షేత్రముఁ జేరొక్కెను. అంత నమస్కరించి "యమునాదేవీ! జయము! గంగామతల్లీ! జయము! యిచ్చటెచ్చటనో భరద్వాజాశ్రమ ముండవలయునే. అది నాకిప్పుడు కాన్పింపదేమి? అదిగో గంగాయమునా సంగమము. అదిగో ఆప్రక్క పర్వత పంక్తి. అయ్యో! తాపసారు నాకు భరద్వాజాశ్రమము చూపలేదు." అని సమాధిం జెందెను. అంత కొన్ని నిముషముల యనంతరము "ఇదిగో కన్పడుచున్నవి." మరల కొంచెముసేపాగి "అమ్మా నీవు రాజరాజేశ్వరివి.

నీవు సహాజ శక్తిస్వరూపిణివి. ఏమమ్మా నీవిట్లు తిరుగుచుంటివి? శ్రీ రామా జయము జయము"ని మరల సమాధిని మునిగెను. మరల స్మృతి వచ్చిన తరువాత సాగరతీర్థనామము చేర్కొనబడగా నాగమహాశయుడు సగరవంశోద్ధరణమును ప్రత్యక్షముగ గాంచెను. సముద్రమును దర్శించి మరల మరల నమస్కరింపసాగెను అనంతరము సురేశుడు కాశీక్షేత్రముం జేర్కొనెను. తోడనే "శివభగవానుడా జయము జగద్భర్తకు మంగళ మగుగాక. హరహర మహాదేవ శంభో" యనుచు "ఈమా రీమహాత్మునియందు లీనమగుదు" ననెను. పిదప పూరి, శ్రీ జగన్నాథక్షేత్రములం జేర్కొనిరి. అంత మహాశయుడు "అల్లదిగో దేవదేవుని మందిరము. ఆప్రక్క స్వామి ప్రసాదమును విక్రయించు ఆనందబజా రదిగో." తరువాత నాలుగైదు మారులు శ్రీచైతన్యనామ స్మరణముగూడ చేసెను. అప్పటికి రాత్రి 4 గంటలయ్యెను. నిద్రమత్తు వచ్చుటచే నిద్రించెను. మరల ప్రాతఃకాలమున నెనిమిది గంటలకు మేల్కొనెను. పుష్య త్రయోదశి వచ్చెను. చక్రవర్తి బిగ్గరగ శ్రీరామ కృష్ణనామ ముచ్చరించుచు ఆయనచిత్తరువు నెదురుగ బెట్టి "యిదిగో ఎవరి నామము నుచ్చరించుచు సర్వమును త్యజించి సన్న్యాసిజీవన మట్లు గడిపితివో ఆ నీ గురువర్యుని చిత్ర మిదిగో" ననియెను. మహాశయుడు దానివైపునకుం జూచి నమస్కరించి క్షీణస్వరమున "కటాక్షము కటాక్షము. నీయనంతమగు ప్రేమసాగరమునుండి వెలువడిన ప్రేమ" యనెను. ఇవియే నూతన డంత్యసమయమున నుచ్చరించిన వాక్కులు. ఇవియే నూతని తుదిపలుకులు.

సరిగా తొమ్మిదిగంట లగుసరికి యంత్యచిహ్నములు గన్పట్టెను. కండ్లు కొంచె మెఱుపువారెను. ఏదియో మంత్రముల చదువుచున్నట్లు పెదవు లదర నారంభించెను. పిదప నొకయరగంటకు దృష్టి

నాసికాగ్రమున స్థాపితమయ్యెను. రోమాంచితమయ్యెను. కంఠస్థ నానం దాశ్రువులు నిండెను. పదిగంటల యోగనిమిషములకు మహాసమాధిలో మునిగెను. శరత్కుమారి యాజ్ఞపై నాతని శుభ్రవస్త్రాచ్ఛాదనముగు నొకపరుపుపై పరుండబెట్టిరి. అంతవరకును ప్రాణము పూర్తిగ బహిర్గతము కాలేదు. వెలుపలకు తీసికొనివచ్చిన యైదారు నిమిషముల వరకును ప్రాణముపోలేదు. ఇప్పుడంతయు సమాప్తమైనది. ఈజగన్నాటకమునందలి యొక్క యపూర్వనటుకావతంసి తన పాత్రము ముగియగా తెరచాటునకు బోయెను. అప్పుడుకూడ నాతనిముఖము తేజఃపుంజమై యొప్పెను. సగము మూసిన యాతని కనుకొలకుల నింకను ప్రేమాశ్రువు లొకటి రెండుండెను. భక్తుల యేడ్పులు మిన్నుముట్టినవి. చక్రవర్తి శరత్కుమారినిజూచి "యమ్మా! ఊరడిల్లుము. పిచ్చిదానవు గాకుము. నీభార మాయన మాపై బెట్టి చనెను. నిన్ను సంరక్షించుటకు మీ పెద్దలము మేమున్నార"మనెను. శోకముయొక్క ప్రథమ ఆవేగము కొంచె మణగెను. పిదప నామెయనుజ్ఞపై నొకభక్తు డంగడినుండి నేయి, చందనపుకట్టెలు మొదలగు నుత్తరక్రియలకు వలయు సామగ్రిని దెచ్చుటకు బోయెను.

అనుభవజ్ఞులగు నూరివార లాశవమును పరీక్షించి యింకను వేడిగానున్నదనిరి. దహనసంస్కారముల కావించుటకు కొంత వడి వేచియుండవలయునా యను సందియము వచ్చెను. అంతట చక్రవర్తి "యమ్మా! నాగమహాశయునివంటి యోగీశ్వరుని శరీరమును దహనము చేయుట కింత తొందరపడకూడదు. చనిపోయెనని యనుకొన్న తరువాత కనీసము పండ్రెండు గంటలయినను వేచియుండవలయు"ననెను. అందువలన రాత్రి పదిగంటలవరకు వేచియుండుటకు నిశ్చయించిరి.

మహాశయుని శిష్యు లాతని ఛాయాచిత్రము (ఫోటో)ను తీయుటకు నుద్యమించిరి. అతను బ్రతికియున్నప్పు డెన్నిమారులో

అంత్య దినములు - మహాసమాధి

కోరిరి కాని యాత "శ్రీ యస్థిపంజరముయొక్క చిత్తరువు కొరకెందుల కింత యాతురపడెదరు?" అని వారల నిరుత్సాహపరచుచుండెను. ఇప్పుడు మంచిగంధము పూసి ఛాయాచిత్రమును దీసిరి. ఈ చిత్రమునుండియే ప్రియనాథసింహ యనునాతడు తైలచిత్రమును (Oil Painting) వ్రాసెను. అది యిప్పటికిని మహాశయులగృహము నలంకరించుచున్నది. ఈ పుస్తకమునందు వ్రాసియున్న ప్రతిమ దీనినిబట్టియే వ్రాయబడినది

సంధ్యాపూర్వము శరత్స్వామిని భక్త పాదములను, బిల్వపత్ర ముల చేతను పూలచేతను పూజించెను. పిదప నా మృతకళేబరము చుట్టు నేడుమార్లు ప్రదక్షిణముసల్పి పాడెవను తన కేశజములచే నాతని పాదములను తుడిచెను. అనంతర మాతని కళేబర మలంకరింపబడెను.

మహాశయుని మరణవార్త యూరంతయు ప్రాకెను. ఊరిలో నున్న యాబాలగోపాలము కడపటిసారి యీ యోగీశ్వరుని దర్శించుటకు వచ్చిరి. ఆ గ్రామమందా దినమున ప్రతి గృహమందునను హాహా కారములు మిన్నుముట్టెను.

రాత్రి పదిగంటలగుసరికి గంధపుచెక్కలతో చితియేర్పరుప బడెను. విధ్యుక్తక్రియల జరిపినతరువాత చితికి యగ్ని యంటింప బడెను. చక్రవర్తి చితిపై బిల్వదళముల వేయుచు వ్యాహృతిహోమ మును చేసెను. ఈలోపున శారదానందస్వామి వచ్చి చితిముందు సాష్టాంగపడెను. మూడు గంటలలో దహనమైపోయెను. శరత్స్వామిని చితినార్పెను. భక్తులా బూడిదను మట్టి ధన్యులైతిమని తలచిరి. ఇట్లు తండ్రి గతించిన మూడు సంవత్సరములకు తన నలుబదినాల్గవ సంవత్స రమున తన జన్మస్థానమున స్వగృహమున నాగమహాశయుని భౌతిక శరీరము అదృశ్యమయ్యెను. బూడిదమాత్రమే మిగిలినది.

తరువాత శారదానందుని యాజ్ఞప్రకార మాతనిచే రచింప బడిన యొక కీర్తనమును, ఈ బూడిదను ఒక పాత్రలో నుంచి యా

శ్మశానవాటికలో పూడ్చిరి. దానిపై యాతని సంతోషసమయమున నారాధించిన కాళికావిగ్రహమును ప్రతిష్ఠించి దానిపై యొక సుందరమగు నాలయమును నిర్మించిరి.

ఆతని యప్పులనుగూర్చి, తగు నేర్పాటులను గావించి శారదానందస్వామి డక్కాకు బోయెను.

పరిశిష్టము

నాగమహాశయులచే విరచితంబులగు కొన్ని గీతములు:—

౧

గిరివర! ఆర్ కొబే జాబే ఉమార్ ఆనితే కైలాసభవనే
నాహేరియా బిధుముఖహృదయే దారుణదుఃఖ కొత్ ఆర్ సహిబో జీబనే॥

శునియా శివేర్ రీతి, హృదయే ఉపజేభీతి,
భూతప్రేత సఙ్గేసాథీ, థాకేనాకి శ్మశానే॥
కిశొబ్ తాహార్‌గుణ్, కపాలే జ్వాలే ఆగున్.
సిద్ధితే ఒఢోనిపూర్ణ్, ఆపన్ పర్ నా జానే॥
దీన అకించనే భాషే, తుష్టకారి అశుతోషే
ఆనహ ప్రాణేర్ గౌరీ, నైలే మొరిబోపరాణే॥.

ఓ హిమవంతుడా! ఉమాదేవిని కైలాసమునుండి గొనివచ్చుట కెన్నడు బోదువు. ఆమెయొక్క వియోగమువలన దుఃఖము నిక భరింపలేవు. ఇక నెంతకాల మిట్లు జీవింతువు? నీ యల్లుడైన శివునిరీతి విని హృదయము తల్లడపడుచున్నది. భూతప్రేతములతో సఖ్యముగలిగి దిగంబరియై శ్మశానమున నుండును. ఆతని గుణముల నెన్ని చెప్పగలను? హస్తమునందు కపాలము. ఒందు జ్వలించుచున్న యగ్ని. సిద్ధులయందు

మిక్కిలి నిపుణుడే కాని తన గమ్యస్థాన మెఱుగడు. నేనేమి చెప్పగలను? దీనుడను. భాషాజ్ఞాన మత్యల్పము. అల్పసంతోషిని. ఏమి స్తుతింపగలను? గౌరీదేవి ఈతని నడవడిఁజూచి మూర్ఛిల్లినదో లేక చనిపోయినదో చూచిరమ్ము.

౨

(కాళీ) ఆమి దినే దినే ఖిణ్ణమొనే
భబజ్వాలాయ్ జ్వలే మొరి।
దయాకొరొ నిజగుణే అర్ జే జ్వాలాసయితేనారి॥
ఎఖొన్ డెఖాదిబేకి నాయి, కి కొరిబే బొల్ తాయి!
దీనే దర్శన్ చాయి, దోహాయి లాగే త్రిపురారి॥
శక్తిభక్తి కిఛుయి నాయి, నిజగుణే దేఖాచాయి
అకించనే దేహతాయి, శ్రీచరణే దయాకొరి.

కాళీ! నేను దినదినమును ఖిన్నమనస్కుడనై సంసారాగ్నిం బడి మరణించుచున్నాను. నీ సహజ దయావీక్షణముల నన్నుజూడుము. లేకున్న సహింపలేను. తల్లీ! ఏమిచేయుదువో చెప్పుము. దీనుడను. నీ దర్శనమే యపేక్షించుచున్నాను. త్రిపురారీ! నాకు నీకరావలంబన మొసగుము. శక్తిగాని భక్తిగాని నా కావంతయు లేదు. నీ సహజగుణము చేతనే నన్ను దయచూచి యుద్ధరింపుము. తుచ్ఛమగు ఈ శరీరమును నీ మంగళచరణముల నుంచగోరుదును. కటాక్షింపుము.

౩

కాళి కౌథాగో తారిణీ, త్రిగుణధారిణీ
కైలాసవాసినీ, హరమనోరమా, హరమనోమోహినీ
కృపాకొరో మాదీన్ పుణ్యహీనంచజనే, స్వగుణే నిస్తారిణీ;

అపరాజన్మహరా, భక్తిముక్తి దాయినీ,
తారా బ్రహ్మమయీ, పరాత్పరీ, వాంఛాతీతప్రదాయినీ
(ఒగోమా)కే జానే తోమార్, మహిమా అపార్
అనన్త గుణాధార్, అవ్యక్త అచింత్యరూపిణీ,
కొతో యోగీ ఋషి యోగాసనే, దివానిశి ఏకమనే
భావియే నాపాయ్ ధ్యానే నిఖిల - బ్రహ్మాండ - జననీ
ఆమి దీన, జ్ఞానహీన, క్రియాహీన, భజనవిహీన
కి జాని మాహాత్మ్య, నిజగుణే త్రాణ్ కోరో దియే చరణ తరణీ॥.

కాళీ! త్రిగుణధారిణీ, కైలాసవాసినీ, హరమనోహారిణీ! హర మనోమోహినీ, స్వర్గతారిణీ, జన్మనిర్మూలినీ, భక్తిముక్తి దాయినీ, దుర్గా, బ్రహ్మమయీ, పరాత్పరీ, వాంఛాతీత ప్రదాయినీ ఎచ్చట నుంటివమ్మా? పుణ్యహీనుండగు ఈ దీనునిపై నీ కృపామృతమును వర్షింపుము. ఓ జననీ! నీయపారమగు మహిమ నెవ్వ డెఱుంగగలడు? అనంత గుణధారిణివి, అవ్యక్త అంచిత్యరూపిణివి. ఎందరో యోగులు, ఋషులు యోగాసనములందుపవిష్టులై, రాత్రిందినము లేకాగ్రచిత్తములతో భావించి భావించి నిఖిల బ్రహ్మాండ జననివగు నిన్ను ధ్యానమున గన్గొనలేకయున్నారుగదా! నేను దీనుడను, జ్ఞానరహితుడను, క్రియాహీనుడను, భజన విహీనుడను నీ మాహాత్మ్యమే మెరుంగగలను? నీ స్వగుణముల చేతనే నన్ను తరింపజేయుము.

౪

(ఒగో) శ్యామా మా ఆమార్
కేవల్ ముఖేర్ కొథా హోలో సార్
తుమి జే ఆమార్ సర్వస్వధన్,
తాతో అన్తరేర్ సహిత్ భావినా ఏక్ బార్.

ప రి శి ష్ట ము

మొవే కోరి ఛాడి విషయవాసనా,
సార్ కోరి తవ నామ - ఉపాసనా,
కిన్తు కర్మఫెరే కిఛుమాహాలోనా,
నిజగుణే ఏబేకోర్ మానిస్తార్.॥

మనేరే బుఝాయిజత్, కిషుతే నాహోయ్‌నత
అకిఞ్చన పదాశ్రిత, యన్త్రణాసహె నాఆర్.

ఓ శ్యామజననీ! నా ముఖమున నీగుణగానమే యొప్పుచున్నది. నా సర్వస్వమగు నిన్నే అంతరంగమున భావించుకొను చున్నాను. మనస్సునందలి విషయవాసనను విసర్జించి నీ నామోపాసనమే చేయు చున్నాను. కాని కర్మమాత్రము మారినదికాదు. దయగాని నీ సుంగ శేచ్ఛచే నన్నుద్ధరింపుము. మనస్సున కెంత తెలిసికొంటినో కానికి కొంచమైనను వినీతుడ నగుటలేదు. అల్పుడను. నీ చరణములనే ఆశ్రయించుకొన్నాను. ఇక నీ బాధను సహింపలేను.

౨

ఆజి ఏకి హేరి శుభ అపరూపదర్శన్!
ధరాగో ఆసితేన్ మా, కరుణామయీ, కరిబ్రే ఆలోకా॥

తప్తకాంచన వరణీ, హాస్యయుతా త్రినయనీ;
వదనే ఝుల్‌కే కొతౌ బేశర్ మణి,
గళే హార్ గజముక్తా, రక్తవస్త్ర పరిధాన్॥

నానా అలంకార భూషిత, రూపే త్రిజగత్ మోహిత
దశభుజే సుశోభిత
ఆయుధ తన్త్రి శంఖచంక్ర ధనుర్బాణ్॥
అమలకమల దళనిందిత - చరణతల.

కిబా తాయ్ సునిర్మల్,
నఖర్ ఛతే ప్రకాశే సితశశీ సుశోభన్॥

శ్రీ నాగమహాశయుని జీవిత చరిత్ర

దిబానిశి ఒరూప్ హేరి, బాలా యువ ఆది కొరి,
జత్ సబ్ నరనారీ
పాశరిలా శోకదుఃఖసబే పుంకితమన్॥

భావేచిత గద్‌గద్, దియే జబాశోకనద్,
పూజే మాయేర్, అభయపద్,
అతుల శోభాసమ్పద యోగిగణేర్ హృదయధన్
కలుషనాశియే తారా,
పుణ్యస్రోతే భాసాతే ధరా,
అకించనే దియేధరా,
దహి ఒ రాఙ్గా చరణ్.

అమ్మా! నేడిట్టి యపురూప వేషమునుధరించి వచ్చితివేమి? మదగజము వాహనము, తప్తకాంచన దేహము, హాస్యయుతవదనము, త్రినయనములు, వదనమున ప్రకాశించుచున్న బేసరిమణి, కంఠమున ముత్యాలహారము, రక్తవస్త్రము పరిధానము. ఆహా! నానాలంకార భూషితవు త్రిజగన్మోహన రూపధారిణివి. దశభుజములచే విరాజిల్లుచున్నావు. శంఖచక్ర ధనుర్బాణాదికముల ధరించియున్నావు. పద్మములను ధిక్కరించు చరణయుగ్మము. ఆహా! ఎట్టి నిర్మలరూపము నఖములు శుభ్రచంద్రికలతో నెకసక్కెము లాడుచున్నవే! అమ్మా! ఎల్లప్పుడీరూపమునే ధరించి స్త్రీలను, పురుషులను, బాలురను వృద్ధులనందరను శోకదుఃఖములచే పులికింప జేయుచున్నావు గదా!

అతుల శోభాసంపదములను, యోగిగణ హృదయధనమును అభయప్రదములును అగు నీ పాదపద్మములను భావావేశమున గద్గదిక చెంది చెంగల్వలాది పుష్పములచే పూజింతును. నీవు కలుషములను నశింపజేసి పుణ్యస్రోతమున నీదలాడింప జేతువుకదా! తల్లీ నాకు నీ చరణకమలముల నాశ్రయ మొసంగుము.